
ఆంధ్రపత్రిక

సచిత్ర వార పత్రిక



4 అణాలు
31-12-'52

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY



పంచతంత్రం
మిత్రలాభం
కర్త... విశ్వాత్ముల నరసింహమూర్తి
విష్ణు శర్మ
"పూర్వ మొకప్పుడు కాకీ, జింకా, ఎలుకా, తాబేలు, నాలుగు కలిసి స్నేహంతోటే కష్టాల్ గడిచీ హాయిగ ఉంటూ ఉన్నాయి!"
"ఆకథ ఏమి దానిపైనమేమి?"
పూర్వం మహిళా పురప్రాంతంలో బూరుగు చెట్టొకటుండేది. చెట్టుకొమ్మలలో లఘుపతనకమను వాయసమొక్కటి నివాసమున్నది.
లఘుపతనకుడొక వేకువ జామున మేతకు పోదామనుకుంటుంటే వేటగాడొకడు ఎదురైనాడు
ఈ నాడెవరికి కీడు మూడెనో చూదామనుకొని లఘుపతనకుడు కొమ్మలలోనే దాగాడు వేటగాడు వల పన్నాడు పిట్టలు పడునను ఆశతో గింజలు చల్లి దూరముగ దాగున్నాడు.
ఇంతలోన ఆకాశ మార్గమున-చిత్రగ్రీవుడనే కపోతపతి- పరివారసమేతంగా పోతూ- నేలమీదగల గింజలు చూసి- నేలవ్రాలి ఆవలలో చిక్కెను.- వద్దు వద్దనే లఘుపతనకుడు- అరచిన అరుపులు వినకుండా అవి- వలలో పడి దుఃఖించాయి.
పక్షులు పడుటను చూచిన బోయడు పొంచి పొంచి రాసాగాడు
"వేటకాడు యమదూతమాదిరిగ మీదిమీదికే వస్తున్నాడు ఇప్పుడు మనమెల్లర మొక్కటియై మెలగినచో యీ ఆపద తప్పును మనలో మనమూ కలహిస్తే మరి మునుపా భేరుండాలకు పట్టిన గతియే మనకూ పడుతుంది."
"ఆకథఏమి? దానిపైనమేమి?"
పూర్వమొక కొలని దరి- గండభేరుండాల- గుంపొకటి వుండేది -ప్రతి రెండు పక్షులకు -మెడలు వేర్వేరుగా- కడుపొకటిగా వుండి మైత్రితో తిరిగేవి.
ఒక రోజు నొక జంట అందందు తిరుగుతూ మధువు నిండిన దొన్నె నొకదాన్ని చూచాయి
ఒక తల:
"మన కిద్దరికి వుదర మొక్కటే కనుక యీ మధువు నన్నే త్రాగ నిమ్మోయి తమ్ముడా!"
"తమ్ముడో, గిమ్ముడో- తరువాత చూదాం -ఉదర మొకటే గాని- రెండేసి నాలుకలు -వున్నాయి కదా?- నా నాల్కతో మధువు -రుచి చూడ రాదా?"
"నువ్వు తాగితే నాకు రుచి యెట్లు తెలియు!"
"మధువు రుచి నీకేన? నాకుమాత్రం వలదు!"
1

సంవత్సర చందా
రు 12-0-0
విడిప్రతిక 4 అ॥


ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder K NAGESWARA RAO

సంపుటము 45
సంచిక 19
31.12-52

నందన పుష్య శుద్ధ పౌర్ణమి బుధవారము



చంద్రగిరి దుర్గంలోని రాజమందిరం

ఫోటో: శ్రీ జి. సత్యనారాయణశాస్త్రి (చిత్తూరు)

ముఖచిత్రం :—లతామంగేష్కర్

(బొమ్మల కథ)

లోగడ ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రికలో సీరియల్‌గా ప్రకటింపబడిన 'మిత్రభేదం' బొమ్మల కథ త్వరలో పుస్తక రూపంలో వెలువడనున్నది.

—సంపాదకుడు.

మాకు కథలు, గేయాలు, చిత్రాలు, ఫొటోలు పంపేవారు వానిని త్రిప్పి పంపగోరినట్లయితే, రచనలూ చిత్రాలతోపాటు అవసరమైన స్టాంపులను గాని, స్టాంపులు అంటించి చిరునామా వ్రాసిన కవర్లనుగాని చేర్చి పంపవలసిందని మనవి. స్టాంపులను పంపేవారికి మాత్రమే వారి రచనలను గాని, చిత్రాలనుగాని ప్రచురించే ముందు ప్రచురణ విషయమై తెలియ పరచగలము. ఈ సందర్భంలో రచయితలు, చిత్రకారులు మాకు సహకార మివ్వగలరని ఆశిస్తున్నాము.

తనిసిరే వేల్పు లుదధిరత్నములచేత ?
వెఱచిరే ఘోర కాకోల విషముచేత ?
విడిచిరే యత్న మమృతంబు వొడము
దనుక ?
నిశ్చితార్థంబు విడువరు నిపుణమతులు.

తా॥ అమృతమునకై పాలసముద్రమును మథించిన సమయమందు అనేక రత్నములు అందులోనుంచి ఉద్భవించెను. దేవతలు ఆ రత్నములను చూచి సంతోషించిరా? లేదు. ఆ సముద్రములో పుట్టిన కాలకూటమనే విషమునుచూచి భయపడినారా ? లేదు. అమృతము ఉద్భవించేవరకు తమ ప్రయత్నమును విడిచిపెట్టిరా ? లేదు. కనుక, మంచిచెడ్డలెరిగిన నిపుణమతులైన వారు తమ సంకల్ప మీడేరువరకు దానిని విడిచిపెట్టరు.

ఈ పద్యం చదవడానికీ, చదివి ఆనందించడానికీ బాగానే ఉంది. కాని, అందులో చెప్పిన విషయము అనగా కథా సందర్భము మనకు ఎంతవరకు నమ్మతగినదో మనకే తెలియదు.

వేల్పులు అంటే దేవతలు. వీరినిగూర్చి మనము పురాణాలలో చదవడము వినడము మాత్రమేగాని వారు ప్రత్యక్షముగా పరిపాటిగా మనకు కన్పించే జాతివారు కారు. అది యట్లుండగా, మథింపబడిన పాలసముద్రము ఎక్కడ ఉన్నదో అది కూడా మనకు తెలిసిన సముద్రం కాదు. దేవతలు అనే జాతివారు పురాణకాలంలో ఒకప్పుడు ఉండేవారనిన్నీ, వారున్నూ రాక్షసులున్నూ కలిసి ఒక పర్వతానికి ఒక పెద్దపామును కవ్వపుత్రాడుగా కట్టి పాలసముద్రమును మథించియుండిరని మాట వరుసకు అంగీకరిద్దాం. ఆ విధంగా మథించడంవల్ల హాలాహలం పుట్టి లోకాలను భస్మం చేయడానికి సిద్ధమైనదన్నారు. ఈ హాలాహలమును అప్పుడు శివుడు వచ్చి మ్రింగివేసినాడన్నారు. కౌస్తుభమణి అనేది శ్రీ మహావిష్ణువు మెడలో తగిలించుకొన్న గొప్పకోహినూరు వజ్రంవంటి అమూల్యరత్నం అని ఊహించుకుందాం. అటువంటి అమూల్యరత్నాలు ఆసముద్రమథన సందర్భంలో ఆ సముద్రంలోనుంచి ఉద్భవించాయి. కాని, ఆ రత్నాలను చూచి దేవతలు ఉబ్బితబ్బిబ్బుకాలేదట. అంతమాత్రముచేత ఆసముద్రమథనమును చాలించలేదట. ఇంకా కొంతకాలము ఆ పాలసముద్రమథనమును పట్టుదలగా సాగించారు. అప్పుడు చిట్టచివరకు ఆ సముద్రంలోనుంచి అమృతము ఉద్భవించినదట. ఈ అమృతము లభించినపిమ్మట దేవతలున్నూ వారితోపాటు రాక్షసులున్నూ సముద్రమథనం ఆపివేశారు. చిట్టచివరకు వీరికి లభించిన అమృతం ఎట్లా ఉంటుందో మనకు తెలియదు. అది మనకు తెలిసిన పరిచితమైన పదార్థము కాదు. దీనియొక్క ప్రభావం చాలా గొప్పదని మాత్రము విన్నాము. అమృతం అనేది పాలు, పాయసంలాగున వర్ణించబడిన ద్రవపదార్థం అని వర్ణింపబడి ఉంది. దానిని త్రాగినవాళ్లు నిత్యయౌవనులై ఉంటారట. దానిని త్రాగినవాళ్ళకు మృత్యువు అనేది సంభవించదు. దేవతలు యీ అమృతాన్ని త్రాగిన పిమ్మటనే మృత్యుభయంగాని వ్యాధిభయంగాని, లేకుండా చిరంజీవులై నిత్యానందపదవిని అనుభవిస్తున్నారనిన్నీ మనము ఊహిస్తున్నాము. కాబట్టి యీ అమృతమును సేవించిన తర్వాతనే దేవతలు మరణభయం లేనటువంటి అమరులై ఉంటారు. దానిని మథించి సాధించి సేవించక పూర్వము దేవతలకు అమరత్వము లేదని అర్థం చెప్పాలి. కాబట్టి అమరత్వంలేని దేవతలు ఒకప్పుడు ఉండేవారు. వారు అమృతంతాగి ఆటు పిమ్మట అమరులైనారు. అనగా మృత్యుభయం లేని వారైనారు.

పాలసముద్ర మథనం చేసినప్పుడు

మందర పర్వతంతో మథనం చేశారు. ఆ పర్వతాన్ని మోయుటకు శ్రీమహావిష్ణువు కూర్మావతారం ఎత్తి యున్నాడు. ఈ కూర్మావతారం హయాములోనే దేవతలకు అమృతం లభించింది. కూర్మావతారమునకు పూర్వపు అవతారము మత్స్యావతారము. ఈ మత్స్యావతారం కాలంనాటికి దేవతలు అమృతం అంటే ఏమిటో ఎరుగరని అర్థమౌతోంది. అప్పటి దేవతలకు అమరత్వం అనేది లేదు. అంటే ఏమిటి? అప్పటి దేవతలకు యింకా మృత్యుభయం ఉండేది. వ్యాధి భయం, వార్ధక్య భయం ఉండేది. అప్పటికి వారింకా నిత్యయౌవన సిద్ధికి అక్కరకు వచ్చే వాజీకరణ తంత్రాలనుగూర్చి గాని, కాయకల్ప చికిత్సలగూర్చి గాని, సంజీవినిగూర్చి గాని, అమృతమునుగూర్చి గాని, వ్యాధినిర్మూలక, ధాతువర్ధక మూలికలగూర్చి గాని, పర్వతప్రాంత పరిశోధన లింకా చేయలేదని గ్రహించాలి.

"పాలమున్నీటిలోపల
సర్వతృణలతౌషధములు
దెప్పించి చాలవైచి"
"మందరశైలంబు
మంథానముగ చేసి."

ఈ వర్ణన చూస్తే అనేక మూలికలను పాలలో వేసి పెద్ద సన్నికల్లుతో ఒక కల్వంలో మర్దించినారేమో అని ఊహించవలసి వస్తుంది.

చిట్టచివరకు యీ పరిశోధన ప్రయోగ ప్రక్రియల మథనమర్దన ఫలితంగా లభించిన దేమిటయ్యా అంటే–

"చావులేనిమందు చక్కగ మనకబ్బె" అని సంతోషించారు. ఆఖరుకు యీ అమృతం అనేది ఒక "మందు" అని నిరూపించారు. బహుశః అది సర్వరోగ నివారిణి యైనట్టి లేదా బహు రోగనివారిణి అయినట్టి అపూర్వమైన ఔషధం కావచ్చు. దానినే అమృతం అన్నారు. దానినే అమృత రసాయనం అనవచ్చు అమృతాంజనం అన్నా అనవచ్చు, ఇది ఒక ప్రాచీన మహాయుగంలో జరిగిన మూలికా పరిశోధన. ఆనాడు మృత్యువును జయించే మందును కనిపెట్టవలెనని మహా ప్రయత్నం, మహా పరిశోధన జరిగిఉండవచ్చు.

(1)దేవతలు, (2)పాలసముద్రం, (3)అమృతం—ఈ మూడున్ను మనము చూచినవి కావు. కాని వాటినిగూర్చి చిరకాలముగా మనము వింటూఉండడంవల్ల వాటినిగూర్చి కొన్ని నమ్మకాలు, కొన్ని భావాలు మన మనస్సులో పాదుకొని పోయినాయి.

కార్తీకమాసంలో క్షీరాబ్ధి ద్వాదశి అనబడే ఒక పర్వదినం వస్తుంది. దానినే చిలుకుద్వాదశి అని కూడా అంటారు. దేవతలు పాలసముద్రమును చిలుకుట అప్పుడు జరిగియుండెననియు అమృతము అప్పుడు ఉద్భవించినదనియు, జ్ఞాపకము చేసేనిమిత్తమై ఆనాడు పెద్దవాళ్లు పూజలుచేస్తారు. పెద్దఉసిరికచెట్టు క్రింద యీపూజచేయడం ఆచారం.

ఈ పెద్ద ఉసిరికచెట్టు యీ కార్తీక మాసంలో పిందెలు బాగా వేస్తూఉంటుంది. ఉసిరిక కాయలు ధనుర్మాసం నాటికిగాని, సంక్రాంతి నాటికిగాని ఊరగాయ వేసికొనుటకు కావలసినంత పెద్దవి అవుతాయి. ఈ ఉసిరికచెట్టు చాలామంచిదని ఆయుర్వేద వైద్యశాస్త్రం విశేషంగా కొనియాడియున్నది. దానికి "అమృతఫలం" అనే గౌరవనామకరణం ఒక భిషగ్వరుడు చేశాడు. అమృతఫలములు చెట్టునిండా కాచి సమృద్ధిగా ఉద్భవించేకాలము యీ చిలుకు ద్వాదశి.

ఇటీవల అనగా గడచిన యుద్ధకాలంలో యీ పెద్ద ఉసిరిక కాయలలో ఉండే ఆహార జీవధాతువులను గూర్చి మన దేశంలోనే పరిశోధనలు చేశారు. ఈపరిశోధనల ఫలితంగా ఒక విషయం తెలిసికొన్నారు. ఈ ఉసిరికపండులో ఉన్నటువంటి ఆహార ధాతువులను బట్టీపట్టినట్లు గా తీసిచిన్న మాత్రలుగా చేసినట్లయితే, మనిషి అయినవాడు ఏ విధమైన ఆహారమునున్నూ తినకుండానే, ఒక మోతాదు లెక్కప్రకారముగా యీమాత్రలను మ్రింగుతూ ఉండినట్లయితే, ఎన్ని దినములైనా నిర్భయంగా జీవించవచ్చునన్నారు. ఇతర ఆహార భోజనమువల్ల భుక్తాయాసం కలుగుతుంది. ఆ భోజనమును జీర్ణము చేసికొనుటకై జీర్ణకోశానికి చాలా శ్రమకలుగ జేయవలసివస్తుంది. జీర్ణకోశమునకు పని ఎక్కువైనకొలదీ, శ్రమ ఎక్కువైన కొలదీ శరీరములోని రక్తము విశేషముగా జీర్ణకోశమునకు సహాయపడుటకై అక్కడికే ప్రవహించాలి. ఆ విధంగా ఎక్కువరక్తం జీర్ణకోసమువద్దకు పోవుటవల్ల, మెదడు చురుకుగా బాగా పనిచేయుటకై కావలసినంత రక్తసమృద్ధి మెదడుకు ఉండదు.

అందువల్లనే భోజనం ఎక్కువైనప్పుడు మత్తుగా ఉంటుంది. మెదడు మందగతిలో ఉంటుంది. నిద్రావస్థ విధిగా సంప్రాప్తిస్తుంది. కాని, అమృతమువంటి సర్వజీవధాతు సమన్వయ పదార్థాన్ని సేవించడంవల్ల అది చాలా లఘువైనదిగా, తేలికగా శరీరంలోనికి గ్రహింపబడే ఆహారంగా ఉంటుంది. ఆ కారణంచేత, మెదడుకు మాంద్యంగాని అలసటగాని, మత్తుగాని లేకుండా ఉంటుంది. ఇటువంటి ఆహారవస్తువును సేవించడంవల్ల మనిషి యొక్క బుద్ధి ఎక్కువ తేజోవంతమై వికసిస్తుంది. అంతేగాక, ఎక్కువ కాలము వ్యాధిభయంలేకుండా, వార్ధక్యభయం లేకుండా జీవించగలడు. యోగాభ్యాసం చేసేటటువంటి యోగులకు యిటువంటి అమృతఫలం అమోఘంగా అక్కరకు వస్తుంది. దాని మూలంగా అనేక యోగ సిద్ధులు కరతలామలక మవుతాయి. అమలకం అంటే ఉసిరికకాయ. ఈ అమలక ఫలములను బాగా నూనెలో కాచి అమలక తైలంకూడా చేయవచ్చు. దీనిలో గుంటకలగర ఆకును కూడా (అనగా భృంగరాజమునుకూడా) చేర్చి కాచిన యెడల, భృంగ అమలక తైలము తయారవుతుంది. దీనిని తలకు నిత్యము అంటుకొనుచుండినయెడల, మెదడు చాలా చురుకుగా పనిచేస్తుంది. ఈ విధముగా అమలకములోని పదార్థము శరీరానికి ఒకవిధమైన కాయకల్ప చికిత్స చేసి, నిత్యయౌవనమును కలుగజేయగల దివ్యమైన వస్తువు. అంతేగాక, ఉసిరిక చెట్లు విపరీతంగా కాయలు కాయగలవు. ఆ చెట్లు సులభంగా పెరిగి పెద్దవవుతాయి. ఆ చెట్లను పోషించడానికి గృహస్థులుగాని వానప్రస్థులుగాని విశేషంగా శ్రమపడవలసిన అగత్యంలేదు. అందువల్ల యిది మన దేశంలో అందరికీ, అది లభించే ఋతువులో, విశేష వ్యయప్రయాసలు లేకుండా సమకూరగలదు. ఈ ఉసిరిక పండ్లను అనగా ముదిరిన ఉసిరిక పండ్లను తేనెలో గాని చక్కెర పాకంలో గాని ఊరవేసి మురబ్బా తయారుచేసి ఒక జాడీలో నిల్వచేసి ఉంచినట్లయితే, అది సంవత్సరం అంతా నిల్వ ఉంటుంది. ప్రతిదినము ప్రాతఃకాలమందు ఒక ఉసిరిక కాయను ఆ జాడీలోనుంచి తీసి సేవించవచ్చు. లేదా ఆ ఉసిరిక కాయలను దంచి ఉప్పులో కలిపి ఊరబెట్టి ఉసిరికకాయ ఊరగాయను ఒక జాడీలో చెడిపోకుండా నిల్వఉంచి బహు పథ్యమైన వస్తువుగా అన్నము తినేటప్పుడు ప్రథమ కబళముతో దానిని కలిపి తినవలెనని మన ఆయుర్వేద వైద్యులు ఉపదేశిస్తూ ఉన్నారు.

ఈ విధంగా ఈ అమృతఫలము యొక్క మహత్తును మన ప్రాచీనార్యులు మహర్షులు గ్రహించారు. ప్రత్యక్షంగా అమృతత్వం ఏ వస్తువులో మనకు కన్పించగలదో వారు ఋజువుచేశారు.

గడచిన మహాసంగ్రామకాలంలో జర్మను సైనికులు విమానాలమీదనుండి ఆకాశగొడుగుల సహాయంతో హఠాత్తుగా తండోపతండములుగా క్రిందికి దుమికేవారు. ఆకాశంనుంచి క్రిందికి అవతరించిన దేవతలలాగున ఆకాశ విమానాలలో నుంచి దుమికేవారు.

★ కాలక్షేపం ★

ఈ రీతిగా దుమికిన సైనికులకు ఎవరికి కావలసిన ఆయుధసామగ్రులు వారివద్దనే ఉండేవి. ఎవరికి కావలసిన ఆహార పదార్థాలు వారివద్దనే ఉండేవి. ఏ గుట్టల మీదనో, మిట్టలమీదనో దిగినటువంటి యీ సైనికులందరూ మెల్లిగా ఒక్క తావుకు తిరిగి కూడుకొని తమకుతామే ఒక చిన్న సైనికదళంగా ఏర్పడి శత్రువుకు తెలియకుండా శత్రుసైనిక స్థావరాలకు వెనుకవైపునచేరి దొంగచాటుగా వెనుక పోటు పొడిచినట్లుగా యుద్ధం చేసేవారు. ముందువైపున వెనుకవైపున జర్మను పటాలము ఉండి పోరాటం సాగించడంవల్ల శత్రుసైనికులు కంగారై తెల్లమొగము వేసి, తెల్లజెండా సైకెత్తి లొంగిపోవలసివచ్చేది. ఈ విధంగా ఆకాశగొడుగులతో క్రిందికి దేవతలవలె దిగేటటువంటి వియచ్చరవీరులకు వారం పదిరోజులకు సరిపోయే ఆహారం వెంటఉండేది. వారికి డవాలు సంచీలు వీపున వ్రేలాడ కట్టబడి ఉండేవి. సాధారణ భోజనంవల్ల బలంగల యోధునకు వీరునకు ఎంత పుష్టికరమైన ఆహారము కావలెనో అంత పుష్టిని, అంత సమృద్ధిగా జీవధాతువులను శరీరానికి సప్లయి చేయగల సర్వధాతు సమృద్ధి మాత్రలు వారి డవాలా సంచిలో ఉండేవి. ఈ మాత్రలను వారు సేవించినట్లయితే, వారి నిత్య భోజనానికి అవి తుల్యంగా ఉండేవి. ఈ సర్వధాతు సమృద్ధి గుళికలను అమృత గుళికలుగా జర్మనులు తయారు చేశారు. అటువంటి సర్వధాతు సమృద్ధి గుళికలను ఉసిరిక కాయలోని సారములను సంగ్రహించి అమృత గుళికలుగా తయారుచేయ వచ్చునన్నారు.

మన దేశములో ఉన్నటువంటి అమూల్యములైన మూలికల ప్రభావం సమగ్రంగా పరిశోధించిన సిద్ధులు యీరోజున ఎక్కడైనా ఉంటే, అటువంటివారు ఎక్కడ ఉన్నారా అని ప్రజలు పరిశోధిస్తూ ఉంటారు. కొంతకాలము క్రిందట తిరుపతి కొండల వద్ద ఒక చెట్టు ఆకు ఉన్నదనిన్నీ దానిని తిన్నట్లయితే అది తియ్యగా ఉంటుందనిన్నీ, అందువల్ల దానిని "బెల్లము ఆకు" అని పిలుచుచుందురనిన్నీ, దానిని తినిన యెడల ఎటువంటి వానికైనా ఆకలిబాధ సులభంగా తీరిపోగలదనిన్నీ కీ॥ శే॥ వేటూరి ప్రభాకరశాస్త్రి గారు వెల్లడించియున్నారు. ఈ ఆకునకు వారు "భుక్తిపత్రము" అని కూడా నామకరణం చేశారు. కొంతకాలము క్రిందట తూర్పుగోదావరి జిల్లానుంచి బాల్యంలోనే హిమాలయ పర్వత ప్రాంతాలకు వెళ్లి అక్కడ ఉండే మహాయోగులతో కలిసి కొంతకాలము గడిపిన శ్రీయోగి నరసింహస్వామి గారు ఆ పర్వతసీమలలో ఆమంచుగడ్డల క్రింద కొన్ని దుంపలున్నవనియు అవి తినుటకు రుచిగా ఉండుననియు చెప్పారు. ఆదుంపలను తింటే వేరే ఆహారం అవసరం లేకుండా ఆకలిదప్పులు తీరగలవనియు అత్యంతశీతలమైన ఆ మంచుకొండలలో అంత మంచి దుంపలు మంచుగడ్డల క్రింద పెరుగుననియు, ఆ మంచుగడ్డల మధ్య ఆదుంపలు ఎట్లా ఉంటాయో, అదేవిధంగా ఆమంచుగడ్డలలో ఆ దుంపలను తినెడి యోగులుకూడా చలిబాధలేకుండా చలించకుండా తపస్సు చేసికోగలరనియు నరసింహయోగిగారు స్వానుభవ విశేషముగా సర్వలోక విదితంగా వెల్లడించారు. వీరు మాత్రమేకాదు. తూర్పుగోదావరి జిల్లానుండి కొంతకాలముకిందట ఒక యోగిపుంగవునివెంట మహోన్నత హిమాలయపర్వతములందు కొన్నియేండ్లు సంచారముచేసిన క్షత్రియాంధ్ర పుంగవులొకరు ఆసిద్ధుని అనుగ్రహమున అనేక మూలికల అపూర్వప్రభావమును గ్రహించి లోకసంగ్రహార్థము నేడు బాలరాజామహర్షి యను గురుదత్త నామధేయముతో ఆంధ్ర దేశములో సంచరించి అనేక వ్యాధులను తాము నేర్చిన మూలికలతో, నిర్మూలిస్తున్నారు. అమృతతుల్యములైన మూలికలను అనేకము వీరు పర్వతప్రాంతాలకు వెళ్లి సేకరించి వాటిని ప్రజలకు ఉపకరించేటట్లు ఉచిత వైద్యసేవ చేయుచున్నారు. మద్రాసునగరములో వీరి మకాముకు వచ్చెడి వ్యాధిగ్రస్తులకు విధివిరామంలేదు.

మన పెరటిలోని మొక్క మనకు మందుకు పనికిరాదన్నట్లుగా, మనదేశంలోని మూలికలయందున్న ప్రభావమును పరిశోధించడానికి మనకు పట్టుదల లేదు. మన పర్వతసీమలందు ఉన్నటువంటి మూలికలు ఏవో, వాటిపేర్లు ఏమిటో యీ రోజువరకు మనకు సమగ్రంగా తెలియదు. బాలరాజా మహర్షివంటి దృఢదీక్షా సంకల్పులు కొందరు మన పర్వతప్రాంతాలన్నీ మథించి శోధించి ఆమూలికల ప్రభావం మనకు బోధించితే, వ్యాధిభయంగాని, వార్ధక్యభయంగాని, మనకు లేకుండా చేయగల అమృతగుళికలవంటి మూలికలు అనేకం మనకు లభిస్తాయి.

ఇదివరకొకప్పుడు కాయకల్ప చికిత్సను పండిత మదనమోహన మాలవ్యా గారు తపస్వి బాబాగారిచేత చేయించుకొన్నారు. ఆచికిత్సలో ప్రభావం ఉన్నదని మాలవ్యా గారు అంగీకరించారు. ముసలితనమును పోగొట్టి తిరిగి జవసత్తువులను కల్పించగలది కాయకల్ప చికిత్స. దానిని గురించిన పరిశోధన యోగిపుంగవులు ఒకప్పుడు మన దేశంలో చేశారు. వ్యాధులను నివారించడమే కాకుండా, వార్ధక్యమునుకూడా పోగొట్టి నవయౌవనమును కల్పించడానికి ప్రాచీనమహర్షులు వాజీకరణ పరిశోధనలు చేశారు. నిత్యయౌవనముకొరకై మృత్యువును జయించుటకొరకై రసయోగములను అనేకం కల్పించినట్లుగా నాగార్జునాదుల జీవితచరిత్రలను చదివిన వారికి విదితమవుతుంది. నాగార్జును ఆంధ్రుడు. గుంటూరు సీమలో కృష్ణాతీరవాసి-నాగార్జున కొండవద్ద ఉండేవాడు. అతడు ఇక్ష్వాక రాజులకాలం నాటివాడు. అతని శాస్త్రపరిశోధనలు ఇన్నీ అన్నీ కావు. ఆనాటి నలందావిశ్వవిద్యాలయంలో ఇతడు తన పరిశోధనల సారాంశములను పండితులకు వివరించి ప్రశంసలను పొంది ప్రఖ్యాతి వహించాడు. ఈ రసవాదము అనేది అతిప్రాచీనమైనది. పాదరస ప్రయోగముగల ప్రక్రియల మూలంగా ఆయుర్వృద్ధిచేయ వచ్చునన్నారు. నిత్యయౌవనము లభించగలదన్నారు. మృత్యువును కూడ జయించవచ్చునన్నారు ఈరసవాద శాస్త్రంలో మన నాగార్జునుడు అందవేసిన చెయ్యి.

ఈవిధముగా నిత్యయౌవనం సాధించడానికిన్నీ, వ్యాధిని వార్ధక్యమును జయించడానికిన్నీ అశ్వినీదేవతలు అనబడే కొందరు మహర్షులు కృషి చేసి ఉండవచ్చు. అందుకొరకై వారు హిమాలయ పర్వతాలన్నీ శోధించి అక్కడ ఉండే అనేక మూలికలను పరిశోధించి వాటి ప్రభావములను నిర్ణయించి యుండవచ్చు. మృత్యువును కూడా జయించగల సంజీవిని కూడా శోధించిరని నంత కీర్తి ప్రశస్తిని ఆనాటి అశ్వినీ దేవతలు పొందియుండవచ్చు. అయితే, వారుచేసిన పరిశోధనల సందర్భములో, ఆ కొండలలో వారికి రత్న



'కడవా చంకాన బెట్టి' చిత్రకారుడు శ్రీ ఏ ఎస్ ఆర్ జోస్యులు

మూలుకూడా దొరికి ఉండవచ్చు కాని, కొండరాళ్ళల్లో లభించిన లోహాలుగాని రత్నాలుగాని వారిని తృప్తిపరచలేదు పర్వత పరిశోధన చేయగా చేయగా, అక్కడ లభించిన మూలికలయందు గల అమూల్యతత్వము అమృతత్వము వారికి అఖిరుకు కరతలామలక మైంది

ఇటువంటి అమృతత్వం లభించినప్పుడు మానవకోటికి ఎటువంటి వ్యాధులు సంభవించినా, మృత్యుభయం లేకుండా వైద్య చికిత్సలు చేయవచ్చునన్నారు ఇటువంటి వైద్యశాస్త్ర పరిశోధన, ఇటువంటి మూలిక ప్రభావ పరిశోధన, యిటువంటి పర్వత మథనము జరిగిన కాలములో ఆంధ్రులు అమరావతీ ప్రాంతమున అఖండ విఖ్యాతి గడించారు. అఖిల ప్రపంచ రాజ్యాల నుండియూ అమరావతికి అశేష శేముషీ ధురంధరులు విచ్చేసి యుండిరి

ఆనాటి ఆంధ్రుల శిల్పము అమరశిల్పమే ఆనాటి ఆంధ్రులు అమరులే రమారమి రెండు వేల ఏండ్లనాటి యీ అమరావతి మరువరానిదైనది.

మరలిరాగల నాడి దినములనే మధుర స్వప్నములు మాత్రము మనకు మధ్య మధ్య కలుగుతున్నాయి ఈ కలలకు ఉలికిపడి లేచుచుండుటయున్నూ, మనకు నిద్రాభంగము కలుగుచుండుటయున్నూ, అందు మూలంగా మన యిరుగుపొరుగు అరవమంత్రులకు కూడా అలజడి కలుగజేయుచుండుటయున్నూ, మనకొక అవలక్షణమని ఆక్షేపించేవారు ఉన్నారు

ఆంధ్రుల చైతన్యం మద్రాసులో నిద్రావస్థలో ఉన్నదనేమాట ఉన్నది ఆత్మ వికాసం పొందడానికి, అమరావతీనాటి అమరత్వం సాధించడానికి అమృతంకోసం మథనం చేస్తున్నారు ఈ అమృత మథనంలో హాలాహలం గాని కోలాహలం గాని సంభవిస్తే, అంతమాత్రం చేత విహ్వలులై యత్నము విడువరు ఆంధ్రులకు కావలసినది ఆంధ్రుల అభివృద్ధి

(52-వ పేజీ చూడండి)

వివాహం

"అమ్మాయ్ ఆడపిల్లకు వివాహం చేయాలంటే గౌరవం మర్యాద గల కుటుంబంలోని పిల్లవానిని వెతకాలి. పిల్లవాడు అందంగా వుండాలి అని అనుకోకూడదు. వస్తుతః సాంప్రదాయం చూడాలి. పదిడబ్బులు తెచ్చుకొనేవాడుగా వుండాలి. ఎందుకంటావా? పిల్లమళ్ళా వచ్చి మన నెత్తిమీద ధ్వజం ఎత్తకుండా. ఏమంటావు?" నేను, మణి సావిట్లోకి వచ్చేటప్పటికి అమ్మతో సుందరమ్మ మామ్మ ఆడపిల్లల సంబంధాలవిషయంలో చెబుతున్నది.

"రోజురోజుకు కట్నాలరేట్లు అధికమై పోతున్నవి. స్కూలు ఫయినల్ చదివే వారికి రెండు వేలు, ఎఫ్.ఎ. చదివితే నాలుగు వేలు ఇలా తరగతికి రెండు వేలు అధికం. పిల్లల బాలతొడుగు, మరి లాంఛనాలు, పెళ్ళి ఖర్చులు. నలుగురు ఆడపిల్లలుగల కుటుంబం అయితే ఇక వేరే చెప్పాలా? తక్కువ సంబంధానికి ఇవ్వలేరు చేతులారా. కొత్త చదువుకున్న వారితో తూగలేరు. అప్పో సప్పో చేసి పెళ్ళిచేస్తారనుకోండి మళ్ళా పండగలకు పబ్బాలకు అబ్బాయిగారి కోర్కెలు భక్తుడిలా శిరసావహించాల్సిందే. పోనీ అన్నిటికీ తలవంచితే ఇక అబ్బాయిగారి గుణాలు...

"మిమ్మల్ని కన్నందుకు తలిదండ్రులు ఇంత కష్టపడుతున్నా మళ్ళా మీతో ఎన్ని మాటలు పడాలే......" మామ్మ కొద్దిగా నవ్వుకున్నది.

"అవుతే మామ్మా! అసలు ఆడపిల్లలు పెళ్ళిళ్లు చేసుకోమని సత్యాగ్రహం చేసి, చదువుకొని ఇంత వుద్యోగం చేసుకోవాలి. అప్పుడు గాని ఈ మగవాళ్ళ రేట్లు తగ్గవు" అంది మణి.

"నిజమే. నలుగురు కల కుటుంబంలో మరి అందరకు చదువు చెప్పించుకొనే తాహతు ఆ తండ్రికి వుండాలా అక్కరలేదా? చదువుతో ఏం సరిపోయేనే పిచ్చి తల్లీ. మీకు మంచి మంచి పౌడర్లు చీరెలు ఇంకా అమాం బాపతు పైఖర్చు అంతా భరించాలి. 'అకేమిటే అమ్మాయ్' అంటే నలుగురిలో మెలగేవాళ్ళకు ఆపాత్రం చిల్లర ఖర్చు లేకపోతే ఎట్లాగు అంటారు. పోనీ భరిస్తాం అనుకో; మీ బుద్ధులు సరిగా వుండాలె అమ్మాయ్. ఈ సత్యాగ్రహుల్లోని ఓ పిల్లకు ఆకలి వేసిందా......పరువు మర్యాద అంతా మంటలో కలిసిపోతుంది. ఇటు తలిదండ్రులు వురిపోసుకుంటారు" నవ్వింది బుస బుసా మామ్మ మణివంక చూస్తూ. ఎందుకంటే మణి నోరు కట్టేసిన తన వాక్చాతుర్యానికి.

మణి బుంగమూతి పెట్టుకున్నది "ఆడపిల్లలంటే తలిదండ్రులకే ఇంత విసుగు, హేళన, నీరసం... కాబట్టే కట్నాల రేట్లు అంత హెచ్చు అయిపోతున్నవి. కట్నం పెళ్ళికి ఖర్చు పెట్టేబదులు ఆ డబ్బు పెట్టి చదువు చెప్పించుకోకూడదా? ఏం?" లోపలవున్న అక్కసునంతా ముఖంలోనుంచి చిమ్ముతూ అన్నది పట్టుదలగా.

"వాటితోనే చదువులు చదివేసి వుద్యోగాలు వెలగేసి వూళ్లు ఏలుతారా? ఇంతకీ అమ్మాయ్, ఒక్క మాట. ఎన్ని సత్యాగ్రహాలన్నా చెయ్యండి, వాళ్ళకేమే. వాళ్లు మగమహారాజులు.." కొంచెం హేళనగా మాటల్లో హుందా తెచ్చుకొంటూ అన్నది. మామ్మ మాటల్లో మణిని ఏడిపించాలనే చిలిపి భావం కనబడింది. మరొక సంగతి ఏమంటే ఆవిడకు మచ్చుకైనా ఆడపిల్ల లేదు. అందుకనే దర్జా తెచ్చుకున్నట్లు మాట్లాడింది.

మణికి కొంచెం వుడుకుమోతుతనం వచ్చింది. "మరే మగ మహారాజులు..." ఏదో బుర్రలోకి తట్టినట్లు. "ఓహో మగపిల్ల తల్లివికదూ..."

"మగపిల్ల ఏమిటే..." నవ్వుతూ మా అమ్మ చాపమీద కాళ్ళు పారజాపుతూ అన్నది. కావాలనే అన్నట్లు మణి అమ్మవంక మామ్మవంక చూచి ముసి ముసి నవ్వులు నవ్వింది. మణి భావం గ్రహించి వుంటుంది మామ్మ.

"చూడవే మీకు మాటలాడటమే తెలియకపోయె. మీరు సత్యాగ్రహాలు చేస్తారటే..." అన్నది తన ఓటమిని గెలుపుగా మార్చుకొంటూ.

మణి తెల్లబోయింది; వుక్రోషం వచ్చింది. తనను అంత చిన్న సన్నాసిని చేసినందుకు ఏమి మాట్లాడాలో భాషకు అందలా భావాలు. ఇంతలో బాబాయి వచ్చాడు. వాళ్ళిద్దరిమధ్యనా సంధిపత్రంలా. బాబయ్య మాకు అంత దగ్గర చుట్టరికం కాకపోయినా రాకపోకలు దగ్గరి చుట్టరికంగా అంటిపెట్టుకున్నవి. కుశల ప్రశ్నలు అయిన తరువాత శుభలేఖ చేతికి యిచ్చి "అమ్మాయి పెళ్ళి 25 వ తారీఖున, మీరందరు రెండురోజులు ముందుగానే రండి ఇంకా చాల పనులు మిగిలివున్నయ్. వస్తాను మరి" అంటూ లేచాడు.

"ఇంతకీ వివరాలేం చెప్పారుకాదు. పిల్లాడు ఏమి చదువుకున్నాడు? ఎంత కట్నం? అయిన సంబంధమేనా? కుటుంబ పరిస్థితులు ఎలాంటివి? అందంగా వుంటాడా? మనపిల్లకి తగినవాడేనా?" అని ప్రశ్నలు ఒక్కసారి కురిపించింది. మా అమ్మ. అసలు ఎండలో పడి వచ్చిన బాబయ్యకు అన్ని ప్రశ్నలు గొంతుకదిగుతయ్యో లేదో అనికూడ ఆలోచించకుండా, ఆడవాళ్ళనైజమే ఇంత అన్నట్లు అడిగివేసింది.

ఆయనేమి తక్కువ చెయ్యా. "దూరపు సంబంధమే; కుటుంబ గౌరవం విషయంలో వేరే చెప్పనక్కరలేదు. పిల్లవాని విషయంలో అంత అందగాడు కాకపోయినా అందహీనుడు మటుకు కాదు. వుంటాడు మధ్యరకంగా. ఇద్దరకు జోడు బాగా వున్నది. స్కూలు ఫయినల్ చదివాడు. సినిమా రిప్రజెంటెటివ్. నెలకు వందరూపాయలు దివ్యంగా తెచ్చుకుంటాడు. కట్నం సంగతంటావా? రెండువేలు, వుంగరం, వాచి, సూటు. ఇహ, లాంఛనాలు బాలతొడుగు అందరకు తెలిసినవేగా. మరొక సంగతి, పిల్లను పిల్లవాడికి పిల్లవాడిని పిల్లకు చూపించి వాళ్ళకు ఇష్టమైన తరవాతనే శుభముహూర్తం పెట్టించాను. 'నాకు నచ్చని మొగుడ్ని అంటగట్టారు మొదట నాకు చూపించి చేశారా ఏం?' అని అమ్మాయి వల్ల తరువాత మాటరాకుండా చేసుకున్నాను."



అన్నాడు - తను ఏదో ఘనకార్యం సాధించినట్లు కొత్త నవ్వాడు. అమ్మ అడిగిన అన్ని ప్రశ్నలను ఒక్క ముక్కయినా మిగలకుండా హరాయించేసుకున్నాడు. "వెళ్ళొస్తాను" అన్నాడేగాని ఆమాట ఎవరూ వినిపించుకున్నట్లు లేదు. ఒకరి ముఖాలు ఒకరు చూచుకున్నాం.

బాబయ్యకు ఎనిమిది ఎకరాల పొలమున్నది. ఐదుగురు మగపిల్లలు, ఒక్కతే ఆడపిల్ల. బాబయ్యవంటి పిసినిగొట్టు మరి ఒకరుండరు. అలాంటివాడు రెండువేలు కట్నం. లాంఛనాలు జరుపబోతున్నాడంటే మాకందరకు ఆశ్చర్యం వేసింది. అందులో పూర్వాచారం ఆయన ముఖాన, వేషభాషల్లో వుట్టిపడుతూంటుంది. అలాంటి బాబయ్య స్వయంవరనిర్ణయంలోకి ఒక్కసారి దూకాడంటే ఈ సంవత్సరం చేలన్నీ విరగపండుతాయేమో అనుకున్నాము.

రేపు పెళ్ళి అనగా వెళ్ళాం. పెద్దబలగం వున్నా ఎవరినీ పిలువలేదు. పెళ్లివారు వచ్చారు. బాజాలు మ్రోగుతున్నయ్. బ్రాహ్మణులు మంత్రాలు చదువుతున్నారు. పుస్తె కట్టేముందు కట్నం పొయ్యమన్నారు - రొఖ్ఖం - ఖచ్చితంగా.

"కట్నం నేను ఇవ్వనంటే సరేనని ఇప్పుడు కట్నం ఇవ్వమంటారేమయ్యా" అన్నాడు బాబయ్య - ఒక్కటేమాట. "ఇదేనా మీ మర్యాద" అన్నట్లు ప్రతిధ్వనించింది.

పెళ్ళివారి ముఖాన నెత్తురుచుక్క లేదు. పెళ్ళికొడుకు వారి తరఫున ఒక పెద్దమనిషి "పదిమందిలో ఒప్పుకొని ఇలా అబద్ధమాడితే మేమేం చెప్పగలం" అన్నాడు సౌమ్యంగా. బ్రాహ్మణులు ముహూర్తం దాటిపోతున్నదన్నారు. పెద్దలు మాట్లాడుకుంటూనే వున్నారు. పెళ్ళికొడుకు పెళ్ళికూతురి మెడలో మంగళసూత్రం కట్టాడు. అది చూచి మరింత ధీమాగా మాట్లాడుతున్నాడు బాబయ్య. వాళ్ళవీళ్ళ తర్జనభర్జనలతో తెల్లవారవచ్చింది. "పిల్లపేర ఒక అర ఎకరం పెడతాను - ఎప్పుడో నాయిష్టం వచ్చినప్పుడు" అన్నాడు బాబయ్య. అంత మొండిగా మాట్లాడుతున్నప్పుడు వాళ్లు లేచిపోతారేమో అనుకున్నాము. పెళ్ళికొడుక్కి తండ్రి లేడు. వచ్చినవాళ్లు, పెళ్ళికొడుకు ఏవేవో గుసగుసలాడుకున్నారు. అప్పగింతలు వచ్చినయ్. పె కొడుకు తరఫువారిని పిలవమన్నారు; చూస్తే ఏమున్నది? పెళ్ళికొడుకు తల్లి బంధువులతో ఎప్పుడో చక్కా వెళ్ళిపోయింది. అనుకున్న లాంఛనాలు బాబయ్య జరుపలేదు. పెళ్లిపందిరంతా రభస అయింది. అప్పగింతలవేళ అయింది. పిన్నికంటికి మంటికి ఏకధారగా ఏడుస్తున్నది.

"ఆడపిల్ల పుట్టినక్షణానే 'ఆడ...పిల్ల' అన్నారు. పిల్ల పేరులోనే దాని భవిష్యత్ ఇమిడివున్నదాయె "ఆడ" పిల్లయే గాని "యీడ అంటే యిక్కడ" పిల్ల అవుతుందా? మన పిచ్చిగాని అది మనం గ్రహించుకోలేక మమత పడుతామె తల్లీ; వూరుకోవే అమ్మాయ్" అని ఏభయ్యేళ్ళ ముదిపడుచు మా పిన్నిని ఓదార్చింది.

అలాగే ఏదో అయిందనిపించారు అప్పగింతలు.

పెళ్లికొడుకు అతని స్నేహితులు తప్ప మిగిలినవారు ఇదివరకే వెళ్లిపోయారు కాబట్టి పెళ్లికొడుకుని పెళ్లికూతురిని తీసుకొని స్నేహితులు ఇంటికి చేరారు. పెళ్లి

(55-వ పేజీ చూడండి)

శ్రీ నిడదవోలు వేంకటరావు

త్యాగభోగరాయడు జయంతి కామేశము పంతులుగారు వెలనాటి వైదిక బ్రాహ్మణులు. తల్లి బుచ్చెమ్మ, తండ్రి లక్ష్మయ్య. విశ్వావసు సంవత్సరమున క్రీ. శ. 1846 లో నేటి ఉత్తర విశాఖమండలములోని చెక్కలితాలూకాయందలి శాసనాగ్రహారమున జన్మించెను. కామేశంపంతులుగారు, తమ యిరువదవ యేటనే ఎస్. ఏ. ప్రొఫిషెంటు పరీక్షయందు కృతార్థులై, తమ యిరువదిమూడవ యేట క్రీ. శ. 1869 లో న్యాయవాది పరీక్షయందు కృతార్థులైనారు. ఉత్తరాంధ్రప్రాంతములలో మొదటి బి. యల్ పట్టము పొందిన న్యాయవాదులై ఆ కాలమున బి. యల్ పరీక్షలో మహా ప్రసిద్ధులైన భాష్యం అయ్యంగారును, ముత్తుస్వామి అయ్యరుగారును, పనప్పాకం ఆనందాచార్యులుగారును వీరి సహాధ్యాయులు. కామేశం పంతులుగారించుమించుగ 16 సంవత్సరములు న్యాయవాదియై, 16 లక్షలార్జించి, తాననుభవించి కలియుగ దానకర్ణుడని పేరుమోసి, యా ద్రవ్యమంతయు వెచ్చించి, కవి పండితపోషకుడై క్రీ. శ. 1886 లో కీర్తిశేషుడయ్యెను. కామేశం పంతులుగారిని గూర్చిన యుదంతములు కథలుగా నేటికిని చెప్పుకొనుచునే యుందురు.

హరికథా పితామహుడు, సంగీత సాహిత్యములలో జగజెట్టి ఆటపాట మాటలమేటి అజ్జాడాదిభట్ల నారాయణదాసు కామేశం పంతులుగారిని బరంపురములో తన పందొమ్మిదవ యేట నవగా క్రీ. శ. 1883 లో సందర్శించినాడు. ఆ విద్యామూర్ధన్యుడును నీ యువకుని హరికథ యానందించుట కొకనాటి రాత్రి కొల్వు కూర్చుండి సావధానముతో వినెను. మంగళము పాడుటకు పూర్వమే, ఆ కథకుని యీ విధముగా ప్రశంసించినాడట. 'ఓ యన్నా! నీ కథ వినినంతసేపును నానందాశ్రులు వెల్లివిరిసినవి. నేను నిన్నెట్లు సత్కరింపగలను' అని తత్క్షణమే, సింహలలాటముల బంగరు మురుగులు - పట్టుపంచెల చాపు - బనారసు కండువా- యిరువందల రూపాయలు నగదు తెప్పించి బహూకరించి, "చంద్రునకు నూలుపోగు సుమీ"యని యింకను బహూకరింపలేని తన యశక్తిని తెలిపినాడట. మొదట హరికథను నారాయణదాసు వినిపించినది కామేశం పంతులుగారికే. చిరస్థాయియైన నారాయణదాసు కీర్తికి పునాది వైచినది కామేశంపంతులుగారే.

"ఆకార సదృశప్రజ్ఞా" అను సూక్తికిరువురును మంచి యుదాహరణములే. కామేశంపంతులుగారు ఆజానుబాహులకు మించిన పొడవు - పొడవునకు తగిన లావు - మేలిమి బంగరువంటి మేని చాయ - సింగపు మొగము - ఏనుగు చూపులు. నల్లని యుంగరములజుట్టు- చిలుకముక్కు - పున్నమచందురుని బోలిన మొగము - విశాలమైన వక్షస్థలము - వేయి రూపాయ లిముడ్చు దోసిలి - పొడవులగు వ్రేళ్లు - నిడుదలగు నడుగులు. మోకాళ్ళ మీఁదు చేతులు - గుండ్రని పెద్దచెవులు - సుప్రాణికోవ పల్వరుసతో ప్రకాశించు మహావ్యక్తి. సింహపరాక్రమము, శ్రీ బలరామభోగము గలిగి యానాడు వాల్మీకి మహాముని శ్రీరామచంద్రుని వర్ణించిన సొగసంతయు కామేశం పంతులుగారియందు మూర్తీభవించినదని కవులు నిజముగ ప్రశంసించినారు. ప్రత్యక్షముగా నెఱింగిన నారాయణదాసు దానిని బలపఱచినాడు. అతని దర్శించినవారెచ్చటనైన నెంతవారైన తలయెత్తి చూడవలసినవారే!

కామేశము పంతులుగారి సాధారణ ధారణా సంపన్నుడు న్యాయస్థానమున నెదుటి పక్షమున వాదించు న్యాయవాది చెప్పిన యంశములనన్నింటిని, తూచా తప్పకుండ, తాను వ్రాసికొనకుండగనే, యాతనికి సమాధానము చెప్పెడివాడట. గీర్వాణాంధ్రాంగ్లేయోత్కళ భాషలలో నాతడు పండితుడు. తెనుగున జానకీవర శతకము, రామశతకము, కొన్ని గేయ కృతులు రచియించినాడు. అట్టి మహనీయునిపై ఆదిభట్ట నారాయణదాసు రచియించిన పద్యముల నిందుదాహరించుచున్నాను.

"ఎలుక నేలువు కొలువున
బరువురువుల నీవిపట్ల బంటుతనమునన్
సరకాదెవ్వండైనను
గరువతనంబున జయంతి కామేశున
కున్." 1

"పొడవా అడుగులు మేల్మి ప్రమున్
నిడిమేను పడుందటొమ్ము చిక్కని నడు
జడు పెలుగని వాల్చూపులు
కడుపుట్టులు మాజయంతి కామేశున
కున్. 2

"తన పెనుదోసిలి కొలదిన్
వెనుజూడక పంచిపెట్టె వేసారులు కో
రిన వారికెల్ల రూకలు
కనలేమెన మా జయంతి కామేశున
కున్." 3

"కుడిచె కుడిపించె గోర్కులు
గడించె వేవేలు మాటకారి మగండే
కడనైన వల్లెమాపడు
కడగలదే మాజయంతి కామేశునకున్."

"పుట్టె వెలనాటి పాలుల
గట్టెన్ పేరీపట్ల కడియముకేలన్
గట్టెక్క నలువ దేటన్
గట్టడా మా జయంతి కామేశునకున్."

"ఈడే జయంతి కామేశ పండితమ్
గుణమండితమ్
జీవన్ముక్తం రామభక్తం సుందరమ్
ధైర్యమందరమ్
దివ్యేషు రామచంద్రః పంచజనేష్వపి
జయంతి కామేశః
గణ్యావితి మన్యే నాతిశయోక్తి
రియం ననుస్వభావోక్తిః."

హరికథా పితామహుడు ఆదిభట్ట నారాయణదాసు బెంగుళూరిపైని చెప్పిన పద్యము.

"అలరు తేనియలూరు దలిరులజిగిమీరు
విన్నకలవుడీలు బెంగుళూరు
చింతమబ్బులకారు చెమటరానిషికారు
వేడుక లింపారు బెంగుళూరు
ఆవులపాలేరు తావుల వేమారు
పిలువదగిన పేరు బెంగుళూరు
చెఱకు తీయనినీరు చేలపచ్చనిపారు
వేల్పునగరు గేరు బెంగుళూరు"
'వింతనగనాణ్యముల కారు బెంగుళూరు
పెను తెలుపులకు ముద్దేరు బెంగుళూరు
వెల్లదొరలను రావించు బెంగుళూరు
విలువగలమేల్మి పొన్నూరు బెంగుళూరు'

[illegible]

లేత మబ్బులు ఆకాశంలో ఆవరిస్తే చాలు ఆమె ఆకారం కనుపించదు; అలంకరణలు మాత్రమే అవుపిస్తాయి. ఆమెయే కనకమ్మగారు.

కనకమ్మగారికి భయపడని ప్రాణి ఆ పల్లెకాని పట్టణంలో లేదు. పట్టణంలో భర్త కూడా జమయే.

జనమంతా ఆమె ఆకారానికి కాదు, ఆమె నోటికీ కాదు, ఆమె చర్యలకే హడిలి పోతూంటారు.

“కనకమ్మగారిని ఎలా వరించాడో ఆ నరసింహంగారు?” అని లోకం కూసే చాటు కూతలకి నరసింహంగారిచ్చే జవాబు “చీకట్లో ఆమె కళ్ళు తళతళలు - మీకేం అర్థమౌతాయి?” అని.

దంపతులు విభమ్యోపడిని అధిగమించారు.

నరసింహంగారు చేసే ఎస్. జి. ఓ. ఉద్యోగఫలంగా, కనకమ్మగారి చాకచక్యంవల్ల వారొక ఇల్లును పల్లెకానట్టి ఆ బస్తీలో వారు కట్టించుకున్నారు. గృహాన్ని చూసి, గృహలక్ష్మిని చూసి నరసింహంగారు వయస్సుమీరిన కొద్దీ మనిషి ముదరడం ప్రారంభించాడు. నెల తిరగగానే చేతిలోపడే సంపాదన ‘రాళ్ళ’ విషయంలో భార్యాభర్తలిద్దరికి అన్యోన్యమైన సంధా ఏర్పడిన ఫలితంగా వారికి గృహం ఏర్పడింది. అది వారి చేతులలోని పని అని వాదిన, ఇంటికి శోభకూర్చే ఇల్లాలికి ఇంతవరకు “ఓచిన్న సలుసు” ఉద్భవించలేదు. అది వారి చేతులలోని పని కాదని వారి సంతృప్తి.

చిరకాలంగా పిల్లల చికాకులను విమానంగా పెరిగినందువల్ల కనకమ్మ-నరసింహంగార్లకు, ప్రకృతికి విరుద్ధంగా, పసిపాపలపై ద్వేషం కలిగింది. అపజయంవల్ల తలెత్తిన ద్వేషం కాదది. అనకాళ్ళ వాదులైనందువల్ల పుట్టిన చికాకే అది.

‘గృహమే కదా స్వర్గసీమ’ అని పాడారు కవులు. గృహపదానికి వివిధార్థాలలో పిల్లలు లేరు.

కనకమ్మగారు గృహప్రవేశం అయిన దగ్గరనుంచీ ఇంటిముందు ‘టు లెట్’ బోర్డు పెట్టకపోయినా ఎస్. జి. ఓ. కార్మిక సంఘసభ్యులనుంచి ఇంట్లోని వాటాకు డిమాండ్ రావడం ప్రారంభించింది.

“నరసింహారావుగారూ! మీ ఇంట్లో అద్దెకు పోర్షన్ ఉందా?” అని ఒకరు.

“వాటాకి అద్దె ఎంతండి” అని మరొకరు.

“అద్దెకిచ్చే భాగంలో గదు లెన్ని ఉన్నాయండి?” అని ఇంకొకరు.

“ఎలక్ట్రిక్ ఛార్జీలు మీవా, మావా?” అని వేరొకరు వేశే ప్రశ్నలన్నింటికి నరసింహంగారి జవాబు ఒకటే “మా ఇంటిదానిని అడగండి” అని.

విటో ఆయన భార్య చేతిలో ఉందని తెలుసుకొన్న వ్యక్తులంతా ప్రశ్నల అనంతరం ఉత్సాహాన్ని పెంచుకోకుండా నరసింహంగారి అద్దెవాటాగురించి మరచిపోయారు. ఎస్. జి. ఓలు తెలివైనవారు.

ఇంటి యజమాని అనిపించుకునే అదృష్టం నరసింహంగారికి కలిగింది. తోడి గుమాస్తాలంతా వాటాకోసం వేసిన ఎన్‌క్వైరీలన్నీ ఆయనకు నూతన విజ్ఞానాన్ని కలిగించాయి; అనుభవజ్ఞుడు అనిపించుకోడానికి కూడా అవకాశం లభించింది.

ఐదు గంటలు వినిపించగానే కుర్చీలోంచి లేచి నరసింహంగారు గృహోన్ముఖుడయాడు. ఇల్లాలు అందిచ్చిన పచ్చి మంచినీళ్లను కడుపునిండా తాగి ఈజీ ఛెయిర్‌లో కూర్చోగానే అర్థాంగి ఆయన వద్దకు చేరి “ఏమండీ మన వాటాకు అద్దె ఎంత అని చెబుదామండి” అని ప్రశ్నించి కూర్చున్నది.

“ఇవాళ చాలమంది నన్ను ఆఫీసులో ఈ విషయమే అడిగారు” అన్నాడు నరసింహంగారు.

“కొంపతీసి అంకె చెప్పారేమిటి?”

“లేదు” మా ఆవిణ్ణి అడగమన్నాను.”

“మంచివారండీ మీరు. మంచి యోచనపరులండీ మీరు. ముందు మీరంటే కంగారే కాని...” అని ముసిముసినవ్వులతో భర్త కళ్ళల్లోకి చూస్తూ “ముప్ఫై అంటోందిమా ఆవిడ అని చెప్పండి” అన్నదామె.

“ఆకలేస్తోందే...అన్నంలోకి ఏం వండావే?” అన్నాడు భర్త.

“కమ్మని నిమ్మ ఊరగాయ ఉందిగా... నిమ్మచేసే మేలు అమ్మయినా చేయదంటారు. కాళ్లు కడుక్కోండి.” అన్నది భార్య.

నిమ్మ ఊరగాయంటే నోరూరే అలవాటు ఆయనకు తప్పింది. నిత్య భక్ష్యానికి గ్రంథాలుకూడా ఎండిపోయాయి.

“నేను చెప్పిన అంకె గుర్తుందికదూ!” అంటూ భర్తను ఆఫీసుకి మరునాడు సాగనంపిన కనకమ్మగారు సాయంకాలం వరకు ఇంటి గుమ్మం ముందు మరచెంబు నీళ్లతో కూర్చుని భర్తకోసం ఎదురు చూస్తూంది.

మరచెంబులో మిగిలిన మంచినీళ్ళతోనే భర్తయొక్క ఆఫీసుశ్రమనుతీర్చి “ఏమండీ! ఎవరైనా అద్దెకు వస్తానన్నారా?” అని అడిగింది.

“అద్దె అంకె చెప్పగానే గదుల అంకె అడిగారు?” అన్నాడు భర్త.

“కొంపతీసి అంకె చెప్పారేమిటి?”

“లేదు. మా ఆవిణ్ణి అడగమన్నాను.”

“మంచివారండీ మీరు...మంచి యోచనపరులండీ మీరు.....ముందు మీరంటే కంగారే కాని” అని ముసిముసి నవ్వులతో భర్త కళ్ళల్లోకి చూస్తూ “మూడు గదులే అంటోంది మా ఆవిడ అని చెప్పండి” అన్నదామె.

“ఆకలేస్తోందే!...ఇవేళ కూడా మజ్జిగ చుక్క లేదా?” అన్నాడు భర్త.

“ఈ ఒక్కపూటకి కళ్లు మూసుకోండి. ఇపటికి పెళ్లికి వెళ్లిన పెరుగమ్మి రానేవస్తుంది” అన్నది భార్య.

ఎలక్ట్రిసిటి ఇంటికి లేదు కనుక ఆ విషయాన్ని భార్యను సంప్ర

“మధుమూర్తి”

గోడమీద బొమ్మ

రచన:

శ్రీ బలివాడ కాంతారావుగారు

ఆంధ్రపత్రిక సచిత్రవారపత్రికలో 28-1-1953 సంచికతో ఆరంభించి శ్రీ బలివాడ కాంతారావుగారి చిన్న నవల "గోడమీద బొమ్మ" సిరియల్‌గా ప్రచురించబడుతుందని మా పాఠకులకు తెలుపుటకు సంతసించుచున్నాము. – సం.

★ రీతిగౌళ ★

దించకుండానే నరసింహంగారు అందరికీ ఎరుకపరచారు.

మరునాటి సాయంకాలం నరసింహంగారు ఇంట్లో అడుగు పెట్టడంతోనే "ఏమండీ! ఈవేళ మీ ఆఫీసులో పనిచేసే ఆయనట - మీ పేరింటిగాడేనట - కుర్రవాడులా ఉన్నాడు - వచ్చి భాగం చూసి వెళ్లాడు. అతన్ని గాని వాటాలో ప్రవేశించమని చెప్పారేమిటి?" అని కనకమ్మగారు ప్రశ్నించింది.

"లేదు."

"మంచి యోచనపరులండీ మీరు" అంటుండగానే ఆమె మాటకు ఎదురువచ్చి "ఏం కారణం?" అన్నాడు భర్త.

"ఆఁ ఏం లేదు. పిల్లలున్నవారికి మన ఇల్లు అద్దెకు ఇవ్వకూడదని...మీకు చెప్పడం మరచాను ఇన్నాళ్లు"

"అదేమిటే ..మనకు లేకపోయినందుకు ఆ సరదాయేనా తీరుతుందిగా!" అన్నాడు భర్తగారు.

"నా మాటకు ఎదురు చెప్పకండి... నేనెందుకు చెప్పానో వినండి" అని పీటోని స్పష్టంచేసిందామె.

ఆయన మౌనం వహించాడు.

"మీకేం తెలుసునండీ......పిల్లలుంటే ఏడుపులు, అల్లర్లు; అదీగాక ఏదీ కనుపించకపోతే బెల్లంముక్క కోసమైనా పిల్లలు చేతులు చాపుతారు. ఎందుకా ఖర్చు?" అన్నదామె.

"పోనీ నోటితో లేదనే బదులు చేతితో కాస్త పెట్టరాదూ?" అన్నాడు భర్త.

"మీ బుద్ధిలాంటిదే నాదీ అయితే, ఈ ఇల్లు కొనే శక్తి ఉండేదే కాదు. సంసారం ఖర్చు మీకేం తెలుసునని ఏడవను? ఒక్కొక్క పిల్లాడు ఐదు తులాల బెల్లం తింటాడు. మనకైతే ఆ ఐదు తులాల బెల్లం వారంరోజులు చారులోకి ఉపయోగపడుతుంది" అన్నదామె.

నరసింహంగారికి వాదన నచ్చకపోయినా తాను చేయగలిగేది ఏమీ లేదు కనుక మౌనం వహించాడు.

నాలుగురోజులకల్లా వాళ్ళ కొత్త ఇంటి వాటాలోకి కొత్తగా పెళ్లి అయిన జంట అద్దెకు వచ్చారు. అద్దె ఇంటి ఆసామీకి నరసింహంగారి ఆఫీసులోనే పని. ఆయన పేరు ఆనందరావు. అతని భార్య పేరు లక్ష్మి.

లక్ష్మికి కనకమ్మగారికి రెండు పుష్కరాల వ్యత్యాసం ఉంది. వయసుతోబాటు విజ్ఞానములోను ఆ తేడా కనుపిస్తుంది.

"పిన్నిగారూ! ఈ రోజు 'పెళ్లిచేసి చూడు' సినిమాకు వెడదాం వస్తారా?" అని లక్ష్మి ఓ రోజు అడిగింది.

"అడుగేస్తే ఆయాస మమ్మా నాకు... రాలేను." అన్నది కనకమ్మగారు.

"జట్కాలో వెడదాం పిన్నిగారూ?"

"వద్దమ్మా! వెధవగుర్రాలు వెనక్కి నడుస్తాయి. నీకు తెలీదు కాబోలు మన ఊరి గుర్రాలసంగతి. వాటికెప్పుడూ ఇంటి ధ్యాసే నాలాగ" అన్నది కనకమ్మగారు.

"టాక్సీలో వెడదాం రండి పిన్నిగారూ!" అన్నది లక్ష్మి.

"ఇంత బలవంతం చేస్తున్నావ్ కాని, లక్ష్మీ! అదేం సినిమాయో ఎలాగుంటుందో—తీరా వెళ్లి బాగుండకపోతే మనస్సు పీకుతుంది." అన్నది కనకమ్మగారు.

"అట్బే ఆభయం లేదు పిన్నిగారూ! చాల గొప్ప చిత్రం అది. అందులో సందేహం లేదు" అన్నది లక్ష్మి.

"నాకెందుకు చెబుతావ్ తల్లీ! నాకళ్లెదుట నా చెల్లి పెళ్లి జరిగింది. దాని కూతురుకి కూడా నేనే పెళ్ళిచేశాను. ఇంక నేనేం పెళ్ళిళ్ళుచేసి చూడాలి చెప్పు, అందుచేత అమ్మాయీ! నువ్వు వెళ్ళిరా. మీ బాబుగారు ఒఖ్ఖరూ ఇంట్లో ఉంటారు. నేను రాకపోతే ఆయనారారు. నామాట విను. బలవంతపెట్టకు" అన్నదామె.

లక్ష్మి మాటలను పెంచకుండా పిక్చర్‌కు వెళ్లి వచ్చింది.

నరసింహంగారింట్లోకి అద్దెకు ఉండే వాళ్లు రాగానే ఆయన రిటైర్ అయాడు. ఆరోజున ప్రావిడెంట్ ఫండ్ ఆయనచేతికి అందింది. లెఖ్ఖలన్నింటిని కనకమ్మగారికి సవివరంగా చెప్పాడు భర్త. కాని, అందులో నెలకు ఐదురూపాయల ఎక్కువ నిలవ రావాలని, అది రాలేదనే అనుమానం ఆమెకు తట్టింది.

మరునాడు భోజనాలయాక కనకమ్మగారు వీధి తలుపులు చేరవేసి హెడ్ గుమాస్తాగారింటికి పయనమైంది. అడుగు వేసే కొలదీ ఆమెకు ఆయాసం రావటం లేదు, ఆనందం కలిగింది.

అరగంటలో ఇంటికి వచ్చి "ఈ దొంగ లెఖ్ఖలు చెప్పటం ఎప్పుడు నేర్చుకున్నారండీ? నెలకు జీతంలో నిలవకు పోయేది పది రూపాయలేటకదూ! మీరు నాతో పదిహేను అని చెప్పారుకదూ! ఆ ఐదురూపాయల చొప్పున పన్నెండు వందల సొమ్ము ఏమైందో చెప్పండి?" అని భర్తను నిలబెట్టి అడిగింది: "అమ్మ చేసిన మేలు నిమ్మయినా చేయకపోయినందువల్ల నెలకి నా టిఫిన్ ఖర్చు ఐదు రూపాయలు అవుతూండేది." అన్నాడాయన. అది ఆయన జీవితంలో "మే డే!" (*May Duy!*)

విప్లవానంతర వాతావరణం ఆయనకు వ్యతిరేకంగానే ఏర్పడింది. పాతనిమ్మకాయకైనా ఆయన నోచుకోకుండా పోయింది. ఇదివరకు ఆయన ఇల్లాలికై ఖైదీ అయితే ఇప్పుడు ఇల్లే ఆయనకు శ్రీకృష్ణ జన్మస్థానం అయింది.

కనకమ్మగారే పగటిపూట ఇంటికి కావలసిన బజారు సామానంతా స్వయంగా కొనుక్కువస్తూండే ఆచారాన్ని అవలంబించినందువల్ల నరసింహంగారు చిల్లిగవ్వకు కూడా నోచుకోలేకపోయారు. మాజీ ఎన్. జీ. ఓ లు మూర్ఖులు.

పరుషమైన పలుకు చెప్పడానికే పురుషుడు కావాల్సిఉంది కనకమ్మగారికిప్పుడు. విరామంవల్ల ఆమెకు విశ్రాంతి తగ్గింది; ఆయనకు విసుగు పెరిగింది.

పెరటిలోని భావివద్ద స్నానం చేస్తున్న కనకమ్మగారు కంగారుగా ఆరోజా పరుగెత్తుకుంటూ భర్తవద్దకు వచ్చి "ఆనందరావుగారిని ఇల్లు ఖాళీ చేయమని చెప్పండి" అన్నది.

"ఏం?" అని ఆయన అనలేదు, అనినట్లు ఆమెవైపు కళ్లు తిప్పాడు భర్తగారు.

"లక్ష్మికి నెల తప్పింది" అన్నది భార్యగారు. ★

శ్రీ నిడుదవోలు వేంకటరావు

పనప్పాకం అనంతాచార్యులవారు క్రీ. శ. 1842 సంవత్సరమున ఉత్తరార్కాడు మండలమునకు ప్రధాన పట్టణమైన చిత్తూరున జన్మించిరి. వీరి పండ్రెండవయేట తండ్రి మృతినొందగా బ్ర. క్రీ. కలువలపల్లి రంగనాథ శాస్త్రిలవారివద్ద, సంస్కృతము, నింగ్లీషును నేర్చి, కొన్ని దినములు పచ్చయప్ప కళాశాల కనుబంధముగానున్న యొక పాఠశాలయం దుపాధ్యాయులైరి. ఆ వెనుక శ్రీరంగనాథ శాస్త్రిలవారి ప్రోత్సాహమున ఎఫ్.ఏ. ప్రొఫిషెంటు పరీక్షయందు కృతార్థులై క్రీ. శ. 1869 వ సంవత్సరమున న్యాయవాది పట్టణమును బడసి న్యాయవాదులై, ప్రజాహిత జీవనమునందు పాల్గొనుచు, భాషాపోషకులై, పండితకవుల నాదరించుచు క్రీ. శ. 1908 లో కీర్తిశేషులైరి.

చెన్నపురిలో నాంధ్రభాషా పోషకులై చిరకీర్తి గడించినవారలలో ఆనందాచార్యులుగారొకరు. వీరు "వైజయంతి" అను మాసపత్రికను స్థాపించి, అందులో నృసింహ పురాణము, అనిరుద్ధచరిత్ర మొదలగు ప్రాచీన ప్రబంధములేకాక, ప్రసన్న రాఘవము ధనంజయవిజయ వ్యాయోగము మున్నగు నవీన నాటకములను సుమనోమనోజ్ఞము మున్నగు వచన కావ్యములను గూడ ప్రకటించిరి. మహా మహోపాధ్యాయ కొక్కొండ వేంకటరత్నము పంతులువారును, అభినవ పండితరాయ మాడభూషి వేంకటాచార్యులువారును వీరి యాస్థాన కవులు. కొక్కొండవారి బిల్హణీయమును, మాడభూషివారి భారతాభ్యుదయమును ముద్రింపించి ప్రకటించినది వీరే. హరికథా పితామహుడు అజ్జాడాది భట్ట నారాయణదాసు, బాటసారి యను కృతిని శ్రీ ఆనందాచార్యులవారి కంకితమిచ్చియున్నాడు. ఈ నడుమనే కీర్తిశేషులైన వేటూరి ప్రభాకరశాస్త్రిగారిని తొలుత ప్రోత్సహించినది వీరే. వీరుభయభాషలయందు పండితులు. తెనుగున మంజువాణీ విజయమను ప్రశస్తవచన కృతి రచించిరి.

ఉన్నత న్యాయస్థాన న్యాయవాదులలో ఆనందాచార్యులవారు పేరెక్కినవారు. ఒకవైపు భాష్యమయ్యంగారున్నచో నెదుటిపక్షమున ఆనందాచార్యులవారుండవలసినదేయన్నంత ప్రతిభాశాలురు - ఉత్తరాంధ్రదేశమున మొదటి బి. యల్. పట్టమును పుచ్చుకొనిన ప్రసిద్ధ న్యాయవాది, దానకర్ణుడు జయంతి కామేశము పంతులవారికీయన సహాధ్యాయి. ప్రజాజీవితమునందు గూడ పాల్గొని 1894 సంవత్సరము అమరావతిలోని దేశీయ మహాజనసభ కధ్యక్షుడయ్యెను. ఆ పీఠము నధిష్ఠించిన యాంధ్రుడీయన యొక్కడే. చనిపోవునాటికి వీరు, కలకత్తాలో సామ్రాజ్య శాసన సభలో సభ్యులుగా నుండేవారు. వీరి కుమారులు శ్రీనివాసాచార్యులుగారు - తండ్రి కీర్తి నిలుపబెట్టి, భీష్మవిక్రమము సతీమణి మున్నగు పెక్కు గ్రంథములు రచించి, యీ తరువాత కీర్తిశేషులైరి.

శ్రీ కొక్కొండ వేంకటరత్నము పంతులుగారు క్రీ. శ. 1887 లో బిల్హణీయమును రచించినపుడు దానిని ముద్రించిన శ్రీ పనప్పాకం అనంతాచార్యులవారిని గూర్చి చెప్పిన పద్యము.

"అవునీ శ్రీ పనపాక వంశజాడ
నంతాచార్యుడే కణ్వమా
నివరుండీ కృతియన్ శకుంతలను బూ
న్కిం బ్రోచి ముద్రించి యూ
నవ సింహోర్వణ మొప్పజేసె దన యా
నందంబు సంధిల్లదత్
స్తవనం బర్హముగాద చేయగను వి
శ్వామిత్రు డోనాకిటన్."

పిచ్చుక శాపం

సీతారామారావు మరొక్కమాటు దీర్ఘంగా ఆలోచించాడు, ఆలోచించడానికేం భయంలేదుగా అనుకొని. అదైనా మనస్సులో, రహస్యంగా, పదిలంగా ఆలోచిస్తున్నాడు. పైకి ఎవరితోనైనా చెప్పకుంటే నామోషీగాని తనలో ఆలోచించుకోడానికేం అని మనస్సుని సమాధానపరుచుకొన్నాడు. ఎంత ఆలోచించినా సుశీల విషయంలో ఆలోచన లొక కొలిక్కి రావడంలేదు రామారావుకి. ఇంతకీ సుశీలవిషయంలో అత నింతలా ఆలోచించడానికి ఆమె, అతని ఊహాప్రేయసి అయినా కాదు. స్వయానా అతని చేత తాళికట్టించుకొన్న భార్య.

ప్రశాంతంగా గడపవలసిన ఈ సాయం సమయంలో ఈ చిన్న విషయంతో మనస్సుని బాధపెట్టుకుంటున్నానే అనిపించిందతనికి. "చిన్న విషయమేమిటి, ఇది నాజీవిత సమస్య" అనుకున్నాడు కాసేపుండి. అసలామెలో ఆ వెకిలితనం మొదటినించీ కనిపెడుతూనే వున్నాడు. మొదటిరోజుల్లో సర్దేసుకున్నా రానురాను దుర్భరమైపోయిందతనికి, భార్య ప్రవర్తన. ఇతరుల్తో మాట్లాడుతున్నప్పుడు తన్ని గూర్చి అనేక విశేషణాలుపయోగించి భార్య పొగడ్డం అతనికి తెలియందికాదు. కాని ముఖాముఖీ మాట్లాడుతున్నప్పుడు మాత్రం తనే అన్నివిషయాల్లో మేధావి నన్నట్టు మాట్లాడేది. అతను ఎంత సీరియస్‌గా వున్నా వేళాకోళంగా జమకట్టేది.

అసలు ఆ బుద్ధి వాళ్ళ కుటుంబంలోనే వుందిలే అనుకొన్నాడు సీతారామారావు. అతని మామగారు పోలీసు ఇనస్పెక్టరు చేసి రిటైరయ్యాడు రామారావు పెళ్ళినాటికి. ఉద్యోగం మానినా మాటల్లోనూ, చేష్టల్లోనూ కరుకుదనంమాత్రం పోలేదు. తక్కినవాళ్లనంతా కిందిచూపుగా చూసేవాడు.

పెళ్లిచూపులకి వెళ్లినప్పుడే రామారావుకి కాబోయే మామగారి వేషధారణ, మాటలతీరు, మూతికి రెండువైపులా చిన్నమొక్కజొన్నపొత్తుల్లాగ తెల్లగా నెరసిన మీసాలు చూసేటప్పటికి గౌరవంతోపాటు, కొద్దిగా భయంకూడా వంట్లో పేరుకోడం ప్రారంభించింది. సుశీలని చూసేటప్పటికి రామామారావుకి తత్క్షణం ముహూర్తం పెట్టించి, అప్పుడే పెళ్లిజేసుకుందామన్నంత ఆలోచన వచ్చిందనడంలో అతిశయోక్తిలేదు. కాసేపుండి బెదురుతూనే రామారావు మామగారికేసి ఓరగా చూశాడు. గాలికి కొద్దిగా చివరభాగాలు ఎగురుతూన్న కుడిమీసాన్ని ఎడంచేతి గోళ్లతో గీరుతూ సవరిస్తూ, రెండో చేతితో తెల్లటి బొచ్చుకుక్కని నిమురుతూ, 'ఈ పిల్ల మా వంశంలో పిల్లోయ్, నువ్వు మాసింది మాపిల్ల మరేమిటనుకున్నావో, ఇలాటిది నీకు దొరుకుతుందా తపస్సుచేసినా?' అన్నట్టుగా చూశాడాయన. తీరా ఇతర విషయాల్లో కుదరక పెళ్లిచేసికోకపోతే "అంతసేపూ చూసి మా అమ్మాయిని చేసికోవూ?" అని నరికేస్తాడేమో నన్నంతభయం వేసింది రామారావుకి ఆయన్ని చూస్తుంటే. ఇలాటి వాడితో ఎలాగరా వేగడం బాబూ అనుకున్నాడు. అయినా చేసుకునేది ఆయన్ని కాదుగా, ఆయనెలావుంటే మనకేం అని సర్దేసుకున్నాడు. ఆయన కెంతసేపూ తన దర్జా, గొప్ప వొలకబోసుకుందామనే గాని, అలా చేస్తుండగా ఇతరులు తనమాటల వల్ల బాధపడుతున్నారేమో నని కూడ ఆలోచించడు.


పెళ్లిలో సీతారామారావు మంగళసూత్రం కడుతూంటే, ఆయన తమ్ముడితో "సూత్రం కూడా దర్జాగా కట్టలేడురా, మన అమ్మాయి చూడు ఎంత అందంగా వంచిందో మెడ" అని నవ్వుతూ మెల్లిగా అంటున్నాడు. సీతారామారావుకి చచ్చినంత పనయింది ఆమాటలు విన్న తర్వాత. పెళ్లినాలుగోనాడు ఉంగరం పానకంబిందెలో వేసి ఎవరు ముందు తీస్తారు వధూవరుల్లో అన్నప్పుడు, రామారావు చట్టున ఉంగరాన్ని పైకి తీసేశాడు. "పెళ్లాన్ని కాసేపు ఏడిపించడమేనా తెలియదేమిటోయ్ నీకు" అన్నాడు వెంటనే నవ్వుతూ సీతారామారావు మామగారు. పెళ్లాన్ని ఏడిపించడమనేది తాజమహల్ నిర్మాణం లాంటిది అని ధ్వనించేటట్టు. తలుపుదగ్గర పేర్లు చెప్పమన్నప్పుడు "మాపిల్లకంటే నువ్వే ఎక్కువ సిగ్గుపడుతున్నావేమిటోయ్" అన్నాడు కోర్టులో ముద్దాయిని క్రాస్ ఎగ్జామినేషన్ చేస్తున్నట్టుగా మొహం పెట్టి, అప్పుడే బి.యల్ పాసయివచ్చిన సీతారామారావు పెద్దబావమరిది హనుమంతరావు. అలక సమయంలో 'నీకేం కావాలో కోరుకోవోయ్' అన్నాడు సీతారామారావు మామగారు. సీతారామారావుకి "నాకేం వొద్దుబాబు, ఆ నీ మీసాలుమాత్రం తీయించేయి డబ్బు నేనిచ్చుకుంటాను. లేకపోతే నాకు భయంగావుంది" అనాలనిపించినా తట్టుకొని "సైకిలు" అని నసిగాడు. ఆయన మీసాలు చాటునించి మెల్లిగా నవ్వి "సైకిలేమిటోయ్ మరీను, మోటారు సైకిలైనా ఆఖరికి అడగవలసింది" అని వెంటనే మోటారుసైకిలు తెప్పించి ఇచ్చాడు. సీతారామారావుకి మాత్రం చెప్పుచ్చుకొని కొట్టినట్టయింది మామగారు చేసినపని.

తరువాత ఆయన కొన్నాళ్లకి మోటారు సైకిలుమీద షికారు వెళ్తూ, సైకిలు బోల్తా కొట్టగా మరణించాడు.

సరిగా అదేవరసలోవుంది భార్య ప్రవర్తన సీతారామారావుకి. ప్రతీమాటకీ చిలిపిగా వేళాకోళం చెయ్యడం, తనకే అన్నీ తెలిసినట్టుగా వ్యవహరించడం. ఇదీ ఆమె వరస. ఓసారి పిక్చరుకెళ్దామంది సుశీల. సరే అన్నాడు రామారావు. ఎంతకీ తెములక ఊరికే పౌడరు, స్నో, లిప్‌స్టిక్ రాసుకుంటూ కూర్చుంది సుశీల.

"అబ్బ, ఏమిటే ఆలస్యం, బాగానే వున్నావులే. అసలు మీవల్లే బోలెడు డబ్బు విదేశాలకు పోతోంది, మీ స్నోలకీ, లిప్‌స్టిక్‌లకీను" అన్నాడు రామారావు భార్యతో.

"ఏం చెపుతారండీ మీరు. మీ నాన్నగారు పెట్టుకొనే తిరుమాన్లానికి ఎంత డబ్బు ఎగుమతీ చేస్తున్నారో కాస్త



"చెప్పండి చూద్దాం" అంది సుశీల కిలకిలా నవ్వుతూ. విట్టువేద్దామనుకున్న రామారావు పెళ్ళాం హేళనతో చిత్తయిపోయాడు

మరోమాటు ఏదో కథ రాస్తున్నాడు రామారావు మొదటివాక్యం, "అప్పుడే వానకురిసి వెలిసింది నేలంతా సుగంధం వెళ్ళ వాసవేస్తోంది" అని రాశాడు.

ఎలా చూసిందో కాని సుశీల, "ఏం రాతలండి అవి వాన కురిసి వెలిస్తే సుగంధం వెళ్ళ వాసనేమిటి! ఏ అడివిలోనో పూలు, మొగలిడొంకలు అవీ దట్టంగా వున్నచోట వానకురిసి వెలిస్తే మంచి సువాసన వోస్తుందేమో! కాని మన యీ మునిసిపాలిటీ సైడుకాలువలున్న రోడ్డు మీద వర్షం కురిస్తే ఏం వాసనోస్తుందో తెలిసినవాళ్ళెవ్వరూ మీవర్ణనని ప్రశంసించలేరు" అంది తల్లో పాయతీసి జాజిపూలు తురుముకుంటూ.

ఓం ప్రథమంలోనే భార్య అలా హేళా కోళంగా అద్భుతగలగానే మహా చెడ్డ చిరాకెత్తింది రామారావుకు ఆ కథలోనే తరువాత, "ఆమె వదనం చంద్రబింబంలా వుంది" అని రాశాడు అది చదివి సుశీల "ఏమండీ, ఆమె ముక్కు మీద 'కంపాస్' పెట్టి గుండ్రటి సున్నా కొట్టారా బ్రహ్మ ఆమె వదనాన్ని చంద్రబింబంలా సృష్టించడానికి? అలా చేస్తేమాత్రం ఆమె మొహం పెద్ద తాటికాయలా వుంటుంది" అంది నవ్వుతూ

ఇలాంటి హేళనలు మొదట్లో ఎలా వున్నా చివరకు "తొండ ముదిరి, ఊసరవిల్లి అయింది" అనుకున్నాడు రామారావు. నోరువిప్పి ఎలా చెప్తాడు? తన బాధ భార్యతో పోనీ ఎవరితోనైనా చెప్పుకునే పరిస్థితి కాదాయిరి ఆలోచనల్తో బరువెక్కిన హృదయంతో ఇంట్లోకొచ్చి "బాబ్జీ" అని నాల్గేళ్ళ కొడుకుని పిల్చాడు. పిల్లాడు నవ్వుతూవచ్చి చంకెక్కాడు. ఇంతట్లో సుశీల వొచ్చి కాఫీయిచ్చి రామారావుకి, "అదేమిటండీ అలా ఎత్తుకున్నారు వాణ్ణి, కూజాబిందె చంకపెట్టుకున్నట్టు" అంది. ఇంటికొచ్చాను మొదలప్పుడే అనుకున్నాడు రామారావు కుర్చీలో కూర్చుని కాఫీ గుటకేస్తూ.

ఇంతలో, "అమ్మా, కళ్ళు మండుతున్నాయే" అన్నాడు బాబ్జీ

"ఏమండీ, వీడి కళ్ళమంటలు తగ్గడం లేదు. మీ మందు మానండి బాబు వీడికి హోమియోపతీ అంటూ పంచదారమాత్రలు మీరు ఇస్తుంటే చల్లగా వాడు తింటున్నాడు. కళ్ళమంటలు తగ్గడంలేదు" అంది సుశీల రామారావుతో.

రామారావు హోమియోపతీ వైద్యం చేస్తాడు అది "హాబీ" అతనికి

కాసేపుండి సుశీల "పోనీలెండి మీరు మందు మార్చకపోతే మా అన్నయ్యకి ఉత్తరం రాస్తాను, వస్తాడు. నేను బాబ్జీ మావూరు పోతాం" అంది

"మరి నన్నేం చెయ్యమంటావ్?" అన్నాడు రామారావు

"వెళ్ళగలిగితే మీ పుట్టింటికి మీరూ వెళ్ళండి. లేకపోతే నరసమ్మ హోటల్లో రెండుపూటలా పెరుగుతోసహా 32 రూపాయలు ఆఫీసుకెళ్ళూ రెండుపూటలు భోంచెయ్యండి" అంది సుశీల, విసురుగా నవ్వుతో కలిసిన కోపంతో

గాఢంగా నిట్టూర్చి సీతారామారావు కుర్చీలోనే కళ్ళుమూశాడు

నాలుగురోజుల తర్వాత సుశీల అన్న హనుమంతరావు వచ్చి కూలీవానికి డబ్బిచ్చి, కోటు విప్పుకుంటూ, బాబ్జీకి మిఠాయి పొట్లం ఇచ్చి, ఇంట్లో రంగం చూసి ఆశ్చర్యపడ్డాడు

సీతారామారావు వస్తాదులా చిన్నపట్టు పంచ విరిచి తొడలోకి కట్టి, ఒక చేతిలో

పిచ్చుక శాపం

అన్నంపళ్లెం, ఇంకో చేతిలో చారుగరిటె పుచ్చుకొని, చిరాగ్గా పెళ్ళాంతో "ఇంకొంచం వేయనా" అంటున్నాడు.

సుశీల నవ్వు ఆపుజేసికొని "ఎప్పుడొచ్చావన్నయ్యా; రా ఇంట్లోకి" అంది మూలగా జరిగి. హనుమంతరావు కాళ్లూ చేతులు కడుక్కొని, "ఇదేమిటోయ్ బావా, ఇలా తయారయ్యావ్, అజ్ఞాతవాసంలో భీముడిలా చేతిలో ఇనప గరిటె నీవూనూ" అన్నాడు మొహం రుమాలుతో తుడుచుకుంటూ.

"ఏముంది. మీ చెల్లెలు మూడు రోజులు 'కాజుయల్ లీవు' పెట్టింది" అన్నాడు పొద్దున కూర దింపుతూంటే కాలిన బొబ్బలు వూదుకొంటూ.

రామారావు అన్నమాటల్లో అర్థం సుశీల ఫిఫ్త్‌ఫారపు ఇంగ్లీషు తెలివితేటలకి అందినట్టుగా కొద్దిగా సిగ్గుతో వంచిన ఆమె తలే చెప్తోంది.

కాసేపుండి సుశీల "అదికాదన్నాయ్. మొన్నోమాటు అన్నం చిమిడిందని కేకలు మొదలెట్టారు. 'మీకేం, మీ కేమైనా అంటారు, వండేవాళ్లకి తెలుస్తుంది. వార్చేటైముకి బొబ్బి ఏడ్చాడు. మీరు వండండి తెలుస్తుంది పస' అని మాటవరసకన్నాను. దాంతో నాకేనా వంట రాదంటావ్ అని నేనిలా కూచున్నానో లేదో ఆఫీసుకి 'కాజుయల్ లీవు' పెట్టి పొయ్యిదగ్గిర కూర్చున్నారు. అక్కడికీ నేను 'మీ కలవాటు లేదు. ప్రతీసారీలాగే క్యారియర్ తెప్పించండి' అన్నా. ఆయన వింటేగా. ఇక ఏమి చెప్పను బాబూ మీ బావగారి వంట" అని విరగబడి నవ్వి "నిన్న బీరకాయకూర వండమంటే, నాతో చెప్పకుండా వంకాయి తరిగి గిన్నెలో వేశారుట. అది నాకు తెలీదు. 'ఏం వెయ్యాలంటావ్ కూరలో' అని అడిగితే పిండి వెయ్యండి అన్నా; బీరకాయకూర కదా నీరు పోయి గట్టిపడుతుందని. ఇక చూసుకో అన్నయ్యా, ఆయనా వంకాయి కూరలో ఇంత పిండి పోసేశారా, అది ఆకారానికి పిడకలాగ తయారయింది. రుచి దాని తాలూకు రుచే వచ్చిందని వేరే చెప్పాలా. పోనీ అదలా వుంచు. పొయ్యి మండటం లేదని గొట్టంతో ఊదడం ప్రారంభించారు. ఎంతలా వూదారో కాని అన్నం పాకమయిపోతే! విస్తట్లో వేస్తే అది పాకిపోతోంది గాని నిలిస్తేగా! మెట్టూరు డాము దగ్గిర వేసినంత ఆనకట్ట వేసినా ఆ ప్రవాహం ఆగదు. ఇంక వడియాలు వేయించారు, అవి తిరగట్లో వేసినా నలగబడవు. ఇవాళ కూర

మాటపట్టింపు

అది మెడికల్ కాలేజీ. అందులో మొదటి సంవత్సరం చదివే అమ్మాయిలందరిలోకీ ఒక అమ్మాయి ఎందుకో 'గర్భవతి' అన్న మాట అనటానికీ, వినటానికీ విపరీతంగా సిగ్గుపడటం మొదలు పెట్టింది. ఇది చూసి లెక్చరర్ చిరాకు పడ్డాడు.

"అది కాదమ్మా! ఆమాట అనటానికే అంత సిగ్గుఅయితే ఎల్లా? మీ అమ్మ గర్భం ధరించింది, మీ అమ్మమ్మ గర్భం ధరించింది; మీ ముత్తవ్వ గర్భం ధరించింది. త్వరలో నీవూ గర్భవతివి కావచ్చు" అన్నాడు.

ఆ అమ్మాయి కళ్లనీళ్లు కారుస్తూ యింటికెళ్లి వాళ్ల నాన్నతో యీ లెక్చరర్ మీద పితూరీ చెప్పింది. ఆయన వుగ్రుడైపోయి టెలిఫోన్ రిసీవర్ ఎత్తి ఆ లెక్చరర్‌ని పిలిచి "మా అమ్మాయి గర్భవతి అవుతుందని అంటూ ఏమేమో పేలావట! రేపు పబ్లిక్‌గా క్లాసులో క్షమార్పణ వేడుకోకపోతే చూసుకో— నిన్నేం చేస్తానో" అని గాండ్రించి రిసీవర్ ఠక్కున పెట్టేశాడు.

మర్నాడు క్లాసుకు వచ్చి రావటంతోనే ఆ లెక్చరర్ పిల్లలందరికేసీ చూసి "నిన్నటి క్లాసులో ఆ అమ్మాయి రేపో మాపో గర్భవతి కావచ్చునన్నాను. కానీ – నిజం అది కాదు. ఆ అమ్మాయి అసలు ఎన్నటికీ గర్భవతి కానే కాదు–" అని వూరుకున్నాడు.

పోపుకి మూకు గిన్నెలో వెయ్యకుండా మిరపకాయలు మాడ్చేశారు. అవి మాడిపోయి గొంతు మొదలెట్టాయి. 'ఏం చెయ్యమంటావ్ గొంతు వస్తోంది' అని ఆయన వంటింట్లోంచి కేకలు. 'గొంతు వస్తే ఏం చేస్తారు. పిల్చండి రొంపేమైనా వుంటే పోతుంది' అన్నా. అంతకంటే ఏం చెప్పగలం యీ మూల కూచుని అలాంటివాళ్లకి. ఇదీ బావగారి వంటభాగోతం" అని మధ్య మధ్య అభినయాలు చేస్తూ చెప్పింది.

"సరే కాని. ఇంక నీ వంట కట్టిపెట్టవోయ్. హోటలునించి తెప్పించుకొందాం" అని హనుమంతరావు అన్నాడు.

ఎలా గయితేనేం ఆ రెండు రోజులు గడిపేశారు. మూడో రోజున భోంచేసి తమలపాకులు నములుతూ హాల్లో కూర్చున్నారు.

"ఏమోయ్! పిల్లాడి కళ్లు జబ్బుగా వున్నాయిట. నువ్వేమో ఆ మాత్రలు ఇస్తున్నావుట మంటలు తగ్గడానికి. ఏదో మంచి మందు చూడాలి గాని ఆ మాత్ర లేమిటి. పోనీ మా వూరు తీసికెళ్ళి వైద్యం చేయిస్తా" అన్నాడు హనుమంతరావు అగ్గిపెట్టిమీద సిగరెట్టు కొడుతూ. తన మందు నలా తీసి పారేసేటప్పటికి తల కొట్టేసినట్టయింది రామారావుకి. ఇంతలో అగ్గిమీద గుగ్గిలం వేసినట్టు, "అలా నువ్వైనా చెప్పన్నయ్యా వింటారేమో" అంది భార్య. దీంతో రామారావుకి పట్టలేనంత కోపం వచ్చింది.

"ఏమిటోయ్ అలా అంటావు? మా అబ్బాయి మందు సంగతి నాకు తెలీదు? వాడి కళ్లు పోతాయంటే నాకొ మాత్రం బాధ్యత లేదూ? పోనీ ఒక్క విషయం. నీ భార్య ఆస్తివిషయమై తగాదా వస్తే నువ్వు పీడరువయి వుండి వకాల్తా ఇంకొళ్ళ కిస్తావా? అలాగా మా అబ్బాయి కళ్ల విషయం నేను చూసుకోగలను" అన్నాడు రామారావు బావమరిదితో.

"ఇంకా నయం. నీ పెళ్ళాం ఆస్తిమీద దావా వేసినవాణ్ణి నాదగ్గరికే పంపించు. వాడికి పంచదారమాత్ర లిచ్చి రోగం కుదుర్చానన లేదు" అంది సుశీల ఎత్తిపొడుపుగా. ఇక రామారావుకి పట్టపగ్గాలు లేనంత కోపంవచ్చింది. తాడి ఎత్తున లేచాడు. "నీకెన్నో మాట్లు చెప్పాను సీరియస్ గా వున్నప్పుడు వేళాకోళంగా మాటాడొద్దని. నే నెన్నివిధాల ప్రయత్నించినా నీవు మానలేదు" అని రామారావు పెళ్లాన్ని నానామాటలు అన్నాడు. అంతా విని సుశీల, "ఏమండీ సామ, దాన, భేద, దండోపాయాలున్నాయి గదా, ఏది ఉపయోగించారండీ నామీద, నా వేళాకోళం తగ్గడానికి" అంది.

"అమ్మాయి నువ్వూరుకో, అయినా అంత వెకిలితనం కూడదు సుశీ" అని హనుమంతరావు చెల్లెల్ని మందలించాడు.

ఆ సాయంత్రమే, "ఇక్కడే మంచి మందిప్పించవోయి" అని చెప్పి హనుమంతరావు వెళ్లిపోయాడు.

2

ఆర్నెల్లు గిఱ్ఱున తిరిగాయి. సుశీల వేళాకోళాలు తగ్గించినా మాన లేదు. రామారావు అప్పుడే ఆఫీసునించి వచ్చి కాఫీ తాగి పేపరుచూస్తున్నాడు. సుశీలప్పుడే తెల్లటివాయిలుచీర నల్లటి జాకట్టుతో వొచ్చింది. "ఏమండీ..."అంది.

....

"మిమ్మల్నేనండీ" అంది కాసే పుండి సుశీల.

"ఏం" అన్నాడు రామారావు పేపరు ముఖాని కడ్డుతీసి. "కొంచెం వేళాకోళం జాస్తిగాని నా పెళ్లానికేం ఐస్ క్రీమ్" అనుకున్నాడు మనస్సులో—

"మరి......" అంటూ నోటిలో చీర చెరగు నలుపుతూ వూరుకుంది.

"ఏమిటీ చెప్పు" అన్నాడు రామారావు వరాలిచ్చే దేముడి పోజులో. సుశీల బుగ్గలు కొద్దిగా ఎఱ్ఱపడి లేతగులాబీరంగు లెక్కాయి.

"ఇంక కాజువల్ లీవు లుండవ్" అంది కాలి బొటన వేల్తో నేల రాస్తూ.

పిచ్చుక శాపం

రామారావుకి భార్య ఉద్దేశం అర్థమయింది.

"అమ్మ కాజుయల్ లీవు అంటే ఏం తమ్మా?" అన్నాడు బాబ్జీ కాసేపు కంగారు పడి చేతిలోవున్న చిలకముక్క వాడినోట్లో పెట్టింది సుశీల మాట మరిపిద్దామని. వాడు అది కాస్తా తాపీగా తినేసి ఇందాకటి ప్రశ్న రెట్టించాడు.

"అంటే నీకు తమ్ముడు పుడతాడురా" అన్నాడు రామారావు కొడుకుతో. ఆ చిన్నపిల్లాడికి ఏం అర్థంకాకపోయినా అంతా అర్థమయినట్టుగా నవ్వాడు.

"అమ్మ పిచికలు చూడవే" అని చూపించాడు బాబ్జీ. తలుపు అంచుపైన మొగపిచిక ఆడుపిచిక నోట్లో గింజలు పెట్తోంది. గూట్లో రెక్కలు రాని చిన్న పిచికపిల్ల కిచకిచమంటోంది. ఒక పెద్ద పిచిక వచ్చి గూట్లోని పిల్లనోట్లో ఆహారం పెట్టింది. రామారావు చటున పిల్లాడ్ని ఎత్తుకొని ముద్దు పెట్టుకొన్నాడు.

"నీ గడ్డం గుచ్చుకొంటోంది అని వాడు కిందికి జారాడు.

కాసేపున్నాక సుశీల "మీరు ఉత్తరం రాయండి" అంది. దేని విషయమో రామారావుకి తెలుసు. "నువ్వు రాయి మీ అమ్మా వాళ్ళకి" అన్నాడు రామారావు.

"నాకు సిగ్గుబాబు"తలవంచి అందిసుశీల.

"మీ అమ్మకి రాయడానికి నీకు సిగ్గయితే, మా అమ్మకి రాయడానికి నాకూ సిగ్గ" అన్నాడు రామారావు. ఇద్దరూ నవ్వుకున్నారు.

ఇంతలో పెద్ద పిచికలు రెండూ ఎగిరి పోయాయి. గూటిలోని పిచికపిల్ల పైకి రాబోయి చోటుచాలక ఆ పైనించి నేల మీదపడి రక్తం గక్కుకుంది. ఆ రక్తపుగుడ్డు రక్తపుముద్దలో గిలగిల కొట్టుకొంటోంది. రామారావు దాన్ని తీద్దామని పోబోయాడు. సుశీల అతన్ని చెయ్యి పట్టుకొని ఆపి, "పోనిద్దురూ వెధవపిచిక. ఉత్తరం రాయకపోతే మానారుకాని రాస్తే మాత్రం క్రితంసారిలారాయకండేం. 'బాబ్జీ' పుట్టేముందు వేవిళ్ళని రాయడానికి బదులు 'మీ అమ్మాయికి డోకులూ, విరోచనాలు వెళ్తున్నాయి, వెంటనే రావలసిందని మా అమ్మకి, రాశారుట. దాంతో ఆవిడ, ఏ 'కలరా' వచ్చిందోనని గుండెలు గోక్కుంటూ వచ్చింది" అంటూ కిలకిలానవ్వింది.

చిన్న పిచిక రక్తంలో పొర్లుతూ 'చకి కిచ' మంటోంది. ఇంతలో ఎలా వొచ్చిందో పిల్లి ఒకటి వచ్చి గుటుక్కున కొనప్రాణంతోవున్న పిచికను నోట్లో వేసి కొని నమిలివేసింది. కళ్లు చెమర్చాయి రామారావు కది చూడగానే. ఇదేమీ చూడకుండానే సుశీల వేళాకోళం ఆడుతూనే వుంది రామారావుతో. "చూశావా నీ వేళాకోళంమూలాన్న నిండుప్రాణం బలి అయిపోయింది" అన్నాడు రామారావు అటు తిరిగి. పిచికను చప్పరిస్తున్న పిల్లిని చూడగానే సుశీలకి కళ్ళవెంబడి నీరు కారింది.

ఆ రాత్రంతా పెద్దపిచికలు నిద్రలేకుండా అరుస్తూనే వున్నయ్.

తరువాత పుట్టింటివాళ్లు సుశీలని పురిటి కోసం తీసికెళ్లారు. కొన్నాళ్ళకి అర్జెంటుగా రమ్మని అత్తవారిపూరినించి ఉత్తరం వచ్చింది రామారావుకి. వెళ్ళాడు. గుడ్లనీళ్లు కుక్కుకుంటూ అత్తగారు చెప్పింది. సుశీల కనలేక కనలేక మరణించిన ఒక మగశిశువును యీ భూమ్మీద వదలి, మళ్లా ఆ శిశువును మటిలో కలిపిన 4, 5 రోజులకి చావు తప్పి కన్ను లొట్టపోయి నంత పనయిం తరువాతస్పృహలోకివచ్చిందిఅని.

నీరసంగా ప్రక్కమీద పడుకున్న భార్య గదిలో కెళ్ళాడు సీతారామారావు. పచ్చటి భార్య శరీరం కొద్దిగా పాలిపోయి బాలింతరాలి సోయగంతో విపరీతమైన లావణ్యంతో మెరిసిపోతోంది రామారావు కళ్లకి. ఆమె వదనంపై శుష్కహాసం వెలిసింది భర్తని చూడగానే. సీతారామారావు మంచం పట్టెపై కూర్చుని భార్యని చూస్తూ వూరుకున్నాడు ఏం మాటాడాలో తెలీక.

ఆమె అతని అరచేతిని తన దోసిలిలోకి తీసికొని "అవాళ మిమ్మల్ని అలా మాటల్లో పెట్టి వేళాకోళం ఆడిఉండకపోతే పిల్లి పిచికను తినేసేవుండదు. మన పిల్లాడూ మనకి దక్కేవాడు" అంది ముఖం ప్రక్కగా త్రిప్పుకొని. 'దానికీ దీనికీ సంబంధమేమిటిపోనిద్దూ' అన్నాడు రామారావు పైకిమాత్రం లోపల భార్యచెప్పింది నిజమేమోనని ఆలోచిస్తూ.

"నా వేళాకోళాలవల్లే మన పిల్లాడు దక్కలేదు మనకి. ఆ పిచికలు శపించాయి" అంది సుశీల మళ్ళా.

మళ్లా అప్పటినించి ఇప్పటివరకు సుశీల, సీతారామారావుతో వేళాకోళంగా మాట్లాడలేదు.

సామ, దాన, భేద, దండోపాయాలవల్ల సీతారామారావుకి కొనిపని పిచ్చుక శాపంతో ఫలించిందా? ★

సరికి సరి

అలసట తీర్చుకోటానికి బండి స్టేషన్లో ఆగింది. నేను దిగవలసిన స్టేషన్ అదే గనుక దిగటానికి ప్రయత్నం ప్రారంభించాను. ఆ రాక్షసులనూ, తాటకలనూ తప్పించుకుని ఇవతల పడేసరికి వచ్చిన పెద్దలంతా కనిపించి ఆశీర్వదించారు. ఇంత శ్రమపడి అత్తయ్యను చూడకపోతే ఏంపోయిం దనిపించింది.

అత్తయ్య ఇంటికి వచ్చాను. శ్రీనాథం మట్టిలో చిన్న పుల్లముక్కతో ఆడుకుంటున్నాడు. పరుగెత్తుకెళ్ళి వాళ్ళమ్మకు నా రాక నెరిగించాడు. మరుక్షణంలో అత్తయ్య తన స్థూలకాయాన్ని బయటికి చేరవేసింది. పద్దెనిమిదేళ్లు వచ్చినా చెంగు చెంగున లేడిపిల్లలా గంతే సీతారత్నం కనిపించకపోయేసరికి దిగులు బయలుదేరింది.

'రారా! ఎంతకాలమైంది ముఖం చూపించి. పొత్తిగా మఱచిపోయావు' అన్నదత్తయ్య.

'ఎంతమాట' అంటూ యింట్లో అడుగుపెట్టాను.

'ఇప్పుడేవస్తా. హాల్లోకూర్చో' అంటూ వంటింట్లోకి దారితీసింది. కుర్చీలో కూలబడ్డాను. వంటింట్లోంచి ఏవో గుసగుసలువినిపించాయి. నావి పాముచెవులని చెప్పటం మరిచాను. అత్తయ్య అంటోంది: 'అయితే ఏంచేయమంటావు? అలాగనమంటావా? అసలు రహస్యం గ్రహిస్తాడేమో!'

'మరేం ఫరవాలేదు. అంతటి కార్యశూరుడు కాడులే' అని మరొక కంఠం జవాబిచ్చింది. అది అత్తయ్య పెద్దకూతురు కంఠం. నాకంతా అయోమయంగా ఉంది.

'అమ్మాయి! త్వరగా కాఫీచెయ్యి. అతనువచ్చాడు' అని గట్టిగా అన్నది. వంటింటికి వెళ్ళటానికి కారణమిదే నని నిరూపించటానికి గామోలు! హాల్లోకి వచ్చింది.

'ఏరా! ఇలాగేనా చేయటం? దగ్గరి చుట్టానివి. నువ్వే మమ్మల్ని ఇంతలాగ మఱచిపోయావే! ఇంతేనటరా బంధుత్వం? స్వయంగావచ్చి పిలవాలసింది. పొరపాటు జరిగిపోయింది. ఇక్కడ మగదిక్కు వరూ లేరని నీకు తెలియదూ? ఇంత నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తావనుకోలేదురా' అని గుక్క తిప్పుకోకుండా మందలించింది.

నేను నివ్వెరపోయాను. నాకు తెలిసినంతవఱకు అత్తయ్య కేవిధమైన ద్రోహమూ చేయలేదు.

'నీ మాటలు నాకేమీ అర్థంకావటంలేదు. సీతారత్నమేది?' అన్నాను.

'దానికే మొన్న పెళ్ళయింది. అత్తారింటికి వెళ్ళిపోయింది. పెళ్ళికి నువ్వెందుకురాలేదని అడుగుతున్నాను. నువ్వురాకపోవటంమూలాన అదెంత బాధపడిందో తెలుసా? నాకంతా శూన్యంగా కనిపించింది. నిజానికి కళ్ళమ్మట నీళ్లువచ్చాయి'

'సీతారత్నానికి పెళ్ళని నాకు తెలియజేయందే ఎలాగ తెలుస్తుంది? నాకు దివ్యదృష్టి ఉందనుకున్నావా?'

'శుభలేఖపంపాను. ఉత్తరం రాశాను. అలా మాట్లాడతావేం? ఉత్తరం అందలేదేమిటి కొంపతీసి?'

'ఊఁ ఊఁ ఏదీ అందలేదు. అందితే ఎగిరివచ్చేవాడిని. సీతారత్నం పెళ్లికి రాకుండా ఉంటానా?'

శ్రీ ఆర్. యం. చిదంబరం

'ఎంతపని జరిగిపోయింది! అరెరె! ఈ పోస్టల్ వాళ్లు వట్టివెధవలు, ఉత్తరాలన్నీ పారేస్తున్నారు. స్వరాజ్యం వచ్చిందట. ఎందుకు? ఉత్తరాలుకూడా తిన్నగా అందటంలేదు. ఇంకెందుకీ స్వరాజ్యం?' అని ఏళ్ళతరబడి కష్టపడి మనంతెచ్చుకున్న స్వరాజ్యాన్నికూడా తిట్టేసింది.

'నువ్వన్నది వాస్తవమత్తయ్యా! సీతారత్నంపెళ్ళికి రావాలని ఎంత సరదా పడ్డాను!'

'ఈవేళ పత్రికలో ఓ వార్తుంది చూచావా? ఒక ఉత్తరం ఆరేళ్ళు ప్రయాణంచేసి రాసినతనికే తిరిగి వచ్చిందట. ఎంత దారుణంగా ఉందో చూడు.'

'అంతే నత్తయ్యా...వస్తాను మరి.' అని బయటికి వచ్చాను. వీధిగుమ్మం దాటాక 'కాఫీ తాగిపోరా' అని నెమ్మదిగా అంది. నేను కూడా మాట్లాడకుండా నడక సాగించాను. గట్టిగా అంటే ఎక్కడ తిరిగివచ్చి కాఫీ తాగేస్తానో అని ఆమెకు భయం! ఆ విషయం నాకు బాగా తెలుసు. తల్లీ కూతుళ్ళ గుసగుసలే అర్థం కావటంలేదు. మరికొన్నాళ్ళకు—

మళ్ళీ అత్తయ్య ఇంటికి వెళ్లాను. మామూలుగానే ఆహ్వానించి కాఫీ తయారు చెయ్యమని కూతురుకు ఆర్డరిచ్చింది. వీధిగుమ్మానికి తోరణాలు కట్టియుండటం చూచి 'ఏమైనా శుభకార్యం జరిగిందేమిటత్తయ్యా?' అన్నాను.

అత్తయ్య ముఖం ముడుచుకుపోయింది. మరుక్షణంలో ముఖంమీద విచారతెరలు దింపేసుకుని 'నీ పనేమీ బాగాలేదురా. ఇంత దగ్గఱవాడవై యుండికూడా మాతో తెగతెంపులు చేసుకోవడం మంచిది కాదురా. నువ్వింత కఠోరంగా ప్రవర్తిస్తావని నేనెన్నడూ అనుకోలేదు. పోనీ సీతారత్నం పెళ్ళి సంగతి తెలియకుండా పోయింది. రామంగాడి ఒడుగుకన్నా రాకూడదూ? ఇంతేనా బంధుత్వం?' అన్నది.

'ఆ సంగతి కూడా నాకు తెలియలేదే!' అన్నాను అయోమయంగా చూస్తూ.

'అయితే ఈసారికూడా ఉత్తరమందలేదన్నమాట. ఈసారి ఏమన్నా శుభకార్యం జరిగితే టెలిగ్రాం ఇవ్వాలి'

'అదిమాత్రం అందుతుందని నమ్మకమేమిటి?' అన్నాను.

తల్లీకూతుళ్ల గుసగుసల అంతరార్థం బోధపడింది. అయినా అత్తయ్యను నిందించడమెందుకు? ఆమె కుటుంబం చాలా పెద్దది. హిందూదేశమంతటా ఆమెకు బంధువులే. ప్రతి శుభకార్యానికి వీళ్ళందర్నీ పిలిస్తే అత్తయ్య మరునాడే కొలంబో కొబ్బరి చిప్ప చేతబట్టాలి. ఈ యుక్తి కూడా బాగానే ఉంది. నామాటల్లోని వ్యంగ్యాన్ని గుర్తించినట్టుంది. ఆ ధోరణి వదిలేసింది.

'సరేకాని మన స్వర్ణకేదైనా సంబంధం

(౫౬-వ పేజీ చూడండి)

సీరియల్ నవల

రెండు మహా నగరాలు

చార్లెస్ డికెన్స్

మాడెమ్ డిఫార్జ్ ఒక చిన్న అత్యవసర సమావేశం యేర్పాటుచేసింది; సెయింట్ ఆంటోనీ పానశాలలో కాదు; కట్టెలు కొట్టేవాడి అడితీలో. ఆ సమావేశంలో ప్రతీకారిణీ, జాక్వెస్ నెం. 3 కూడా పాల్గొంటున్నారు. కట్టెలు కొట్టేవాణ్ణి మటుకు కొస్త దూరంగా తట్టే పెట్టి, తమలో తాము, ముందు కొంత రహస్య ప్రసంగం జరుపుతున్నారు.

'మన డిఫార్జ్ బాబు దేశభక్తుడు కాదంటేమటుకు నేను ఒప్పుకునేది లేదు' అన్నాడు జాక్వెస్.

'అంతకంటే వీరాధివీరుడైన దేశభక్తుడు మరొకడెవడూ లేడని కూడా నేను ఢంకామీద దెబ్బకొట్టి చెబుతాను' అన్నది, ప్రతీకారిణి.

'ఇష్!—ఇలా వినండి' అన్నది మాడమ్ డిఫార్జ్: 'మా ఆయన దేశభక్తుడు కాదనీ, వీరుడు కాదని నేనటం లేదు. కాని ఆయనలో ఒక బలహీనత వుంది; ఈ డాక్టరంటే మాత్రం ఆయన మెత్తబడిపోతాడు'

'చాలా విచారకరమైన సంగతి' అన్నాడు జాక్వెస్; 'అలాంటి దేశభక్తుడికి వుండాల్సిన లక్షణం గాదు—చాలా విచారకరమైన సంగతి.'

'అసలు ఈ డాక్టర్ అంటే నేను యెక్కువగా పట్టించుకోను—ఆయన బ్రతికినా చచ్చినా నాకొకటే—కాని ఆ ఎవ్రీమాండ్ కుటుంబం మాత్రం నాశనమైపోకుండా వుంటానికి వీల్లేదు. అతనూ, అతని భార్యా, బిడ్డా—ముగ్గుర్నీ మాటుమార్చెయ్యాల్సిందే.'

'అవును ఆ నీలికళ్లూ, ఆ బంగారుజుట్టూ ఎంతో అందంగా వుంటుంది—ఆ తల గిలటైన్‌లో తెగి అవతల పడుతుంటే ఎంతో వినోదంగా వుంటుంది' అన్నాడు జాక్వెస్.

మాడెమ్ డిఫార్జ్ ఒక్క క్షణం కళ్ళు మూసుకుని కొంచెం ఆలోచనలో పడ్డది.

జాక్వెస్ మళ్ళీ అందుకున్నాడు: 'ఆ చిన్నపిల్లకూడా!—భేష్! బాగుంటుంది—దానిక్కూడా నీలికళ్ళూ బంగారు జుట్టూ వున్నయ్—నిజానికి మనకు చిన్నపిల్లలు దొరకటంలేదు—పసి తలకాయల్ని తెగిపడటం, ఖలే తమాషాగా వుంటుంది.'

ఆ క్షణిక మౌనంనుంచి బయటపడి, మాడెమ్ డిఫార్జ్: 'ఇంతకీ నేను చెబుతున్న దేవిటంటే, యీ విషయంలో మా ఆయన్ని నమ్మటానికి వీల్లేదు. అందుకే మనం అనుకుంటున్న కార్యక్రమ వివరాలన్నీ ఆయనతో చెప్పకుండా వుంచాను. ఇంకా ఆలస్యమైతే—ఈయన వాళ్లకి నెమ్మదిగా యీ సంగతి చెప్పి పరారీ చేయించుతాడేమోనని కూడా నా అనుమానం.'

'అదిమటుకు జరగటానికి వీల్లేదు—ఒక్కరుకూడా తప్పించుకు పారిపోవటం కుదరదు' అన్నాడు జాక్వెస్: 'మనకు రోజుకు, కనీసం ఒక శతమానం బుర్రలన్నా వుండాలి.'

'భాయీ! ఇలారా!'—మాడమ్ డిఫార్జ్ దూరంగా కూర్చున్న కట్టెలుకొట్టే ఆసామిని దగ్గిరికి పిల్చింది. ఇదిగో! ఇలా చూడు—నేను ఇలా కన్నుకొట్టగానే నువ్వు బోనెక్కి సాక్ష్యం చెప్పెయ్యాలి:

'ఓ!—ఎందుకు చెప్పనండి!' అని రిహార్సల్ ప్రారంభించాడు కట్టెల ఆసామి: 'ప్రతీరోజూ, ఎండగానీ, వానగాని, వొంగిడిగాని, నిత్యం సరిగా రెండు కొట్టేసరికల్లా బిడ్డనెత్తుకొని జైలుగోడ మూలవచ్చి నిలబడేది. పైనున్న కిటికీవంక చూసి యేవో సౌజ్ఞలు చేస్తూవుండేది. అలా నాలుగుగంటలదాకా అక్కడే వుండి వెళ్ళిపోయేది. ఇదంతా ప్రత్యక్షంగా నా కళ్ళతో చూసిన సంగతి'—

'నిజంగా యేదో కుట్ర జరిగేవుంటుంది' అన్నాడు జాక్వెస్.

'అవును అదే చెప్పేది—ఇదంతా మీ జూరీ పెద్దమనుషుల మీద ఆధారపడి వుంది'

'ఓస్!—జూరీ విషయంలో మాత్రం యెలాంటి సందేహమూ అక్కర్లేదు. ఆ సంగతి నేను చూసుకుంటానుగా'

'సరే అనంతరం, రెండో సాక్ష్యం నేను' అన్నది, మాడమ్ డిఫార్జ్—'నేను చూసివున్నాడు, డాక్టర్ మానెట్ కూడా కూతురు దగ్గిర నిల్చునున్నాడు; ఇద్దరూ కలిసే సౌజ్ఞలు చేస్తున్నారు.'

'భేష్!—మజా అయిన సాక్ష్యం!— ఇంతకంటే యేం కావాలి!—హిప్! హిప్! హుర్రే!'—

'అబ్బాయ్! ఈ మూడు గంటలకు నీకు పనుంది గాదూ—గిలటైన్ వినోదం చూట్టానికి వెడతావనుకుంటాను—సరే వెళ్ళిరా—మాడింటికి నేను అక్కడికి వస్తానే—రాత్రి ఎనిమిదింటికి మా యింటికి వచ్చి కలుసుకో; మిగతా సంగతులన్నీ చెబుతాను' అని కట్టెలకూలీకి హుకుంచేసి, మాడెమ్ డిఫార్జ్ మిగతా అనుచరుల నిద్దర్నీ వెంటబెట్టుకుని బయలుదేరింది. గేటుదాకా వెళ్లిం తరవాత చివాల్న వెనక్కి తిరిగి: 'ఇదిగో చూశారూ!—నేను యిప్పుడు డాక్టర్ యింటికి వెడుతున్నాను. అది ఇప్పుడు ఇంటికాడే వుంటుంది; మొగుణ్ణి చంపబోయే వేళైందని ఏడుస్తూ వుంటుంది. రిపబ్లిక్ శత్రువులపట్ల సానుభూతి చూపుతూ ఏడుస్తూ వుంటుంది!— నేనిప్పుడు సరాసరి దానిదగ్గిరికి వెడుతున్నాను.'

'ఆహా!—ఏమి మహిళారత్నమండీ!' అని అభినందించాడు జాక్వెస్; 'తెలివితేటలంటే అదిగో అలా వుండాలి? అని ప్రతీకారిణి ఆప్యాయంగా మాడెమ్ డిఫార్జ్‌ని కావిలించుకుంది.

అనువాదం: తెన్నేటి సూరి

ఈ మాటలు చెప్పేసి మాడమ్ డిఫార్జ్, కూసం విడిచిన త్రాచులా రివ్వున బయలుదేరి జైలుగోడ మలుపుదిరిగి వెళ్ళి పోయింది.


మాడమ్ డిఫార్జ్‌లో కనికరమనేది; అణుమాత్రం కూడా లేదు: తనకూ, తన కుటుంబానికి, తన వర్గానికి ఘోరమైన అన్యాయం జరిగిందనే అభిప్రాయం, పసితనంనుంచీ, ఆ స్త్రీ రక్తంతోపాటు పెంపొంది నాళనాళాలా సంక్షోభంగా ప్రవహించుతూ, ఆ స్త్రీని ఒక ఆడపులినిగా మార్చివేసింది. కనికరమనేదానికి ఆ ఆడపులి గుండెకాయలో యెక్కడా చోటు లేదు.

ఎవరో వాళ్ళ పెద్దవాళ్లు చేసిన ఘోరకృత్యాలకు ఈ అమాయకుల్ని నాశనం చెయ్యటం దేనికీ అనే అభిప్రాయం ఆ స్త్రీ తలకెక్కదు. వాళ్ళను పైవాళ్ళనుంచి విడదీసి ప్రత్యేకంగా చూడ లేదు—అదంతా ఒకేజాతి—ఒకేవర్గం హతమార్చి వెయ్యవలసిన విషవృక్షం. బొడ్లో ఒకవైపున పిస్టలూ, రెండవవైపున, బాకూ అమర్చుకొని, ఆ పులిగుండెల ఆడది వీథినబడి చకచకా నడిచి పోతోంది.

* * * *

ఇప్పుడు డాక్టర్ మానెట్ మకాములో మిగిలివుందల్లా క్రంచరూ, మిస్ ప్రాస్—వీళ్లిద్దరే. ఈ యిద్దరూకూడా బయలుదేరి పోవటానికి హడావిడిగా సామానూ జట్రా సర్దేసుకుంటున్నారు. తనతోపాటే మిస్ ప్రాస్‌నుకూడా తీసుకుపోవటానికి, లారి ప్రయత్నించాడు; కాని గుర్రపుబగ్గీలో చోటుచాలక సాధ్యంకాకపోయింది. అంతేకాక లారీ మరోటికూడా ఆలోచించాడు. ఎక్కువమంది బండిలోవుంటే పహారా పహారా దగ్గిరా వీళ్లందర్నీ పరిశీలించటం ఆలస్యమౌతుంది గనుక వీలైనంత తక్కువమంది వుండటం శ్రేయస్కరమనుకున్నాడు. అందుచేత ఆవిణ్ణి క్రంచర్‌కు అప్పజెప్పి వేరే బండి కుదిర్చి తీసుకువచ్చెయ్యమని యేర్పాటు చేసిపోయాడు. మిగతా చిన్నంచితకా సామాను సర్దేసుకుని తాముకూడా వేరే బండి కుదుర్చుకుని బయలుదేరి

ఆపీసులకు అదనపు ఆదాయాలకు ఒకసూచన



గడియారం తగిలించే గోడ ఎడ్వర్‌టైజ్ మెంట్లకు అద్దెకుయిస్తే లాభిస్తుంది.

★ రెండు మహానగరాలు ★

పోవటానికి క్రంచరూ, మిస్ క్రాస్ సన్నాహాలు చేసుకుంటున్నారు—ఉన్నట్టుండి మిస్ క్రాస్‌కు ఒక విచిత్రమైన అభిప్రాయం తట్టింది: 'ఒరే అబ్బీ!—యీ కంగారులో నా బుర్ర సరీగా పనిచెయ్యటం లేదుగాని, నువ్వు ఆలోచించు—ఈ వేళే, యీ ఆవరణలోనుంచి ఒక బండి బయలుదేరి వెళ్ళింది గనుక, మరో బండి యిప్పుడే యిక్కడినుంచి బయలుదేరటం మంచిది గాదనుకుంటాను—ఏమంటావ్?'—

'అంటానికే వుండదండీ!—మీరు యేదన్నా నేను కాదనేది లేదనుకోండి— మెదడు పనిజెయ్యటం మాటకొస్తే నాది అసలే పనిజెయ్యదు—వట్టి మట్టిమెదట్టోడి నని మా వోళ్ళంతా అంటారు—ఆ ఆలోచించేదేందో మీరే ఆలోచించి జెప్పండి—

'బండీ మాట్టాడి నాకోసం అక్కడెక్కడేనా రోడ్డుమీద వుంచితే బాగుండదూ? నేను వచ్చి యెక్కుతానూ?'—

'ఓ బాగుండకేం—మరీ బేసుగ్గా వుంటది.'

'ఎక్కడుంచుతావ్?'—

ఎక్కడుంచితే బాగుంటుందో తెలీక క్రంచర్ బుర్ర గోక్కుంటున్నాడు.

'ఇదిగో ఇటు చూడు! పెద్దదాన్ని గనక చర్చిగేటు ముందు బండియెక్కటం బాగుంటుంది. అక్కడ నిల్చోబెట్టు.'

'బాగానే వుంటది గాని మిమ్మల్ని ఒంటరిగా విడిచిపెట్టి యెల్లట మెట్టాగా అనే ఆలోచిస్తా వుండాను.'

'మరేం ఫరవాలేదు లేరా తండ్రీ!—నాకు మరేం ఫరవాలేదు. ముసలిదాన్ని, నా ప్రాణం సంగతి ఆలోచించబోకు ఆ పని కూనల సంగతి ఆలోచించు. మూడు గంటలకి బండి చర్చి గేటు ముందు వుండేట్టు చూడు; నేను వచ్చేస్తాను.'

ఈ మాటలు యెంతో ఆందోళనగా బ్రతిమిలాడుతూ చెప్పేసరికి, క్రంచర్ ఇక మాట్టాడలేకపోయాడు. ఆ ప్రకారం ఏర్పాట్లు చెయ్యటానికి బయలుదేరి వెళ్లాడు. అతన్ని బయటికి పంపించి మిస్ క్రాస్ గడియారం చూసుకుంది: ఇంకా మరో ఇరవై నిమిషాల టైముంది. సరే! ఇక ఎంతో టైము లేదు, అన్ని పనులూ చక్కబెట్టేసుకోవాలి. అన్నిటికంటే కష్టమైన పని, తన ఆందోళనను బయటివాళ్లు గుర్తించకుండా, తన్ను తాను చక్కదిద్దుకోవటం. ఒక దబరాతో యిన్ని చన్నీళ్ళు తెచ్చుకుని, ముక్కూ, మొహం కళ్లూ కడుక్కుంటోంది. ఇంతలోనే ఏదో అలికిడై తల పైకెత్తి చూసి నిర్ఘాంత పడిపోయింది.

చేతిలోవున్న నీళ్లదబరా నేలబడి భొళ్లుమంది; మాడమ్ డిఫార్జ్ పాదాలదాకా నీళ్లు జలజలా ప్రవహించినై.

మాడమ్ డిఫార్జ్ మిస్ ప్రాస్ వంక ఒక యినుపచూపు చూసి: 'ఎవ్రీమూండ్ భార్య ఎక్కడ?' అని గద్దింపుగా అడిగింది.

ఆ సమయానికి ఎక్కడి తలుపు లక్కడ బార్లగా తెరిచి వున్నయ్. పరారి అయినట్టు తెలుస్తుందేమోననే అభిప్రాయంతో, గబగబా పోయి ప్రాన్ తలుపులు నాలుగూ మూసేసి వచ్చి, లూసీ వుంటూవుండే గుమ్మానికి అడ్డంగా నిల్చుంది. మాడమ్ డిఫార్జ్ మిస్ ప్రాస్ వంక అదో పులిచూపు చూచింది. వయసు మళ్లితే మాత్రం ప్రాస్ మటుకు తక్కువతిన్న ఘటమ? అదే మొరాయింపుగా మాడమ్ డిఫార్జ్ వంక చూసింది.

మిస్ ప్రాస్ ప్రతిఘటించటానికి సన్నద్ధురాలు కావటం మాడమ్ డిఫార్జ్ వెంటనే అర్థం చేసుకుంది.

'నేను అలా గెలటైన్ దగ్గిరికి పోతూపోతూ ఆవిణ్ని పరామర్శించి పోదామని ఇట్లా వచ్చాను. ఆవిణ్ణు చూడాలి!' అంది.

'నీ బుద్ధి నాకు తెలుసు—వీల్లేదు'—

ఇద్దరూ ఎవరిభాషలో వాళ్లు మాట్లాడారు. ఒకరిమాట ఒకరికి అర్థం కాలేదు: మాటలు అర్థం కాకపోయినా ఒకరిభావం ఒకరికి అర్థమౌతూనే వుంది. ఇద్దరూ ద్వంద్వయుద్ధానికి తయారవుతూనే వున్నారు.

'నాకు కనిపించకుండా దాచినంతమాత్రంచేత ఆవిడకు కలిగేమేలేమీ లేదు. దీని అర్థ మేవిఁటో అందరికీ తెలుస్తూనే వుంది. ముందు లోపలికి పోయి, నేను చూడవచ్చానని ఆవిడతో చెప్పు—వినిపిస్తోందా? ఏయ్! నిన్నే'—

'ఏడిశావ్ లే—నా సంగతీ చూస్తాను'—

ఆ మాట లేవిఁటో మాడమ్ డిఫార్జ్ కి అర్థం కాలేదు; అర్థం చేసుకోవటానికి ప్రయత్నించనూ లేదు:

'ఏయ్! పందీ!—చెప్పేది నీక్కాదూ!—ఏవిఁటా వెధవ గొణుగుడూ?—లోపలికిపోయి చెబుతావా? మెడబట్టి గెంటి నన్నే లోపలికి పొమ్మన్నావా?' అంటూ ధీమాగా ముందుకు అడుగేసింది. అది చూసి మిస్ ప్రాస్ కూడా ముందుకు అడుగేసి మొహంలో సోదెయ్యటానికి సిద్ధమయింది.

మాడమ్ డిఫార్జ్ కి నవ్వొచ్చింది. 'అసి నైరిముండా!—పిచ్చిముండవా యేవిఁటి!—నీతో ఏవిఁటి డాక్టర్ నే పిలుస్తాను: 'ఏమండో డాక్టర్ గారూ!—ఏవమ్మా లూసీ!'—అని కేకలు బెట్టింది.

సమాధానం రాలేదు. మాడమ్ డిఫార్జ్ కి అనుమానమేసింది. గబగబా పోయి మిగతా మూడు తలుపులూ తెరిచి చూచింది. గదులన్నీ ఖాళీగా పాడుబెట్టి లేచిపోయినట్టున్నయ్. 'సరే! వీటిల్లో యెవ్వరూ లేరు. ఇప్పుడో యిందాకో మూటా ముల్లే గట్టుకు లేచిపోయినట్టున్నారు. ఏదీ ఆ గది కూడా చూణ్ణీ'—

'ఏడిశావులే'—

'ఆగదిలో కూడా లేకపోతే పారిపోయినట్టే—వెంటనే వెంబడించితే తిరిగి పట్టుకురావొచ్చు' అనుకుంది డిఫార్జ్.

'చటక్! తొలుగు!'—అంటూ మాడమ్ డిఫార్జ్ రౌద్రంగా ముందుకు ఉరికింది. మిస్ ప్రాస్ గభాల్న ఆ ఆడపులిని నడుం కావిలేసుకుని ఉల్లూకంలా పట్టుకుంది. ఇద్దరూ పెనగులాడుతున్నారు. మాడమ్ డిఫార్జ్ పిడికిళ్లు బిగించి మిస్ ప్రాస్ ను దబాదబా మొహంమీద బాదుతోంది. మిస్ ప్రాస్ ముఖంవంచి తల మాడమ్ డిఫార్జ్ పొత్తికడుపులోకి దోపి కుమ్మేస్తోంది.

మాడమ్ డిఫార్జ్ అలా అలా, బొడ్డుదగ్గిరికి చెయ్యి పోనిచ్చి యేదో బయటికి తియ్యటానికి ప్రయత్నించుతోంది. అది గమనించి మిస్ ప్రాస్ దానిమీద గభీమని ఒక గ్రుద్దు గుద్దింది. మాడమ్ డిఫార్జ్ పులిగుండె ఫెటేల్ మని పేలిపోయినట్టు మేడా మేడా ప్రతిధ్వనించిపోయింది; గది యావత్తూ పొగ కమ్మేసింది. మిస్ ప్రాస్ చేతుల్లోనుంచి మాడమ్ డిఫార్జ్ కళేబరం జారి క్రింద బడిపోయింది.

మిస్ ప్రాస్ కు కంగారెత్తిపోయింది. ఎవరి నేనా కేకేద్దా

వెనుక ఒకసారి బెనిఫిట్ నాటకం వేయించే భారం నామీద పడింది. డబ్బు రాబట్టుకోవటం కోసం చాలా పైలువున్న పెద్ద సినిమా తారను ఒకావిడను బ్రతిమలాడి వేషం వెయ్యటానికి ఆవిడ చేత ఒప్పించాను. ఆవిడగారికి వున్న వేయి పనుల సందడిలో మా నాటకం మాట ఎక్కడ మరచిపోతుందోనని, నేను పనిగట్టుకు ప్రతిరోజూ ఆవిడగారికి ఫోన్ చేసి, ఆవిడ మాకు యిచ్చిన వాగ్దానంవిషయం జ్ఞాపకం చేస్తూ వచ్చాను.

నాటకం ఆడవలసినరోజు వచ్చింది. సాయంకాలం నాలుగు గంటలకల్లా ఆవిడగారి యింటికి వెళ్లి ఆవిడ ముస్తాబు పూర్తి అయ్యేదాకా కనిపెట్టుకు కూర్చున్నాను. ఆ ముస్తాబు—అదేం ముస్తాబో కాని,—ఘంటన్నర పట్టింది. ఆవిడ గదిలోనుంచి వూడిపడింది. తీరా గదిలోనుంచీ ఆవిడ వచ్చేశాక, ఆవిడ వెనకాలే మళ్ళీ టెలిఫోన్ మోగింది. నాకు వళ్లు మండిపోయింది—ఈవిడగారు యిప్పుడు మళ్లా లోపలికి వెళ్లి ఎంతసేపు చేస్తుందోనని. అక్కడికీ ధైర్యం చేసి అడిగాను: "టెలిఫోన్ మోగుతున్నట్లుంది. మళ్లీ లోపలికి వెళ్లుతారా?" అని.

"ఎబ్బే అక్కరలేదు. ఆ ఫోన్ చేస్తున్నది మీారే అయివుంటారు. పదండి పోదాం" అంటూ విసురుగా వెళ్లి కారులో కూర్చుంది ఆవిడగారు.

రెండు మహానగరాలు

కుని గదిలోనుంచి బయటికి పరుగెత్తింది; తీరా మెట్లమీది కొచ్చేసరికి ఒక ఆలోచన తట్టి నిలబడిపోయింది. ఒక్క క్షణం ఆలోచించి: 'అవును బాగా జరిగింది' అని తల పంకించుకుంది. నిమ్మకు నీరెత్తినట్టు అతిప్రశాంతంగా మళ్ళీ తిరిగి గదిలో కొచ్చి తన టోపీ, తాళం, తాళంచెవి తీసుకు బయటికి వచ్చేసింది. గది తలుపులు దగ్గిరికి లాగి గొళ్ళెం పెట్టేసింది. తాళంవేసి తాళంచెవి చేత్తో బుచ్చుకుని మెట్లు దిగి వీథిలోకి వచ్చేసింది.

ఏమీ అలజడి లేకుండా, అతి ప్రశాంతంగా చర్చివేపు బయలుదేరిపోతోంది. త్రోవలో వంతెన దాటుతూ, ఆ తాళం చెవి వంతెనమీదనుంచి కాలవలోకి గిరాటు వేసేసింది.

ఆవిడ చర్చిదగ్గిరికి వచ్చేసరికి క్రంచర్ ఇంకా రాలేదు. చర్చిమెట్లమీద జరిగిన సంఘటననంతా ఆలోచిస్తూ, బిక్కు బిక్కు మంటూ నిల్చుంది.

ఒక రెండు నిమిషాల్లో క్రంచర్ బండి తీసుకొచ్చి ఆవిణ్ణి ఎక్కించాడు బండి బయలుదేరిపోతోంది.

'క్రంచర్! వీథిలో గల్లంతుగా వుందా?'

ఆ ప్రశ్నేమిటో క్రంచర్కు అర్థంకాలేదు—'గల్లంతుల కేముందదీ—మామూలు గల్లంతులే' అన్నాడు.

'నువ్వు చెబుతున్న దేమిటో నా కేమీ వినిపించటంలేదు—వీథిలో ఏమన్నా వినిపిస్తోందా.'

క్రంచర్ తెల్లపోయి చూశాడు—'వినిపించకపోవట మేమిటి—చెముడొచ్చిందా?—ఈ కాసేపట్లోనే యింత చెవు డేమిటి?—ఏమి జరిగిందబ్బా!'

'ఏదో పెద్దమంట మండింది—పెద్దమోత మోగింది—దాంతోసరి—ఇక నాకేమీ వినిపించటంలేదు' అన్నది.

'గిలొటైన్ దగ్గిరికి పోతున్న ఆ బళ్ళు చూశారా?—బళ్ళల్లో జనం ఘోష వినిపిస్తోందా?'

'చెప్పటంలేదూ ఓ పెద్దమోత—అంతే ఒకే శాశ్వత నిశ్శబ్దం—నిరామయం—ఇకేమీ వినిపించటంలేదు.'

'నిజంగా ఈ ఘోషే వినిపించటంలేదంటే—ఈ ఘూప్రపంచంలో ఇక ఎప్పుడూ ఏమీ యినిపించదన్నమాటే—అరి బల్లే!'- అనుకున్నాడు క్రంచర్. ★

సొంత కొంప

శ్రీ ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి

'ఎన్నాళ్లు చూసినా యీ అద్దె కొంపలలో వుండాల్సిందే తనమన అన్నారు. వీళ్ళకుపోసే అద్దెపెటితే యీ పాటికి వక కొంపంటూ యేర్పడేదే. ఎన్నాళ్లు బాధపడతాము' అంటూ సాధించగా సాధించగా వక పట్టాన వక కొంపంటూ యేర్పరచుకొందామనే అభిప్రాయం ఆనందరావుకు కలిగింది. అప్పటినుంచి వకటే ఆలోచన. ఇల్లుకట్టిచూడు, పెళ్లిచేసిచూడు అన్నారు కాదండి మరి! తన తారభార్యతార కుదిరేటట్లు చూడాలని ఆరునెలలు ఆలస్యమైనా ఆనందరావు అప్రయత్నంగా అంకయ్యగారి ఆసామికి ఆరువందలు అడ్వాన్సు యిచ్చి ఆశ్వయుజమాసంలో ఆరుసెంట్లు స్థలము కొన్నాడు. 'ఆనందరావు అత్తగారి తాలూకు అరయకరము అమ్మికొన్నాడు. ఏమన్నా సంపాదించుకున్నట్టా' అని అనుకునేవాళ్లు అనుకుంటూనే ఉన్నారు. ఎంతమంది నోళ్లను కట్టేస్తాం కనక! అర్థాంగి ఆభరణాలకు అవసరం రాలేదు కదా అని కొంతమంది సమాధానపరచుకున్నారు.

ఆ స్థలంమీద నడుస్తుంటే ఆనందరావు అర్థాంగికి నిజంగా తనయింట్లో నడుస్తున్నట్లు అనిపించింది. ఆనందరావుకు అదో విధమైన నమ్మకం. మన పెద్దవాళ్లు యే విధముగా కట్టారో, ఆ ప్లానులోనే కట్టాలని, వాళ్ళ గౌరవ ప్రతిపత్తులు మిగతా విషయాల్లో నిలబెట్టలేకపోయినా, కనీసం కొంపలోనైనా పూర్వీకులను అనుసరిస్తున్నానని ఆయన సంతృప్తి. అదో విధమైన ఆనందం. దాంట్లో తప్పేముంది. వాళ్ళ పెద్దలు కట్టినయిల్లు పన్నెండుంబాతిక ఈయన యెట్లా కటతాడు! ఆరోజులు అవి. అర్థరూపాయకు అడ్డెడు బియ్యము యిచ్చిన రోజులు. అయిదురూపాయలు పెడితే వస్తున్నాయిటండి యిప్పుడు. అందాక యెందుకు కలప అడుగు అర్థరూపాయి. ఇప్పుడు ఆరురూపాయలు. ఎక్కడికేసరో. ఆయన ఆరంభించిన తర్వాత ఆపుతాడు కనకనా! సరే కలప తెచ్చాడు. డాబావేద్దామనే వుద్దేశంకాదుమరి! కనీసందూలాలకు కడ్డీలకన్నా కలప వుండద్దూ! తర్వాత తలుపులు తంగేడివి పెట్టినా తంటాలేదు అనుకుని కలప తెప్పించాడు. అప్పాటే అన్నది ముసలమ్మ కలప తెప్పించావు కట్టెలు కొనక్కర్లేదని.

'రూపాయలు పోసి కలప కొన్నది పొయ్యిలోకేటే' అని వక్క అరుపు అరిచాడు ఆనందరావు.

శంఖుస్థాపన దగ్గరనుంచి పునాదులు లేచేటంతవరకు వున్న సంతోష సంరంభాలు, దూలాలెత్తేనాటికి లేకపోయె అననే అన్నాడు ఆనందరావు. ఇప్పుడు లేచింది నాయింటి పునాదులు కావు నా పునాదులు అని. దిగులుతో క్రుంగి కృశిస్తున్నాడు. ఇప్పటికే యింత అయితే యింకా ముందు యెంత అవుతుందో అని 'ఆవగింజలో అరభాగం' కాలేదు. ఆరాటపడతా వెందుకు ఆనందరావు. ఎత్తు ఎత్తావు. ఇప్పుడు అనుకుంటే యేం లాభం అని సర్దుబాటు చేశారు నలుగురుకలసి. మాటలవుతే మన వంతుకాని, డబ్బిచ్చేదెవరండి. ఆనందరావుకు తెలీదూ ఆసంగతి.

'నువ్వు పెట్టిన ప్రేరేపణ చేపితే వింటావా వకటేసణుగుడేను కొంపో కొంపో అని' అంటూ వకసారి భార్యమీద వక విసురువిసిరాడు, అది బంతీలాగ కొట్టుకుంది మళ్ళీ వచ్చి.

'ఆడవాళ్ళమాట వినే ఘటం కాదంటూ

అర టిక్కెట్టుకొన్న అర్భకుడు

ఏ రైలు ఎప్పుడు వస్తుందో, అసలు వస్తుందో రాదో తెలియని పరిస్థితి ఏర్పడిన ఒకానొక సందర్భంలో, 50 ఏళ్ల పెద్దమనిషి ఒకాయన ఒక రైలు పెట్టెలో ఎక్కి కూర్చొని వున్నాడు. టిక్కెట్ కలెక్టరు వచ్చి అందరి టిక్కెట్లు పరీక్ష చేసి, యీయన దగ్గరకూ వచ్చి టిక్కెటు చూపించమని అడిగాడు. ఈయన జేబులోనుంచి ఒక టిక్కెట్టు తీసి ఆ టిక్కెట్టును కలెక్టరు చేతిలో పెట్టాడు. ఆ టిక్కెట్టును చూసీ చూడగానే టిక్కెట్టుకలెక్టరు ఆదిరిపడి—

"ఇదేమిటి? అరటిక్కెట్టు యిస్తున్నారేం? ఇది పదకొండు ఏళ్ల లోపు పిల్లలకే కాని పెద్ద వాళ్లకు చెల్లదని తమకు తెలియదా?" అని అడిగాడు.

"తెలియకేమయ్యా! తెలుసు. టిక్కెట్టు కొనేటప్పుడు నాకు పదేళ్లేకాని, మీ రైలు వచ్చేటప్పటికి మాత్రం యింత 'లేటు' అయింది" అన్నాడు ఆ పెద్దమనిషి.

సొంత కొంప

వుంటారు ఇప్పుడు నేను దొరికా నేమిటి అన్నది.

'అసలు నువ్వు చెప్పావంటె నేను యిల్లుకట్టనే కట్టకపోయేవాడిని నాకు తోచింది చేస్తున్నాను అని సమర్థించుకొని గర్వపడ్డాడు. ఎవరి వల్లనయితే యేం కొంపంటూ యేర్పడుతోంది కదా అని సంతోషించింది ఆరణి.

'కొబ్బరికాయ ఆరణాలు సింహద్వారం యెత్తేటప్పుడు కొట్టాం కద! ఏమంటావు' అన్నాడు ఆనందరావు.

'రెండువందలు పెట్టి దూడకొని పలుపు కోసం లోభించాడట' అట్లావుంది. ఎన్ని వందలు పోశాం యింతవరకు యీ ఆరణాలు పట్టుకుంటూ యేమిటి అన్ని దర్వాజాలదగ్గర కొట్టాలిసిందే అని పట్టుపట్టింది. లోపల తనకు అనుమానమేగా! సరే అన్నాడు. కడ్డీలకు దూలాలకు సరిపోయింది తెచ్చిన కలపతూకంగా. ఇక కిటికీలు, తలుపులు, చవకరకం బజార్లో కొనాల్సిందే అనుకుంటున్నాడు ఆనందరావు. ఈ విషంలోకూడ ఆనందరావు భార్య కల్పించుకోవటంవల్ల, ఓ చిన్నరకం తుపాను బయలుదేరింది. అది షుమారు ఆరుగంటలదాకవుండి తర్వాత వాతావరణము చల్లబడింది. ఆపూట ఆనందరావు పస్తు. మర్నాడు ఆనందరావు భార్యపస్తు. ఇంట్లో ముసలమ్మ సద్దలేక ఆరెండురోజులు ఆవిడపస్తు.

కట్టినది కొంత్తయిన యినపపెట్టెలాగ వుంటె అదెంత బాగుంటుంది. లంకంత కొంపేను, అంతా అతుకులవుతే అదేం వుపయోగం 'అంటూ' వేడిచల్లారిన తర్వాత ఆనందరావుతో భార్య మెల్లిగా అన్నది.

'ఏంచేస్తాం, ఎంతచెట్టుకు అంతగాలి. అనుకున్న దానికి రెట్టింపవుతే మనంమాత్రం యేం చెయ్యగలము' అంటూ సమాధానం చెప్పాడు.

'పోన్లెండి ఏదో కొంపంటూ యేర్పడింది' అన్నది పెదిమిలమీదికి నవ్వురానిస్తూ ఆరణి.

'మొత్తంమీద సాధించావు. నీమూలానన్నా 'గృహప్రవేశం' అనివింటున్నాం. మనం యింకా పదేళ్లు చిన్న అవుతే బాగుండేది' అంటూ కొంత శృంగారరసంలోకి కూడ దిగాడు ఆనందరావు.

గృహప్రవేశం మాత్రం యేవొడుదుడుకులు లేకుండా హడావడిగానే జరిగిపోయింది. వూళ్లోజనం కూడా చాలా సంతృప్తిచెందారు. భోజనంతోటెండి! అమ్మయ్య యీనాటికి యిల్లంటూ యేర్పడిందని ముక్తకంఠంగా ముగ్గురు అన్నారు.

డాబా అన్న పేరేకాని,వంటిల్లు పెంకుటి వసారే ముందువసారా రెల్లా, తాటాకా అని తర్జనభర్జనపడి తాటాకు అని వకనిర్ణయానికి వచ్చారు. ఇంతకీ మధ్యభాగం మాత్రం డాబా. ఇక మీరే ఆలోచించండి. దీనిని పెంకుటిల్లు అనాలో చోపా అనాలో డాబా అనాలో! అసలే అర్థిణీ అందులో గర్భిణి అన్నట్లు అందులో సగంభాగం అద్దెకు. ఇంతకీ మిగిలేది మూడుగదులు అందులో మొదటిది తాటాకుదే.

కిటికీలు సేరేదు మారేదు అన్నట్లు, సేరెడివి పెట్టినా, తలుపులు పెట్టటానికి తాతలు దిగిరావాలసి వచ్చింది. ప్రస్తుతం తలుపులు లేక పోతే యేం? తర్వాత చూడచ్చు అని సిమెంటు బాపతు ఖాళీబస్తాలకు కరువులేదు కాబట్టి, తలో కటి, ఆసుపత్రిలో కర్టెన్ లాగ తగిలిం

పట్టణం పోకడలు!

ఆ పల్లెటూరి దంపతులు కొడుకుని పట్నం చదువుకు పంపించారు. ఆ కుర్రాడు అక్కడ వుండగా ఎలా వుంటాడో చూడాలని బుద్ధి పుట్టి వాళ్ల తండ్రి జాబు వ్రాశాడు; తాము వుభయులమూ ఫలాని రోజున ఫలాని బండికి పట్నానికి వస్తున్నామని.

కొడుకు వెంటనే సమాధానం వ్రాశాడు. తల్లి తండ్రులు తనను యింత కాలం తరువాత చూడ వస్తున్నందుకు తన కెంతో సంతోషమైందని వ్రాస్తూ, తానా సమయంలో బ్లూ పాంటు, బుష్‌కోటు తొడుక్కొని, క్రాపు పైకి దువ్వి, నల్ల అద్దాల కళ్లజోడు పెట్టుకొని వుంటానని వ్రాశాడు. ఇవన్నీ వ్రాయకపోతే తన తల్లి దండ్రులు తనను గుర్తించటానికి కష్టపడవలసివస్తుందనీ, అలాటిది తనకు యిష్టం వుండదనీ వివరిస్తూ, తానీ మధ్య యింగ్లీషే కాని యితర భాషలు మాట్లాడటం లేదు కాబట్టి యీ విషయాన్ని కూడా ముందుగా తల్లి తండ్రులకు హెచ్చరిక చేస్తే వారందుకు తరిఫీదు పొందినమీదటే పట్టణానికి రాగలరని ఆశిస్తున్నాననీ వెళ్లబుచ్చాడు.

చాడు. శతకోటి దరిద్రులకు అనంతకోటి వుపాయాలు! ఇక వంటిల్లు పెంకుటిది కాబట్టి యెలుకలకు స్థావరం అయింది. దానికి యెవరేం చేస్తారు! తలుపులన్నీ మొదటే చెప్పాగా అన్నంతపని చేశాడు. తంగేడివి పెట్టి వూరుకున్నాడు. కొన్ని నేరేడివి కూడా వున్నాయి లెండి. తలుపులకు తలుపులకు తలకాయ దూరేటంత సందువుందంటె నమ్మండి. ఎందుకొచ్చిన మాట, కాలం మనకోసం ఆగదు కాదండి. ఎండా కాలం వర్షా కాలం. తలుపులు అంతేగా!

'చస్తున్నామండీ యీ యెలికలతో పగలే తిరుగుతున్నాయి. ఆ అద్దె కొంపలో వున్నన్నాళ్లు యెలిక యెట్లా వుంటుందో చూసి యెరగను, ఇదేం కర్మమో అన్నది భార్య.

'ఇంకా బద్దెదట్టంగా వేస్తే యెలుకలు రావే అని మొత్తుకుంటూ నేవున్నా, యీ పనివాళ్లు డబ్బెత్తి కళ్ళెవాళ్ళెగాని పని చేస్తారటే; దగ్గరుండి చేయించుకోవాలి గాని, నేను నెత్తినోరు పెట్టుకొని మొత్తుకుంటుంటే నామాట లక్ష్యపెట్టేదెవరు' అని ముసలమ్మ సాధింపు.

'నమ్మకంగా చేస్తారనుకున్నాగాని యిట్లా చేస్తారనుకోలేదు' అని ఆనందరావు వీపు చరిచినట్లు మాట్లాడాడు.

బావి దగ్గర మాత్రం గచ్చు చేయించాలండి మిగతాది యెట్లావున్నా. ప్రొద్దున్నే లేస్తే మా ఆడవాళ్ళు బావిదగ్గరపడి వుండాలేను. మీకు పుణ్యం వుంటుంది. ఇదిచాలఅవసరము, ఆ యింట్లో వున్నన్నాళ్లు, ఆ పళ్లెంలో నేతో మేదాన్ని అనటం భార్య ఆరణి.

'రెండు నోట్లు పెట్టుకుంటే కాని అయ్యే పని కాదు' ఇంటికి బిడ్డకు చెయ్యటం మొదలు పెడితే అంతుంటుందా అన్నాడు సమాధానంగా ఆనందరావు.

'ఆ మాటా నిజమేలెండి అయినా అవసరమైన పనులన్నా చేయిస్తే, తర్వాత యింటికి సున్నం కొట్టించటం అంటె, కిటికీలకు తలుపులంటె, ముంగుడాబా లాగటం అంటె, నిదానంగా చూసుకోవచ్చు. అల మారకు తలుపులు లేకపోతే యెట్లాగండి. ఏదిపెట్టినా నిలవనీయట్లేదు' అంటూ ఏకరువు పెట్టింది ఆరణి.

'నాయనా చుట్టూ ప్రహారీగోడ అంటూ కట్టించావా వచ్చేది వర్షాకాలమా నాలుగు పాదులు పెట్టుకుంటే నాలుగు కూరలు వస్తాయి యీ కరువు రోజుల్లో. లోపల యెట్లావున్నా మరుగంటూ వుంటే అదో అందం. ఇట్టే గొడ్లొకివస్తే బజారంతా కనిపిస్తుంది అదివరకు మనమున్న యిల్లు చిన్నదైనా చుట్టూ ప్రహారీగోడ. పెట్టెలాగ వుంది. ఏమంటావు' అటూ ముసలమ్మ చిన్న వుపన్యాసం దంచేసింది.

'సరే బాగానే వుందమ్మా. నేను అదే అనుకుంటున్నాను, ఆ గదిలో వానకురిసే చోటు కాస్త సిమెంటు చేయించాలని...'

'చెప్పావు నాయనా! నేను అదే చెప్ప బోతున్నాను. కనీసం వంటిల్లైనా గచ్చు చేయించు, చచ్చిపోతున్నాం' అన్నది, చేతిలో కర్ర పైకి తీస్తూ ముసలమ్మ.

'అవును మామయ్యా, అదివరకు వున్న యింటికి అద్దెయెక్కువ పెట్టినా, చుట్టూ ప్రహారీగోడ, గచ్చు, నూతిదగ్గర పళ్లెం, దొడ్లోపంపూ అన్ని సౌకర్యాలు వున్నాయి; ఏమంటావు?' అన్నాడు వెంకట్రావు.

'అయితే సొంతకొంపకంటె అద్దెకొంపే బాగుందంటావా' అన్నాడు ఆనందరావు ఆశ్చర్యంగా. ★



విజ్ఞానవీధులు

"డాక్టర్"



78. తిథివార నక్షత్రాల పరిగణన ఎప్పుడు ఎలాగ ఏర్పడింది?

అని రొంపిచర్లనుంచి పి. లక్ష్మణ్ గారూ, షాకర్‌నగర్ నుంచి సి. రామమూర్తిగారూ అడుగుతున్నారు.

పౌర్ణమి మరునాటినుంచి అమావాస్య వరకూ గాని, అమావాస్య మరునాటినుంచి పౌర్ణమివరకూ గాని రోజులు (తిథులు) వరుసగా పదిహేను. వీటి పేర్లను పంచమి, షష్ఠి, సప్తమి ఇత్యాది–బట్టి తిథిగణన కేవలము సంఖ్యాగణనయేనని తేలుచున్నది. శుక్లపక్షమూ, కృష్ణపక్షమూ అన్నవే తిథుల విభాగానికి మూలము. చంద్రుడు ఖగోళాలన్నిటిలోనూ మొదట గుర్తించబడిన గోళమని అనుమానించవచ్చును. ఈ చంద్రుని కళలను బట్టి తిథులేర్పడ్డాయి. తిథులనాదికాలమునుంచీ వున్నాయి. బ్రాహ్మణాలలో కూడా తిథుల ప్రశంస వున్నది.

తిథుల తర్వాత నక్షత్ర పరిగణన వచ్చింది. ఏ రోజున చంద్రుడు ఏ నక్షత్రము చేరువలో వుంటాడో అదే నేటి నక్షత్రము. కనక నక్షత్రాల్ని గుర్తుపెట్టుకుంటే ఏరోజు ఏ నక్షత్రమో తెలుసుకోవచ్చును చంద్రుడి ఉనికినిబట్టి. నక్షత్ర పరిగణనకూడా అనాదిదే.

ఏతావాతా వారముల పరిగణనయే ఆలస్యముగా వచ్చినది. ఇది భారతదేశానిది కాదు. భగవంతుడు ఆరురోజులు సృష్టిని సాగించి ఏడోరోజున విశ్రాంతి తీసుకున్నాడన్న మతగ్రంథ సాంప్రదాయాన్ని అనుసరించి ఏడురోజులలో ఒక రోజుని విశ్రాంతి దినముగా అనగా 'సేబత్'గా పరిగణించడము ముఖ్య భా

సముద్ర ఉత్తరతీర దేశాలలో చాలాకాలం నుంచీ వాడుకలో నుండినది. దీనినిబట్టి నెలకు ఒకొక్క వారము ఏడురోజుల చొప్పున – నాలుగు వారాలు అవుతున్నాయి...తరువాత తరువాత చంద్రుడూ, బుధుడూ, శుక్రుడూ, సూర్యుడూ, అంగారకుడూ, గురుడూ, శనీ, అనే సప్త "గ్రహాల"ను బట్టి ఈ ఏడురోజులకునూ ఏడుగ్రహాలపేర్లు పెట్టి వుంటారు. క్రీ. పూ. 26 వ సంవత్సరములో ఆసియా మైనరులో టైబల్లాస్ అనే కవి వ్రాసిన లాటిన్ కవిత్వములోని "శనికి పవిత్రమైనరోజున" అన్న పలుకులలో మొదట కనపడుతోంది వారము పేరు. క్రీ. శ. 50 లో మార్కస్ అరీలియస్‌కి మార్టన్ అనే క్రైస్తవుడు "మేము భానువారమునాడు ఒకమారు కలుసుకుని ప్రార్థన చేసుకోడమే నేరమా?" అని వ్రాసిన ఉత్తరములో తరవాత కనబడుతుంది వారము పేరు. అంటే క్రీస్తు తరువాత మొదటిశతాబ్దములో వారాల పేర్లు నిర్ణయమై పోయాయని ఊహించవచ్చును.


భారతదేశములో గుప్తశకము 319 లో (అనగా క్రీస్తుశకము 484 లో), గ్వాలియరు రాజ్యములోని ఇరాను గ్రామంలో నిలిపిన స్తంభముమీద కనబడుతుంది మొట్టమొదటి వారము పేరు. ఇది ఉత్తరహిందూస్థానములో. ఇక దక్షిణమున నరసరావుపేట తాలూకాలోని కొప్పరం గ్రామములో క్రీ. శ. 631 ప్రాంతమున రెండవ పులకేసి కాలములో చెక్కించిన శాసనంలో వారము పేరు మొదట కనపడుతుంది.

అంటే వారాలపేర్లు భారతీయములు కావు, రోమక సంప్రదాయమునుంచి మనవారు తెచ్చుకున్న వన్నమాట.

79. వంతెనల ఇనుప దూలాలు అల్లిన ట్లుంటాయేం?

రైలువంతెనలూ రోడ్డువంతెనలూ పల్లెటూళ్ళ కాటివంతెనల్లాగ ఇనపదూలాలు వవేసి వాటిమీద మామూలు రోడ్లో, రైలు రోడ్లో వేసి ఎందుకు తయారుచెయ్యరూ? ఆవంతెనల ఇనపదూలాలు గాని సిమెంటు దూలాలు గాని అస్థిపంజరాలలాగ అల్లినట్లుంటాయేం? అని ప్రశ్న.

ఈ అల్లికలన్నీ వంతెనయొక్క గట్టితనాన్ని ఎక్కువ చెయ్యడానికే. ఒక్క ఉదాహరణము గమనిస్తే ఈ నిజము తెలుస్తుంది.



పటములో 'మయ' అనే సిమెంటు దూలము కాక 'మరయ' అనే వంపు సిమెంటుదూలముకూడా వంతెన స్తంభాల మీద ఆనుకున్నది. ఈ రెండు దూలాల బరువూ వంతెన స్తంభాలే భరిస్తున్నాయి. ఇప్పుడు 'బ' అనే చోటికి ఒక బరువైన బండీ వచ్చిందనుకోండి. దాని బరువుకి 'మబయ' దూలము కిందికి వంగబోతుంది. అప్పుడు 'మబయ' 'మరయ' దూలాల్ని కలిపే నిలువు కమ్ములు 'మరయ'ని దిగలాగడానికి యత్నిస్తాయి. అంటే 'బ' అనే బండీ బరువుని 'మబయ', 'మరయ' దూలాలు రెండూ చేరి భరిస్తున్నాయి. ఇందువల్ల వంతెనగట్టితనము ఎక్కువ కాలేదూ?

ఇంతే కాదు. 'మరయ', నిలువు కమ్ములూ, లేనే లేవనుకోండి. అప్పుడు 'బ'యొక్క బరువువల్ల 'మబయ' దూలము

అడుక్కి వంగుతుంది. ఇందువల్ల ఈ దూలము అడుగు భాగానికి సాగదీత, పై భాగానికి నొక్కుడువల్ల వత్తిడీ అవతరిస్తాయి. సిమెంటు యెంత నొక్కుడునైనా భరించగలదు కాని సాగదీతకి తట్టుకోలేదు. బీట వేసేస్తుంది. అందుచేత 'మరయ' దూలాన్నీ, నిలువు కమ్మీల్నీ అమర్చడము వల్ల 'మరయ'కి అదనముగా కాపు దొరుకుతున్నది.

చిట్టి ప్రశ్నలు

—'గెలెక్టిక సిస్టమ్' అనగా మనకు రాత్రిపూట సుమారు ఉత్తర దక్షిణాలుగా వ్యాపించినట్లు ఆకాశంలో కనబడే 'పాలపుంత.' ఇది వాచీ ఆకారములో అనంతాకాశములో వ్యాపించివున్న అనేక నక్షత్రాల సమూహము. సూర్యుడు ఇందులో ఉన్న ఒక నక్షత్రము.

—'ఆహారమును తినుటను బట్టి గుణములు మారున'ని కాక 'ఆహారమును కోరుటను బట్టి గుణములు మారున'ని నే నంటాను. పశు మాంసమునూ పంది మాంసమునూ కోరే మనస్సుకి పరుల శారీరక బాధయెడ జాలి వుండదు. మాంసాహారములో ఉన్నదని పూర్వులు చెప్పిన తమోగుణము, మాంసాహారులలో వుంటుం దనడము ఎక్కువ నిజమంటాను. అయితే అలవాట్లు మాత్రమే గుణములను దిద్దవు. మనస్సు తీరుస్తుంది. శక్తివంతమైన మనస్సూ నిశితమైన ఆలోచనా గలవారి గుణాలు ఆహారాన్ని బట్టి ఉండవు. అందువల్ల నే మాంసాహారులలో శాంతులూ శాఖాహారులలో క్రూరులూ వుంటారు.

—'అనగననగ రాగమతిశయిల్లుచునుండు' నన్నాడు వేమన్న. బాగా అలవాటు చెయ్యండి వణుకు తగ్గుతుంది.

—కాగితాన్ని సూక్ష్మదర్శినితో చూచినచో తెల్లని గడ్డి అల్లినట్టు కనబడుతుంది. వెలుతురు ఈ పీచునుంచి పరావర్త (*Reflected*)మై మనకంటికి చేరుతుంది. నూనె పూసిన కాగితములో 'పీచు' కొంత అణిగి పోతుంది. నూనెకాగితానికి పొడి కాగితాని కున్నంత పరావర్తన శక్తిలేదు, కాని నూనెకుగల పారదర్శకశక్తి కొంత అలవడుతుంది. ఎందుచేతనంటే ఆకాగితములోని రంధ్రములలో నూనె చేరుకొని బిగిసి ఉండిన 'పీచు'ను మెత్తబరిచి, చేర్చిపెట్టుతుంది. అందుచేత కాళీలు ఏర్పడి నూనె ఆ కాళీలను ఆక్రమిస్తుంది. ఇందువల్ల కాగితానికి పారదర్శకత్వము వస్తుంది. నూనె తగ్గిపోయిన కొద్దీ పీచు బిగిసి మళ్లీ అపారదర్శకము అవుతుంది.

—అంగారక గ్రహము మీద సంకల్ప

మగువ దౌర్బల్యం: ముదుసలి ఆరాటం

ఆయన గారు ఒక పెద్ద ఆఫీసరు. ఆయన యీ మధ్యనే ఓ పడుచు పిల్లను చూసి ముచ్చటగా మూడో పెళ్లి చేసుకొన్నాడు. ఆవిడ అంటే యీయనకు వల్లమాలిన ప్రేమ! ఇంట్లో కూడా టెలిఫోను పెట్టించి, ఆఫీసులో పని తీరికైనప్పుడల్లా ఒకసారి యింటికి ఫోన్ చేసి, ఆవిడతో ఏదో మాట్లాడుతూనే వుండేవాడు.

ఆవేళ కూడా మామూలుగానే ఆయన పడుచు పెళ్లాంతో ఆఫీసునుంచి టెలిఫోన్ మీద మాట్లాడుతూ వున్నాడు. కొన్నేపు సంభాషణ సజావుగానే సాగిపోయింది కానీ హఠాత్తుగా అవతలి ఆడకంఠం "అమ్మయ్యో!" అనటం ఆ టెలిఫోన్‌లోనుంచి వినిపించింది. మరి ఆ తరువాత యీయన ఎంత కంగారుపడి పిలిచినా ఆవిడగారి కంఠం వినిపించనే లేదు. ఏదో కొంప మునిగిపోయివుంటుందనుకొన్నాడు. ఎవడో బందిపోటుదొంగ తనయింట్లో ప్రవేశించి వెనక చాటుగా వచ్చి తన పెళ్లాన్ని హాడిచేసి వుంటాడని నిశ్చయం చేసేసుకొన్నాడు.

వెంటనే పోలీసు స్టేషన్‌కు టెలిఫోన్ చేసి, ఆమాటే చెప్పేశాడు. పదిహేను మంది పోలీసులు సాయుధులై ఆ యింటిలో ప్రవేశించి చూసేసరికి, టెలిఫోన్ రిసీవర్ చెవి దగ్గర పెట్టుకొనే మూర్ఛపోయినట్లు పడివున్న ఆ పడుచు కనిపించింది. పోలీసులు గబగబా నీళ్లు అవీ చల్లి ఆవిడను సేద తీర్చారు. ఆవిడ నెమ్మదిగా తెప్పరిల్లి- "చూడండి! వెతకండి. ఇంకా యీ యింట్లోనే ఆ తలుపుచాటునో ఆ తెరల వెనకాలో, ఆ బీరువా సందునో, ఎక్కడో వుండే..."

"ఆ! అల్లాగా: అయితే మీరు వాణ్ణి చూశారన్న మాట! ఎలా వున్నాడు?" అని పోలీసులు ఆదుర్దాగా అడిగారు.

"వాడెవరూ?... వాడెవరో కానీ నాకు కనిపించినప్పుడు మాత్రం ఎలుక ఆకారంలో కనిపించాడే" అన్నది ఆ భీత హరిణేక్షణ!




హంపిలోని సప్తస్వర మండపం వద్ద శిధిలాలు.

రములో ఒక కాలములో చారలవలె కనబడుతూ ఇంకొక కాలములో ఆ చారలు మాయమౌతోన్నట్లు కనబడుతూంటుంది. బుద్ధిమంతులు కొందరు వీటిని నీటికాలువలనుకుని, అంగారక గ్రహవాసులు వారి సముద్రాల్ని ఒక ఋతువులో నేలమీదకు పారించుకుని వ్యవసాయాలు నడుపుతున్నారని ఊహలల్లినారు. కాని ఇటీవల ఈ ఊహ నిజము కాకపోవచ్చుననుకుంటున్నారు. అంగారకుడు భూమికంటె మరి కొంచెము దూరములో వుండి సూర్యునిచుట్టూ తిరుగుతున్నాడు. కనుక అంగారకగ్రహంమీది ఉష్ణోగ్రత మన ఉష్ణోగ్రతకి చేరువగానే వుంటుందనీ అందువల్ల భూమిమీది ప్రాణులలాంటివే అక్కడా ఉండవచ్చునన్నారు. భూమిమీదకంటె అంగారక గ్రహములో జలమయభాగము విశాలమని అనుమానించి, ఆ అవసరాన్ని బట్టి అంగారకీయులు మనకంటె తెలివిగలవారని తీర్మానించారు. ఈ ఊహాకుల్యాలు అంతకంటె సాగలేదు.

—పౌర్ణమినాడు సూర్యచంద్రులు భూమికి యిటూ అటూ వుండటం మీరు గమనించే వుంటారు. భూమిచుట్టూ వ్యాపించియున్న సముద్ర జలములను సూర్యచంద్రులు ఆకర్షించుటవల్ల సముద్రపునీరు సూర్యచంద్రులవైపు కదిలి "కుప్పపడినట్లు"వుతుంది. ఇదే పోటు అంటే. ఒకచోట కుప్పపడుటకని యింకొకచోట సముద్రపు నీరు తరగవలెను గదా! ఆ ప్రదేశములో నున్నవారికి సముద్రములో పాటు కనిపిస్తుంది.

—"వేడినీరు ఎంత త్రాగిననూ దాహము తీరదు" అన్నమాట నిజముకాదు. ఇంగ్లండులో చదువుకునే మనదేశపు విద్యార్థులు చన్నీరు పుక్కిలి పట్టలేక వేడినీటినే త్రాగుదురు. చల్లని నీరు త్రాగినగాని దాహము తీరినట్లుండకపోవడం కేవలం అలవాటు వల్లనే.

—మన కళ్లు రెండింటివలననూ అసలు రెండు వేరువేరు ప్రతిబింబములు ఏర్పడును. ఈ రెండింటినీ కంటిపాప వెనుక నుండే చిన్న కటకములు తమ సర్దుబాటు వల్ల ఒకే బింబముగా కంటి వెనుకనున్న "తెర"మీద పడునట్లు చేయును. చేతితో ఒక కన్ను మూసి రెండవ కంటితో ఏదైనా చిన్న వస్తువును చూడండి. ఇలాగ రెండు మూడు సెకన్లు మూసి రెండవ కంటిని (చెయ్యి తీసేసి) తెరవండి. ఇప్పుడు ఆ వస్తువు బింబమే ఇంకొకటి, యింతవరకూ చూస్తూన్న మొదటి బింబమునకు వేరుగా కనపడి మీ కళ్ళ సర్దుబాటులో మొదటి



సప్తస్వర మ

—ఫోటోలు :

బింబమును చేరుటను గుర్తించండి. ఒక కంటిరెప్పను వేలితో నొక్కినపుడు ఆ కన్ను చూచే ప్రతిబింబం మనం రెండు కళ్ళతోనూ చూచే సంయుక్త ప్రతిబింబము నుంచి వేరవుతుంది. నొక్కిన వేలు కంటిని క్రమంగా మూసివేసినట్లయితే ఈ కన్ను చూచిన ప్రతిబింబం మరి కనబడదు. ఒక కంటిని మూసి రెండవ కన్ను రెప్పని నొక్కి చూడండి. ఇప్పుడు వస్తువులు కదిలినట్లు కనబడును గాని రెండు బింబములు కనేబడవు.


—రేడియో స్టేషనునుంచి మన ఇంట్లోని ఏరియల్ వరకూ ప్రసరించే తరంగాల వంటివే మెరుపువల్ల పుట్టి అన్నివైపులా వ్యాపించి మన రేడియో సెట్టుకకూడా అందుతాయి. మద్రాసూ బెజవాడా మొదలైన కేంద్రాలలో గాయకులు పాడిన సంగీతమునే విద్యుత్తరంగములుగా మార్చి ప్రసారిస్తారు. కనక మన సెట్లు ఆ ప్రసారాల్ని అందుకుని తిరిగి సంగీతముగా మార్చి మనకి వినిపిస్తాయి. మెరుపు సంగీతము కాదుగా! దానిని శబ్దములోకి మార్చినపుడు బరబరమని వొట్టి చప్పుడే వినబడుతుంది. దీనిని మాన్పడానికి సాధనము ఎవరూ వెదక లేదు.

—వేడి అన్నది ప్రతీవస్తువులోనూ ప్రతీ కాంతిలోనూ కూడా వుంటుంది. మానవుండకంటె ఎక్కువ వేడిగా నున్న దానిని వేడి అనీ తక్కువవేడిగా నున్న దాన్ని చలి అనీ పేరుపెట్టుకుంటాము. గాలిని చల్లపరచినపుడు దాని పరిమాణము తగ్గి అది వ్యాకోచించునని మీకు తెలిసే వుంటుంది. గాలిని సంపూర్ణముగా వ్యాకోచింపజేయగల ఉష్ణత నే నిరుష్ణతఅంటారు. ఈ నిరుష్ణతస్థితితో పోల్చినపుడు వెన్నెలకూడా వేడివున్నట్లు తెలుస్తుంది. వెన్నెలలోని వేడినికొలవగల థర్మామీటర్లు అంటే ఉష్ణతామాపకములు ఉన్నవి.

—తలను వుత్తర దిక్కువైపు పెట్టి పరుండరాదనే నిషేధము మనదేశములోనే వుంది. ఇతర దేశములన్నింటిలోనూ లేదు. తలను వుత్తరదిక్కుగా పెట్టి పరున్నపుడు భూమిమీద దక్షిణధృవము నుంచి ఉత్తర ధృవమువరకునూ వ్యాపించే అయస్కాంత రేఖలు మన శరీరములో కాళ్ళవైపు ప్రవేశించి తలవైపు నిష్క్రమించునని, దీనివలన ఏదో నష్టముండవచ్చుననీ కొందరభిప్రాయపడతారు. కాని అమేయమైన శక్తిగల విద్యుత్ అయస్కాంతము చెంత కుపోయినప్పుడుగాని చేరువగా చేయి పట్టినప్పుడుగాని మన శరీరమునకు ఏవిధమైన బాధా నష్టమూ కలగవు. మరి అలాంటప్పుడు బలహీనమైన భూమిరేఖలవల్ల నష్టముస్తుందని ఎలా అనగలం?

—రాత్రి వేళలందు చెట్లు గాలిలోని ప్రాణవాయువును (జంతువులలాగే) ఉపయోగించుకుని బొగ్గుపులుసు గాలిని విడిచి పెట్టును. పగటి వేళ (సూర్యరశ్మిలో) బొగ్గుపులుసు గాలిని పీల్చుకుని ప్రాణవాయువును విడుచును. అందువల్ల పగటి వేళ చెట్టుక్రింద ఉంటే లాభము కాని రాత్రి వేళల నష్టమే.

—ప్రాణులకు చావు సహజము. మందువల్ల ప్రాణులను సదా రక్షించడము ఇప్పటికి సాధ్యము కాలేదు. కాని వైద్యశాస్త్రము యొక్క ఉద్దేశ్యము అదే. ఆయుస్సు అన్నది మరణించిన ప్రాణుల జీవిత పరిమితికి పేరు. జీవించియున్న వారికి ఆయుస్సు 'ఇంత' అని ఎలాగా చెప్పడమూ? అది వారి మరణానంతరము తేలవలసినదే. కనక "ఆయుస్సు ఉంటే బ్రతికినా"నన్న మాటకు అర్థము లేదు. బ్రతికినాడు గనక నే ఆయుస్సు ఉన్నదని తెలుస్తుంది. ★



తుంగభద్రా నదీ దృశ్యం—హంపి



కపం—హంపి.

టి. సత్యనారాయణమూర్తి గారు (పిప్పర)

బొమ్మరిల్లు

★ నేర్చుకో ★

శ్రీ చొల్లేటి నృసింహశర్మకవి

నేర్చుకో నీతులూ నేర్చుకో తండ్రి
నేరిస్తే దేశాన్ని తీర్చి దిద్దేదవు—
    ముండ్లగడిలో నవ్వు ముద్దు పువ్వుల్లు,
    పండ్ల చెట్లను పెరుగు ముండ్లడొంకల్లు,
    ఆకుల్లు దిని కూయు కోకిలమ్మల్లు,
    చీకట్లు దిగమ్రింగు చిన్ని దివ్వెల్లు,

నీకు నేర్పును నీతి నేర్చుకో తండ్రి.
నేరిస్తే దేశాన్ని తీర్చి దిద్దేదవు—
    చలువ జల్లులు జల్లు నలుపు మేఘాలు,
    ఏడు రంగుల నీను ఇంద్ర చాపాలు,
    ముత్యాలు వెదజల్లు మునుకు బిందువులు,
    ప్రత్యూషస్సున లేపు పక్షిరాజములు,

పాఠాలు చెప్పగా పఠియించు తండ్రి,
వాల్లించి దేశంపు వన్నె దిద్దుమురా.
    గడ్డి పూచీరలను గట్టు చిల్కల్లు
    రామలకు ప్రియమైన రామచిల్కల్లు
    నల్లమబ్బులు రాగ ఆడు నెమిళ్లు
    పాలు నీర్వేర్పఱచు పరమ హంసల్లు

నేర్పు నీతుల నీవు నేర్వుమో బాల
నేరిస్తే దేశాన్ని తీర్చి దిద్దేదవు!—

సెరియల్

విచిత్రవ్యక్తి



మూలం:- మార్క్ ట్వేన్

జరిగినకథ:—ఆస్ట్రియాలోని ఈ జెల్ డార్ఫ్ మా స్వగ్రామం. నా యీడువాళ్లైయిన సెప్పి, నికోలాస్ అనే మరి ఇద్దరు బాలురతో కలిసి ఎప్పుడూ అడవుల్లో, కొండల్లో తిరిగేవాణ్ణి. ఒక రోజున మేము ఒక కొండమీదిమా ఆం స్థలంలో కూర్చుని ఉండగా ఒక కొత్తవ్యక్తివచ్చాడు. తన పేరు సైతాను అనీ, తను దేవతననీ చెప్పాడు. మాకు చాలా వింతలు చేసి చూపించాడు. అతడు మాతో ఉన్నంతసేపూ మానవజాతిని నానాబూతులు తిట్టాడు. మానవులు తా మేదో గొప్పవారమని అనుకుంటారుగాని నిజానికి వారిలో ఉన్న నైచ్యం ఇంకెక్కడా ఉండదని అన్నాడు. చివరికి మాయమైపోయాడు. మా వూళ్లో ఫాదర్ పీటర్ అని ఒక మతగురువు ఉన్నాడు. ఆయన ఏ నేరమూ చెయ్యకపోయినా, పదవినుండి తొలగించబడ్డాడు. ఆయనకి సహాయంచేద్దామనో, ఏమో సైతాను పదకొండువందల బంగారునాణాలు ఆయనకిదొరికేట్టుచేశాడు. ఫాదర్ పీటర్‌కు విరోధియైన ఒక జ్యోతిష్కుడు ఆ డబ్బు తన దగ్గరనుండి దొంగిలించబడిందని ఆరోపణచేశాడు. వెంటనే ఫాదర్ పీటర్‌ను జైల్లో పడేశారు. ఆయన కుటుంబానికి సైతాను మళ్లీ సహాయంచేశాడు. ఆ సహాయం ఎవరు చేస్తున్నారో తెలియక గ్రామస్థులు తికమకలు పడి ఫాదర్ పీటర్ కుటుంబానికి సైతానుతో సంబంధమున్నదని అనుమానించారు. ఆ సంగతి పరీక్షచెయ్యటానికి నిశ్చయించారు. కాని సైతాను మాయచేసి వారిని కికురించాడు తప్ప రహస్యం బయటపడనివ్వ లేదు.

అతిథులంతా ఎవరిదోవన వారు పారిపోవటం, తనఇల్లు పిశాచావిష్టమైనదని ఫాదర్ అడాల్ఫ ఆరోపించటం—ఇదంతా తలుచుకుని మార్గెట్ కంటికి మంటికి ఏకధారగా ఏడవసాగింది. విూడ్లింగ్ చేష్టలు దక్కి శిలా ప్రతిమవలె కూర్చున్నాడు. ఉర్సులాస్థితి కూడా అలాగే వుంది. గాట్ ఫ్రీడ్ నార్ సంగతి చెప్పనే అక్కర్లేదు. మంత్రగత్తెల కుటుంబానికి చెందిన మనిషి. గనక ఇదంతా తనపనేనని ఎవరెప్పుడు ఆరోపిస్తారోనని గజగజ వణికి పోతున్నాడు. ఆగ్నెస్ పిల్లి అమాయికంగా అక్కడికి వచ్చింది. ఉర్సులాను ప్రేమగా నాకింది. కాని ఉర్సులా భయపడి వెనక్కి తగ్గింది. ఆపిల్లి దెయ్యాల పిల్లేమోనని ఆమెకు లోపల అనుమానం. కాని అటువంటి పిల్లితో జగడం పెట్టుకొనే ధైర్యంలేక ఊరుకుంది. మా ముగ్గురు మిత్రులికీ ఆపిల్లి సంగతి తెలుసుగనక దాన్ని దగ్గిరికి చేరదీశాము. ఆపిల్లి మంచిది కాకపోతే సైతాను దానిపై కరుణ చూపించి ఉండడు. (ధర్మాధర్మ విచక్షణలేని ఏ ప్రాణి అయినా సైతాను దృష్టిలో మంచిదే)

ఇక అతిథుల సంగతి. చెల్లా చెదరైన అతిథులు గావు కేకలు పెట్టుకుంటూ బజార్లలో పరిగెత్తారు. ఆ కేకలు విని గ్రామ ప్రజలు యావన్మందీ సంగతేమిటో తెలియక కంగారుగా రోడ్లమీదకొచ్చి గుంపులు గూడారు. భయంతో కొయ్యబారి పోయారు. ఇంతలో ఫాదర్ అడాల్ఫ వచ్చాడు. జనం తొత్తిగిలి ఆయనకు దోవ ఇచ్చారు. ఆయనవచ్చిన కాసేపటికి జ్యోతిష్కుడు తన లో తను ఏమిటో గొణుక్కుంటూ వొచ్చాడు.

★ అనువాదం: శ్రీ నండూరి రామమోహనరావు ★

★ విచిత్ర వ్యక్తి ★



అతన్ని చూస్తూనే అందరినోళ్లూ బిగుసుకు పోయాయి. దూరంగా తప్పుకున్నారు. అతనికేసి తేరి చూడటానికే భయపడ్డారు. ఆడవాళ్లు కొందరు మూర్ఛిల్లారు. అలా అతడు ముందుకు సాగిపోయిన తరవాత జనం అతన్ని కొంత దూరం నుంచి వెంబడించారు. జ్యోతిష్కుడు విందులో చేసిన విచిత్రాలు తెలియనివాళ్లు అడిగి తెలుసుకొన్నారు. ఈవిధంగా గ్రామమంతా ఆవిషయం క్షణంలో అల్లుకుపోయింది. అల్లుకుపోవటమే కాదు— ఆనోటా ఆనోటాపడి గోరంతలు కొండంతలుగా విస్తరించింది. చివరికి జ్యోతిష్కుడు సీసాడు మధువుతో ఒక పెద్ద పీపా నింపాడనీ, ఆపీపాడు మధువూ తిరిగి సీసాలోకి వంచాడనీ కథలు బయలుదేరాయి.

జ్యోతిష్కుడు అలాపోయి పోయి మావూరి పెద్ద బజారు చేరాడు. అక్కడ గారడీ వాడొకడు గారడీ చేస్తున్నాడు. వాడు మూడు ఇత్తడి బంతులు ఒకదాని వెనుక ఒకటిగా గాలిలోకి ఎగరేస్తూ, పట్టుకుంటూ తనవిద్య ప్రదర్శిస్తున్నాడు. జ్యోతిష్కుడు సరాసరి గారడీవాని దగ్గిరికెళ్ళి ఆ బంతులు తీసుకున్నాడు. తన వెంట వచ్చే గుంపు నుద్దేశించి "పాపం ఈ బీదగారడీ వాడు పొట్ట కూటికోసం ఈ ముష్టివిద్య కాస్త నేర్చుకున్నాడు. రండి. మీకు నావిద్య చూపిస్తాను," అన్నాడు.

అని మూడు బంతులూ ఒకదాని వెనక ఒకటి అతి వేగంగా ఎగరేస్తూ పట్టుకుంటూ, కోడిగుడ్డు ఆకారంలో ఒక వృత్తం ఏర్పడేట్టు చేశాడు. తరవాత బంతుల సంఖ్య క్రమంగా హెచ్చింది. నాలుగు, అయిదు, ఆరు, ఏడు, ఎనిమిది, ఈవిధంగా ఎక్కణ్ణించి వచ్చాయో తెలియకుండా వంద బంతులు తయారయ్యాయి. ఇన్నిటినీ గాలిలో ఆడిస్తూంటే ఇందాకటి కోడిగుడ్డు ఆకారపు వలయం బ్రహ్మాండమైన పరిమాణానికి పెరిగింది. బంతులాడిస్తున్న జ్యోతిష్కుని చేతులు ఎప్పుడు బంతిని పట్టుకుంటున్నాయో, ఎప్పుడెగరేస్తున్నాయో కనిపించ లేదు. అసలు ఆ వేగానికి అతని చేతులుకూడా కనిపించ లేదు. కొంత సేపటికి అతడు చేతులు కట్టుకుని పైకి చూస్తూ బంతుల్ని వాటంతట వాటినే తిరగమని ఆజ్ఞాపించాడు. అతని ఆజ్ఞ ప్రకారమే అవి గాలిలో వేగంగా తిరగ సాగాయి. ఎండలో ధగ ధగ మెరుస్తూ నిరాధారంగా తిరిగే ఆ ఇత్తడి బంతులు చూస్తుంటే అది చూసి తీరవలసిన దృశ్యం అనిపించింది. రెండు నిముషాలైన తరవాత "చాలు" అన్నాడు. వెంటనే వలయం విడిపోయి బంతులు చెల్లా చెదురుగా కింద పడ్డాయి. అవి ఎక్కడ పడితే అక్కడ జనం భయ భ్రాంతులై దూరంగా పారిపోయారు. వాటిని ముట్టుకుంటే చచ్చి పోతా

మేమో అన్నంత భయపడ్డారు. వారి భయం చూసి జ్యోతిష్కుడు హేళనగా నవ్వాడు. పిరికి దద్దమ్మలు, అని తిట్టాడు.

ఆపక్కనే గారడీవాడు రెండుగడ కర్రలు పాతి వాటికి ఎత్తుగా ఒకతాడు బిగించి కట్టాడు. అది చూశాడు జ్యోతిష్కుడు. "ఈగారడీ వాడు ఈతాడు మీద ఎంతో కష్టపడి అటూ ఇటూ నడవటం మీరు చాలసార్లు చూసి వుంటారు. ఇప్పుడు నేను చేసే తమాషా చూడండి," అంటూ జ్యోతిష్కుడు 'హుప్' అని గాలిలో కెగిరి తాడుమీద నుంచున్నాడు. రెండుకళ్లూ చేతులతో మూసుకుని ఒంటికాలితో ఈ చివరనుంచి ఆ చివరకి గెంతుతూ పోయాడు. మళ్లీ అలాగే వెనక్కి గెంతుతూ వచ్చాడు. ఇలా కొన్నిసార్లు చేశాక తాడుమీదనే పిల్లిమొగ్గలు వేశాడు. మొత్తం ఇరవైఏడు మొగ్గలు వేశాడు.

జనం ఈ దృశ్యం చూసి ఆశ్చర్య చకితులయ్యారు. జ్యోతిష్కుడు ముదివగ్గు. కర్ర పట్టుకోందే తిన్నగా నడవ లేనంత బలహీనుడు. అటువంటి వాడు ఇలా గెంతటం, మొగ్గలెయ్యటం చూసి ఏమనుకోడానికీ తోచలేదు. చివరికి జ్యోతిష్కుడు తాడుమీద నుంచి కిందికి దూకి కర్ర పట్టుకుని నేరుగా తన నివాసంకేసి మెల్లిగా నడిచిపోయాడు. అప్పటికి జనానికి స్పృహ వచ్చింది. అంతా దీర్ఘనిశ్వాసాలు విడిచి, కళ్లు నులుముకొని ఒకరి నొకరు చూసుకున్నారు. "ఇదంతా నిజమా కలా? నేనేనా చూసింది, నువ్వు కూడా చూశావా?" అని ఒకరి నొకరు ప్రశ్నించుకున్నారు. ఆఖరికి గుంపు విడిపోయింది. గ్రామస్థులు జంటలు జంటలుగా ఒకరి కొకరు ఆనరాగా బుజాల మీద చేతులు వేసుకుని ఎవరిళ్లకు వారు వెళ్ళిపోయారు.

మేము ముగ్గురం మా తండ్రుల వెనకే నడిచాం. వారేం మాట్లాడు కుంటారో వినాలనుకున్నాం. మా ముగ్గురి తండ్రులూ మా ఇంటిలోనే సమావేశ మయ్యారు. మేము కూడా వారి పక్కనే కూర్చున్నాం. వారు ముగ్గురూ గాఢ విచారంలో మునిగి వున్నారు. ఈ విచిత్ర సంఘటనలను బట్టి చూస్తే మా గ్రామానికేదో ప్రళయం ముంచుకు రాబోయే సూచనలు కనిపిస్తున్నాయని వారు అనుకున్నారు. మా నాన్న ఇలా అన్నాడు:

"ఫాదర్ అడాల్ఫ్ చూశారా? ఏదో మాట్లాడటానికి నోరు తెరిచాడు. తెరిచిననోరు తెరిచినట్టే వాగ్బంధమై పోయింది. ఇంతవరకూ ఏ మంత్రగత్తెలయినా సామాన్య జనం మీదనే తమ ప్రభావం చూపించేవారు. ఇప్పుడు దేవుడి సేవకులైన మతగురువుల్ని కూడా లెక్క చెయ్యటంలేదు. కాలం మారి పోయింది. ఇదంతా ఏదో వినాశనానికే వచ్చిది. పైగా ఫాదర్ అడాల్ఫ్ మెళ్లో శిలువబిళ్ల ఉన్నది కూడాను."

"అవునవును. మేమూ చూశాం. అది వున్నప్పటికీ లెక్కలేక పోయింది," అన్నారు మిగతా ఇద్దరూ.

"ముందేం జరుగుతుందో. ఇప్పటివరకూ మన్ని రక్షించేది చర్చేనని నమ్ముకున్నాం. అది కూడా ఓడిపోయింది."

"అవును. ఓడిపోయింది. దేవుడు మన్ని విసర్జించాడు. దేవుడు మన్ని వొదిలేసి వెళ్లిపోయాడు."

"అయితే మన కింకెవరు దిక్కు," అన్నాడు సెప్పీ తండ్రి.

"మనం దిక్కులేని పక్షుల మయ్యాము. మనకి వినాశకాలం సమీపించింది," అని నికొలాస్ తండ్రి జడ్జీగారు అన్నారు.

"మన ఊళ్లో ఇలా జరిగిందని దేశమంతా తెలుస్తుంది. మంత్రగత్తెల ఏలుబడిలో వున్న మన గ్రామాన్ని అంతా వెలి వేస్తారు. మనవూరికి బయటివారెవరూ రారు; మనతో సంబంధాలు తెంచుకుంటారు. ఇక మనపాట్లు కుక్కల కెరుక," అని సెప్పీ తండ్రి హోటల్ యజమాని అన్నాడు.

"అవును. అంతేకాదు. అన్నిటికంటే ఘోరం ఇంకోటుంది..." అని చెప్పలేక ఆగిపోయాడు మా నాన్న.

"ఏమిటది?" అని మిగతా ఇద్దరూ వాణికి పోతూ అడిగారు.

"పోప్ కూడా మన గ్రామాన్ని వెలిపెట్ట వచ్చు!"

ఈమాటలు పిడుగుపాటు లాగ పనిచేశాయి. స్పృహతప్పి పడిపోయి నట్లయ్యారు మా తండ్రులు

★ విచిత్రవ్యక్తి ★

ముగ్గురూ. పోప్ చేత వెలివెయ్యబడటం కంటె దారుణ దుర్గతి ఏ గ్రామానికీ పట్టదు. ఈ దుర్గతి తప్పించటం ఎలాగా అని ముగ్గురూ తలలు బద్దలు కొట్టుకున్నారు. అనేక విధాల చర్చించారు. అనేక మార్గాలు ఆలోచించారు. కాని ఏదీ నచ్చలేదు. ఆ మధ్యాహ్నమంతా యోచించినా సమస్య తెగలేదు. తెగేట్టు లేదని నిశ్చయించుకుని, బరువెక్కిన గుండెలతో ఇళ్లకు వెళ్లిపోయారు.

వారు వెళ్ళిపోకముందే నేనొక్కణ్ణే అవతలికి జారుకున్నాను. మార్గరెట్ ఇంటికి వెళ్లి అక్కడేం జరుగుతోందో చూడాలనుకున్నాను. దోవలో పరిచితులైన గ్రామస్థులనేకులు ఎదురుపడ్డారు. కాని ఎవరూ మాట్లాడలేదు. మాట్లాడే స్థితిలో కూడా లేరు. స్వప్నంలో నడుస్తున్న మాదిరిగా శూన్యంగా చూస్తూ ఎటో నడుస్తున్నారు. వారిని చూస్తే జాలి వేసింది'

మార్గరెట్ ఇంట్లో శ్మశాన వాతావరణం ఏర్పడింది. మార్గరెట్, మిాడ్లింగ్ ఒకే సోఫాలో కూర్చున్నారు. కాని ఒకరితో ఒకరు మాట్లాడటం లేదు. విచారంగా చూస్తూ కూర్చున్నారు. మార్గరెట్ కళ్లు ఏడ్చి ఏడ్చి ఎరువెక్కి వున్నాయి. ఆమె నన్ను చూసి ఇలా అన్నది:

"మిాడ్లింగ్‌ని వెళ్ళిపొమ్మని ఇందాకణ్ణించీ చెబుతున్నాను. ఇక ఇక్కడికి రావద్దన్నాను. మాతో సంబంధాలు పెట్టుకోవద్దన్నాను. అతడు వినటంలేదు. మాయిల్లు పిశాచాల ఏలుబడిలో వుంది. మాకెల్లాగూ నరకం తప్పదు. ఈ అమాయకుడు కూడా ఎందుకు నరకం కొని తెచ్చుకోవాలి? నామిాద ప్రేమ వుంటే ఉండవచ్చును గాని నాతోపాటు నరకంలో పడిపోవాలని ఎక్కడుంది?"

మిాడ్లింగ్ వెళ్లనంటే వెళ్లనన్నాడు. ఆమె ఎక్కడుంటే అక్కడే ఉంటానన్నాడు. ఆమెకు అపాయం వస్తే తనకూ రానిమ్మన్నాడు. ఆమాటలు విని మార్గరెట్ మళ్ళీ ఏడ్చింది. ఆదృశ్యం చాలా జాలి గొలుపుతోంది. వెళ్ళిపోదామా అనుకుంటున్నాను.

ఇంతలో ఎవరో తలుపుకొట్టారు. సైతాను లోపలికి వచ్చాడు. అతడు రాగానే గాలి చల్లబడింది. మధ్యాహ్నపు ఎండలో వెన్నెల కలసినట్టయింది. సైతాను మునపటి కంటె సుందరంగా, సంతోషంగా ఉన్నాడు. అతన్ని చూస్తూనే అందరూ క్షణకాలం తన్మయులైపోయారు. సైతాను ఇందాకటి విషయాలు స్మరించనైనా స్మరించకుండా, అవేమిా జరగనట్టే మాట్లాడసాగాడు. ముందు సంగీతం గూర్చి మాట్లాడాడు. సంగీతం మాట వినగానే మార్గరెట్ తన దుఃఖం మరిచిపోయి ఉత్సాహితురాలై సంభాషణలోకి దిగింది. సైతాను అలా ఎంతసేపో సంగీతకళ గూర్చి ఉపన్యాసం చేశాడు. సంగీతంమిాద అంత అద్భుతంగా, విశదంగా, విజ్ఞానవంతంగా మాట్లాడటం మార్గరెట్ ఎప్పుడూ వినలేదు. సైతానుపై ప్రేమవొలికించేస్తున్నట్టు చూసింది. ఆచూపు గమనించి మిాడ్లింగ్ మూతి ముడుచుకున్నాడు. తన ప్రియురాలు మరొకరికేసి అంత గౌరవంతో చూడటం అతనికి బాధగా ఉండదూ?

తరవాత సైతాను కవిత్వం మిాద మరికొంతసేపు సంభాషించాడు. మహాకవుల రచనలు కొన్ని చదివి వినిపించాడు. మార్గరెట్ మళ్ళీ ఇందాకటిలాగే ప్రేమగా చూసింది. మళ్లీ మిాడ్లింగ్ ఖిన్నుడయ్యాడు. ఈసారి మార్గరెట్ కనిపెట్టింది తన ప్రియుడికి కోపం తెప్పించానని. ఎంతో నొచ్చుకుంది.

ఆరాత్రి నేను మామూలుగా పక్కమిాద పడుకున్నాను. వాన కురుస్తోంది. కిటికీ తలుపుల మిాద వాన జల్లు సంగీత ధ్వనులు చేస్తోంది. ఆ సంగీతం జోల పాడినట్లయి అలాగే నిద్రపోయాను. ఒకరాత్రివేళ సైతాను నా దగ్గిరకివచ్చి లేపాడు.

"నాతో రా. అల్లల్లా తిరిగొద్దాం. ఎక్కడికి పోదాం చెప్పు," అన్నాడు.

"నీ యిష్టం, ఎక్కడికైనా సరే."

వెంటనే కళ్లు మిరుమిట్లు గొలిపే సూర్యకాంతిలో ఉన్నాను.

"ఇది చైనా!" అన్నాడు సైతాను. (ఇంకావుంది)

అపర ధన్వంతరి

శ్రీమతి [illegible] వెంకట[illegible]

రాత్రి 9½ గంటలయింది. నేను అప్పుడే క్లాస్ బుక్స్ ముందు వేసికొని కూర్చున్నాను - చదువుకుందామని. కాని దృష్టి క్లాస్ బుక్స్ మీదికి పోవడంలేదు. రేడియోలో ప్రసారమవుతున్న "నాటకం" మీదికీ, ఎదురుగుండా స్టాండు మీద పడి వున్న క్రొత్త పత్రికల మీదికీ తెగ పరుగు పెడుతున్నది. దానికి తోడు- అదేం ఖర్మమోగాని— శెలవల్లో ఎంతో అవస్థ పడితేనే గాని పట్టని నిద్ర-యిప్పుడు పుస్తకం తెరిచే సరికల్లా మహా ముంచుకు వస్తోంది. కాని పరీక్షలింకా పదిహేను రోజుల్లోకి పరిగెత్తుకు వచ్చినయ్. ఎలాగైనా పట్టుపట్టి పాఠాల్ చదివి, ఫస్టుక్లాసులో ప్యాసవాలని వొక తిరుగులేని నిశ్చయానికివచ్చి పెద్దగా చదవడం మొదలు పెట్టాను. అప్పుడే పరీక్షలై శెలవలకి యింటికి వచ్చిన మా అన్నయ్యలు ఖుషీగా క్యారమ్స్, చెస్ ఆడుకుంటూ వుంటే నాచిత్తం చివుక్కుమంటూనే వున్నది. కాని ఏం చేయమంటారు? పాడు పరీక్షలు ఒకటివచ్చి పడ్డాయి నా ప్రాణానికి! పుస్తకం తెరచి నాలుగు పేరాలు చదివాను. (మనలో మాట- ఒక్క విషయం కూడా బుర్రలోనికి జొరబడలేదనుకోండి!)

ఇంతలో వీధిలోనుంచి "అయ్యో! అమ్మో! దేవుడా!" అంటూ కేకలు వినిపించాయ్. పుస్తకాలక్కడే పారేసి ఒక్క పరుగున వసారాలోకి వెళ్ళాను. అప్పటికప్పుడే మా అన్నయ్యలు కూడా ఆట చాలించి బయటకి పరుగెత్తారు. మా పాలేరువాడిభార్య ఎడమకాలు చేతితో పైకెత్తి పట్టుకొని పెద్దగా కేక లేస్తోంది. మేమంతా క్షణంలో ఆవిడ చూట్టూ చేరాము 'ఏమిటేమిటం'టూ-

"బజారు నుంచి యింటికి పోతుయీడికోచ్చే తలికి, తేలు తెగ పొడిసింది బాబో!" అని చెప్పింది- ఏడుస్తూనే.

మా పెద్దన్నయ్య గబగబా టార్చిలైట్ తెచ్చి వెతికి పట్టుకుని తేలుని చంపి అవతల పారేశాడు. ఆవిడకి బాధ ఎక్కువైనట్లుంది- యింకా పెద్దగా రాగాలు తీయడం ప్రారంభించింది. మా పెద్దన్నయ్య ముందుకు వచ్చి "నాకు తేలుమంత్రంవచ్చు - మొన్నగుంటూరులో నేర్చుకున్నాను, అది కనుక వేస్తే బాధ దెబ్బకి పోతుంది" అన్నాడు. అందరం "అమ్మయ్య" అనుకున్నాము. సరే యిక మంత్రం వేయడం మొదలు పెట్టాడు. ఆ మనిషిని మొదట నిల్చోమన్నాడు. తరువాత కూర్చోమన్నాడు. మళ్లీ నించోమన్నాడు. మళ్ళీ కూర్చోమన్నాడు. ఆతరువాత కాసేపు ఒంగోమన్నాడు. కాసేపేమిటో మంత్రాలు చదివాడు. 'హాం' అన్నాడు; 'హ్రీం' అన్నాడు. "మూడుసార్లు కూర్చుంటూ, లేస్తూ నీపేరు పైకి చెప్పమని" పురమాయించాడు. నాలుగుసార్లు కాలు గట్టిగా విదల్చమన్నాడు. పాప



మూవిడ అంత బాధలోనూ వీడు చెప్పిన వన్నీ చేసింది. కాలు విదిలించాక "ఆఁ...ఇప్పుడు పోయింది గదూ బాధ!" అన్నాడు. ఆవిడ పోలేదు అన్నది. 'ఆ పోలేదా' అని రెట్టించాడు. మళ్ళీ రెండోసారి కూడా అట్లాగే చేశాడు. "నొప్పి తగ్గలేదు బాబూ—మరింత ఎక్కువైనాది" అని చెప్పిందావిడ. ఇక లాభం లేదనుకొని, "తగ్గుతే యింకో రెండుగంటలు లోపల తగ్గుతుందని" చెప్పేసి తను తప్పుకొన్నాడు.

ఇంతలో మా తమ్ముడు, ఏదో జ్ఞాపకం వచ్చిన వాడిలా గబగబా లోనికి పరిగెత్తి, తన పెట్టెనంతా వెతికి వొక కణికి తెచ్చాడు. దాన్ని గనక అరగదీసి తేలుకుట్టిన చోట వేస్తే ఎంత బాధయినా సరే చటుక్కున మాయమవుతుందని చెప్పి, దానిని బాగా అరగదీసి గంధం తీశాడు. కుట్టినచోట మూడుసార్లు రాచి, 5 నిమిషాలయిన తరువాత 'తగ్గిందా' అని అడిగాడు-ఎంతో ఆశగా! "తగ్గలేదు బాబూ! తగ్గలేదు!" అన్నదావిడ, కాలు పట్టుకు గంతులేస్తూ! ఇక లాభం లేదని వాడు వూరుకున్నాడు.

ఇక మా అక్క బయలుదేరింది-తనూ వొక మందేస్తానని. గబగబా లోపలికి పోయి గోరు వెచ్చని నీటిలో చారెడు వుప్పుకలిపి ఆవుప్పునీళ్లను వొక చిన్న 'డిష్'లో పోసింది. ఆస్ప్రత్రి దూది యింత తెచ్చింది. అవి రెండూ పట్టుకుని వొక పెద్ద లేడీ డాక్టర్‌లా రంగం మీదికి వచ్చింది. దూదితో ఆమె రెండు కళ్ళలో మూడేసి బొట్లు చొప్పున ఆ వుప్పునీళ్లు పోసింది 'తగ్గిందా' అని అడిగింది. 'తగ్గలేదమ్మగారు,' అన్నది ఆ బాధ పడుతున్న మనిషి. మా అక్క మళ్ళీ రెండోసారి నీళ్లు పోసింది. మళ్ళీ తగ్గలేదనే చెప్పిందావిడ. ఇక మూడోసారి ఆఖరి సారిగా నాలుగు బొట్లు వేసింది. అదేం విచిత్రమో గాని-ఆనాలుగు బొట్లూ పడగానే ఆవిడ చప్పున లేచి కూర్చుని "తగ్గిందమ్మా. తగ్గిందని" దణ్ణం పెట్టేసి కాలు యీడ్చుకొంటూ వెళ్ళిపోయింది.

ఇక మా అక్క విజయగర్వమే మని వర్ణించను! కాని మా అన్నయ్యా, తమ్ముడూ అంత త్వరగా ఆవిడకు దక్కనిస్తారా ఆ విజయాన్ని! 'నా మంత్రం వల్ల తగ్గిందం'టు 'నా కణిక వల్ల తగ్గింద'ని యిద్దరూ దెబ్బలాట ప్రారంభించారు. 'అదెల్ల ముడియాదు! అంతా నా వుప్పునీటి ప్రభావమే,'

రని అక్కయ్య వాదన. అన్నయ్యా, తమ్ముడూ ఎంత పెద్ద గొంతుక పెట్టుకుని వాదించినా, అక్క బలమైన ఆర్గ్యుమెంటు వలన వాళ్లకు తగ్గక తప్పిందికాదు. ఇక దాంతో ఆవిడ గారి గర్వం అవధులు దాటిపోయింది. ధన్వంతరిని కూడ దాటిపోగలనని అనుకున్నది. త్వరగా ఎవ్వరికైనా వాముకరిస్తే బాగుండు, తన ప్రభావం చూపిద్దామని తొందర పడింది-దాని మనస్సు.

మరునాడు ప్రొద్దున మా పాలేరు వచ్చాడు. మా అక్క గర్వంగా అందరూ వినేటట్లుగా తను నిన్న అతని భార్య తేలు కాటుకి చేసిన అద్భుతమైన చికిత్సని గురించి సాధ్యమైనంత గొప్ప చేసి చెప్పడం ప్రారంభించింది. లోపల కష్టంగా వున్నా పైకి నవ్వుతూ కూర్చున్నారు మా అన్నయ్యా, తమ్ముడూ. మా అక్కయ్య వుపన్యాసం సాంతం విని పాలేరు నవ్వుతూ యిలా చెప్పాడు "అది గాదండీ; అమ్మాయిగారూ! తేలు కుట్టిందనే సరికి మీరంతా ఏవో వైద్యాలు ప్రారంభించారట. ఏమిటో లెగమన్నారట, కూకోమన్నారట, కాళ్ళుయిదిలించమన్నారట. కణిక అరగదీసి పూశారుట. దాంతో ఆ బాధకుతోడు బాగా మంటెక్కిందట. ఇంతలో మీరువచ్చి ఏడివుప్పునీళ్ళు కళ్ళలో పోశారంట. నలకలూ అయ్యాపడి దాని కళ్ళు వొక్కసారి భగ్గుమనిమండాయంట. కాలి బాధకు తోడు కంటిబాధ కూడా ఎక్కువైందంట. అందుకని యింకా తగ్గలేదంటే యింకా ఎన్నిరకాల మందు లేత్తారోనని భయం పుట్టి తగ్గిందని చెప్పి తప్పించుకొచ్చిందట. అంతేగాని అసలుతగ్గనేలేదండి. ఇప్పటికికూడా యింకా యమబాధ పడుతూనే వుండది."

దాంతో మా అక్క తప్ప మిగతా అందరమూ ఫక్కున నవ్వాము. "పోనీలేగాని, మాపిచ్చి వైద్యం గురించి మా నాన్నగారితో చెప్పకు, కోప్పడుతారు" అని చెప్పి మాఅక్క సిగ్గుతో లోనికి పరుగెత్తింది.

★

భావిభారత వీర వనితలు!

ఆడపిల్లలు అందరూ కలిసి ఆవేళ వాళ్ళ డ్రిల్లు మాస్టరుతో పట్టణానికి పదిమైళ్ళ దూరంలోవున్న ఒక పురాతనపు కోటను చూడటానికి కాలినడకను వెళ్ళారు.

కోటను చూడటం పూర్తి అయ్యాక అందరూ ఒక చెట్టునీడను కాస్సేపు విశ్రమించారు. ఆ తరువాత వాళ్ల డ్రిల్లు మాస్టరు పిల్లలనందరినీ ఒక్క లైనులో నిల్చోబెట్టి యిల్లా అన్నది:—

"చరిత్ర ప్రసిద్ధమైన యీ కోటను మనం నేటికి కన్నులార చూచాం. ఇక యిళ్లకు పోవలసిన సమయం వచ్చేసింది. కాబట్టి నడవటానికి ఓపిక లేనివాళ్ళు మీలో ఎవరైనా వుంటే బస్సుల్లో వెళ్ళండి. మిగిలిన వాళ్ళందరూ మాత్రం హాయిగా నడిచివస్తాం. అలా నడవలేక, బస్సులో పోదలచినవారెవరైనా వుంటే యిప్పుడు నిల్చున్న వరసలోనుంచి రెండు అడుగులు ముందుకు వచ్చి నిల్చోండి."

ఒక్క పిల్లతప్ప మిగిలినవాళ్లందరూ రెండు అడుగులు ముందుకు వచ్చి నిల్చున్నారు. డ్రిల్లు మాస్టరుకి దిగులేసింది, —వీళ్లు అందరూ యింత అర్భకులేమా అని. తీరా చూస్తే లైను వెనగ్గా ఒక పొట్టి పిల్ల నిల్చొని వున్నది. డ్రిల్లు మాస్టరుకి చాలా సంతోషమయింది.

"నీవొక్క పిల్లవుతప్ప మిగిలినవాళ్లందరూ దండగ పిల్లలే. పట్టుమని పదిమైళ్లైనా నడవలేని పిల్లలు ఏం పిల్లలు?" అన్నది.

"అది కాదు టీచర్—నేను యీ రెండు అడుగులైనా కదలలేక వున్నచోటనే నిల్చొండిపోయాను." అన్నది ఆ చిన్నపిల్ల.

'నాటక కళను గురించి వ్యాసము వ్రాయుసది' అని పరీక్ష పేపరులో ఒక ప్రశ్న.

ఆ విద్యార్థికి ఏమి వ్రాయటానికీ తోచలేదు. బాగా అరగంటసేపు ఆలోచించి, వ్రాశాడు—

"నాటక కళ నాటక రంగముపై పోషింప బడును. నాటక రంగమనగా అది ఒక ఎత్తైన దిమ్మ. ఈ దిమ్మపై హత్య చేయబడిన వ్యక్తి వెంటనే మరణించక, ముఖారి రాగమందు ఒక పాట పాడును"

చెల్లాయీ!

[illegible]

[illegible]

ఆ రోజు శుక్రవారం - అంటే ఆ రోజు స్కూలు వుందన్న మాట! సరిగ్గా పావుతక్కువ ఒంటి గంటకి, వర్షం మొత్తడం ప్రారంభించింది. ఇంటికి వెళ్ళటానికి వీలు లేదుగదా అని విసుక్కున్నాను! (సినీమాకు డబ్బు లివ్వలేదని ప్రొద్దున మా అమ్మమీద కోపం వచ్చి, చద్దిఅన్నం కూడా తినకుండా వచ్చేశానులెండి.) ఇంతలో స్కూలు గంట కొట్టారు. మా స్కూలు విద్యార్థులు ఒక్కొక్కరే పోతున్నారు-తమకై వచ్చిన కార్లలోను, నౌకర్లు చాకర్లు తెచ్చిన గొడుగుల లోను. కొందరు తెగించి హోరున కురుస్తున్న వర్షంలోనే సైకిళ్ల మీదనూ పోతున్నారు. కాని నా కోసం మా నౌకరు రాలేదు. ఆ... జ్ఞాపకమొచ్చింది. వాడు 'నాకు జ్వరం వచ్చింది. ఇవాల్టికి రాలే' నని ప్రొద్దున్నే కబురంపాడుకదూ! "వెధవ! వాడికి జ్వరం ఇప్పుడే రావాలా? దొంగ జ్వరం!" అని కసురుకున్నాను. కడుపులో కాలుతోంది-మరి ఏంచేయను? కసంతా వాడిమీద చూపించేను. ఇష్టమొచ్చినట్టు తిట్టేశాను!

నాకోసం నా మిత్రుడు వెంకటేశ్వర్లు కూడా స్కూల్లోనే మిగిలిపోయాడు - తనకోసం వచ్చిన గొడుగును తిరగగొట్టేసి! (మా వెంకటేశ్వర్లు నా కోసం ఎంత త్యాగం చేశాడు! చేయడూ? ఇంకో నాల్గుసార్లు హోటలికి తీసుకెళితే సరి!) ఇంక లాభం లేదని వరండాలోంచి కదిలి మా 'డివిజను'లోకి చేరాము. వర్షం తగ్గే సూచన లేక, వరుణదేవుని శపించుకుంటూ కూర్చొన్నాం. ఇంకా మా స్నేహితులు అరడజను మంది వున్నారు. అయినా ఏం చేస్తాం?

ఏం తోచక, 'పిచ్చాపాటీ' ప్రారంభించేము. రామం మాలో కలవక వేరేకూర్చుని 'రసికేపను' బట్టీ పడుతున్నాడు. "మన ప్రభుత్వానికి బుద్ధి లేదురా! ఇంత వర్షంలో ఇళ్లకి వెళ్లగలమా? కొంచెం 'పోలీసువాన్ల'మీద మనలను తీసుకుపోయి ఇళ్ళవద్ద దిగబెట్టకూడదూ? అటు రష్యాలో చూడు పిల్లల్ని ఎప్పుడూ కార్లలో ఇళ్ళకి దిగబెడుతుందిట!" అన్నాడు సోమశేఖర్. (వీడో కమ్యూనిస్టు. మొన్న ఎన్నికల్లో వాళ్ల అన్నయ్య తరఫున ప్రచారం చేశాడు). మా వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని సమర్థించేడు "మన ప్రభుత్వం ఇంకా పసిపిల్లరా" అని మొదలెట్టి జాతీయ భావంమీద ఓ ఉపన్యాసం దంచాడు. ఇలాగే మా చర్చలు రాజకీయ, ఆర్థిక, సాహిత్య, సినీమా రంగాలలో విపరీతంగా సాగుతున్నాయి. రామం ఇంకా చదువుతూనే వున్నాడు!

ఇంతలోనే మా చర్చలు ఠక్కున ఆగిపోయాయి ఆకుర్రాడి రాకతో! ఆ కుర్రాడు 13 ఏళ్ల వాడిలా వున్నాడు. మెల్లకళ్లు. దుస్తుల్నిబట్టి చూస్తే మధ్యతరగతివాడనుకోవచ్చు. 'పుస్తకాలు జాగ్రత్తరోయి! వృత్త K. D. లాగున్నాడు' అన్నాడు చంద్రం - 'ఆవారా'లో రాజకపూర్ పోజొకటి పారేసి, ఆ కుర్రాడివంక చూస్తూ! అందరూ నవ్వేశాం.

'వాట్ ఆర్ యు స్టడీ?' అన్నాడు శేషగిరి వచ్చీరాని ఇంగ్లీషులో (ఇప్పుడేముంది! ఇంకా ముందుంది మావాడి ఇంగ్లీషు!) 'వాటీజ్ యువర్ నేమ్?' అన్నాడు పాల్ సీరియస్‌గా. 'తుమ్హారా నామ్ క్యా హై?' అన్నాను నేను రాజభాష వాడుతున్నా నన్న గర్వంతో. 'భవదీయ నామం బెయ్యది?' అన్నాడు వెంకటాచారి. ఇంతమంది ఇన్ని ప్రశ్నలు ఒకరి తర్వాత ఒకరు వేసేప్పటికి, ఆ కుర్రాడు తారెత్తి పారిపోయాడు- 'చెల్లాయీ......యీ...' అని రైలుబండి కూతలాగ కూసుకుంటూ. 'బెదిరేడురా! కుర్రాడు



పాపం' అన్నాడు వెంకటేశ్వర్లు. 'బలే ఏడిపించేం' అన్నాడు పాల్. అందరూ ఏదో ఘనకార్యం చేసినట్టు నవ్వేశాం! కానీ - నిజం మాకేం తెలుసు?

ఆ కుర్రాడు మళ్ళీ వచ్చాడు! ఇలాకాదని ఆ కుర్రాణ్ణి నేనే తీసుకవచ్చి కూర్చోబెట్టి కొంతసేపటికి "ఏం చదువుతున్నా" వని నెమ్మదిగా అడిగాను. మొదట 'చెల్లాయీ—' అని అరిచేడు! త్రుళ్ళిపడ్డాం అందరమూ.

మళ్ళీ అడిగేను. ఈసారి 'స్కూలు ఫైనల్' అన్నాడు. ఆశ్చర్యపోయాం! ఇతడి వాలకాన్ని బట్టి మేమంతా ఇతడు 'ఫస్టుఫారం' చదువుతూంటాడని ఇదివరకే నిర్ణయం చేశాం.

ఇంతలో సోమశేఖర్ 'నీ పేరేమిటి?' అన్నాడు. ఆకుర్రాడు మళ్ళీ 'చెల్లాయీ!' అంటూ రాగం ఆలాపించాడు. పాల్ మళ్ళీ అదే ప్రశ్న వేస్తే 'రాజారెడ్డి' అన్నాడు! రెసిటేషన్ బట్టీపెట్టుతున్న రామం కూడా పుస్తకం మూసేసి మావద్దకు వచ్చేడు. రామాన్ని చూపిస్తూ 'ఇతన్నెరుగుదువా?' అన్నాను రామంతో.

'చెల్లాయీ కదూ!' అన్నాడు రాజారెడ్డి. అంతా నవ్వేశాం! 'బాగా కాలక్షేపం అవుతోంది' అన్నాడు వెంకటేశ్వర్లు. రామం అతన్ని ప్రశ్నలు వేసేడు. అన్నిటికి జవాబు చెప్పేడు రాజారెడ్డి! 'ఏ డివిజను' అన్నా. 'C డివిజను' అని అన్నాడు! నా స్నేహితులు అతన్ని ఏడిపించటానికి అతని పుస్తకాలు దాచి, జెల్లెలు కొట్టబోయారు. నేను వాళ్ళని వారించి అతని నోట్సు బుక్కొకటి తీసిచూసేను. "K. రాజారెడ్డి, స్కూలు ఫైనల్, 'C" అని వ్రాసివుంది-దానిమీద. మా నిర్ణయాలు కూడా అప్పుడప్పుడు తప్పవుతాయని తెలుసుకోవటం మాకు ఇదే మొదటిసారి! లోపల అక్షరాలు ముత్యాల్లాగ వున్నాయి! ఇదెవరి రైటింగు అని అడిగేను! 'నాదే!' అన్నాడు. లోపల అంటించిన ఫొటో చూసి 'ఇదెవరిది' అన్నాను.

'మా చెల్లెలిది' అన్నాడు.

'నీకు చెల్లెళ్ళెంతమంది?'

'నల్గురు'

'మరి అక్కలో?' అప్రయత్నంగా అడిగేశాను!

'ఒక్కర్తే!' అన్నాడు ఏడుస్తూ.

చెల్లాయీ!

'ఎందు కేడుస్తావు?' అన్నాను ఓదారుస్తూ.

'మా చెల్లాయిలూ, అక్కా కూడా చనిపోయారు!' అన్నాడు.

నాకు కూడా అప్రయత్నంగా కళ్లలో నీళ్లు గిర్రున తిరిగేయి! నా చెల్లాయి పోయినట్లనిపించింది. ఈ ఏడ్పుకి ఆ 'చెల్లాయీ...' దీర్ఘానికి ఏదో సంబంధం వుందనుకొన్నాను. అతని పుస్తకాలు అతని కిప్పించేశాను. నా యీ ప్రవర్తనకి మిగతా వాళ్లు ఆశ్చర్యపోయారు!

ఇంతలో 'అబ్బాయి గారూ! ఇక్కడున్నారా! వెదుకుతున్నా' నన్నాడు ఎవరో. వెనక్కి తిరిగి చూచాను. రాజారెడ్డి అతనివద్దకు వెళ్లి కారాజే తీసుకోవటంకనిపించింది. వాళ్ళ నౌకరేమో నని అనుమానించి అతనివద్దకు వెళ్ళి జరిగిన సంగతి చెప్పి 'ఎలా పోయారు అతని అక్కా చెల్లెళ్లు!' అని అడిగేను!

'కలరా వచ్చి బాబూ, పోయారు! బాబూ...ఐదుగురూ పోయారు... అప్పటినుంచీ అప్పుడప్పుడీ అబ్బాయిగారికి ఇలానే అదో మాదిరి కయ్యాళిలా వస్తుంటుంది బాబూ' అన్నాడు.

అతన్ని పంపించి తిరిగి వస్తూ 'ఆత్మీయులు చనిపోతే మానవులెంతగా మారిపోతారా' అని ఆశ్చర్యపోయాను. అప్రయత్నంగా నాకూ ఏడుపు వచ్చింది.

ఇంతలో వెంకటేశ్వర్లు నన్ను కల్సుకొని 'ఎందుకురా ఏడుస్తున్నావు?' అన్నాడు. 'పాపం ఆ కుర్రాడు...' అని ఏమో చెప్పబోతోంటే, 'దానికేనా!' అన్నాడు తేలిగ్గా!


ఎంత తేలిక! తోటి మానవుని కష్టాలకు సానుభూతి చూపలేరు. ఆ నిముషాన నా మనస్సులో మాత్రం రాజారెడ్డి అక్కచెల్లెళ్లు, నా అక్కచెల్లెళ్లు అయినారు. వారందరికీ మనస్సులో నమస్కారం చేసి వారి ఆత్మకు శాంతి కలుగచేయమని మనస్ఫూర్తిగా ఆ భగవంతుని ప్రార్థించాను.

ఇంతలో 3 గంటలకు బెల్లు కొట్టారు. చూద్దును కదా వర్షం లేదు! నా మనస్సులో ఏదో వర్షం వెలిసినట్టయింది! నెమ్మదిగా క్లాసులోకి పోతూ 'సి' డివిజను కేసి చూశాను. రాజారెడ్డి ఎవరితోనో మాట్లాడుతూ వెళ్తున్నాడు!

రాజారెడ్డి అంటె నా కొకవిధమైన జాలి కలిగింది. మర్నాటి నుంచి రాజారెడ్డిని రోజూస్కూలులో కల్సుకుంటున్నాను. ఇప్పుడిప్పుడు అతనిలో ఒక విధమైన మార్పు వచ్చింది! ఇప్పుడు చెల్లాయిగురించి ఎత్తితే లోపల్లోపలే దుఃఖిస్తాడు!

★

జంతుకోటిలో మానవలక్షణాలు



(గతసంచిక తరువాయి)

అమెరికాలోని ఒకానొక పట్టణంలో ఒకరోజు తెల్లవారే సమయానికి పాలుపోసే మనిషి ఒకడు గుర్రపు బండినిండా పాలకడవలు పెట్టుకొని వూళ్లోకి వచ్చాడు. గుర్రపుబండిని ఒకచోట నిల్పిపెట్టి, తాను ఆచుట్టుపట్ల వుండే యిళ్లవాళ్లకి పాలు యిచ్చివద్దామని వెళ్లాడు. కొంతసేపటివరకు బండికి కట్టిన ఆగుర్రం మెదలకుండానే వుంది; కానీ-యింతలో ఏమైందో ఏమోకానీ-వున్నట్లుండి అది భయపడిపోయి వెర్రెత్తినట్లు రోడ్డుకు అడ్డంగా పరుగు లంకించుకొంది. ఇంతకీ ఆ గుర్రాన్ని అంతగా హడలగొట్టిన దేమిటీ అని పరీక్షగా చూస్తే, ఆ చుట్టుపట్ల ఎవడో కుర్రాడు హుషారుగా పాట పాడుకొంటూ, రోడ్డుకు అడ్డంగా పడివున్న సీనారేకు డబ్బానొకదాన్ని తన్నుకొంటూ తన్నుకొంటూ పోతున్నాడని తేలింది. ఆ సీనారేకు చప్పుడుకే యీ గుర్రం బెదిరిపోయింది.

బెదిరిపోయిన ఆ గుర్రం వెర్రిగా పరిగెత్తుకొంటూ పోతూవుంటే, దానిని కట్టివున్న బండి దిక్కుమాలిన శవంలా అటూ యిటూ వూగిసలాడి పోయింది. ఈలోగా ఆ గుర్రపు బండియజమాని ఎవరింట్లోనో పాలుపోసేపని పూర్తిచేసి వీధిలోకి వచ్చి, తనబండికి పట్టినగతి చూసి, గుండెలు బాదుకొంటూ గుర్రాన్ని ఆగమని కేకలు వేసుకొంటూ అది పోయిన బాటపొడుగునా పరుగులు తీశాడు. ఇతడు వూపిరి తిత్తులు బద్దలయ్యేలా ఎంత అరుచుకొన్నా ఆగుర్రం ఖాతరు చెయ్యనేలేదు. ఇతగాడి అరుపులనే కాదు-ట్రాఫిక్ పోలీసులు దాని దారికి అడ్డునిల్చి లాఠీలు ఎత్తి ఎంత అదిలించినా, బెదిరించినా అది పీసమెత్తు లెక్కచేయలేదు. అలా ఆగకుండా అరమైలు పరిగెత్తి అక్కడ హఠాత్తుగా ఆగిపోయింది. ఎందుకు ఆగిందంటారేమో - అక్కడ దాని కంటికి ఎర్రటి దీపం కనిపించింది. అంతే! ఠక్కున ఆగిపోయింది.

ఎర్ర దీపం కనిపించగానే ఆగిపోవాలని తెలుసుకోవటం కొందరు మనుషులకే చేతకాకపోయినప్పుడు, మామూలు బండికి కట్టిన గుర్రం అలా తెలుసుకోగలిగిందంటే, అదేదో గొప్ప విశేషమని అందరూ అనుకొన్నారు. ఎర్రలైటు కనిపించినప్పుడల్లా యజమాని తనను నిలిపివేస్తూ వుండటం అలవాటుగా ఏళ్లతరబడి జరుగుతూనే వున్న కారణంచేత, నోరులేని జీవం అయినా, యీ గుర్రం మెదడులో ఎర్రదీపానికీ ఆగిపోవటానికి స్థిరమైన సంబంధం వున్నట్లు బోధపడి పోయింది.

కావాలంటే గుర్రాలని గురించిన యిలాంటి కథలు ఎన్నైనా చెప్పుకోవచ్చు. కానీ—నిజానికి గుర్రం ఏమాత్రపు తెలివి కలదో తెలుసుకోవటం అవసరం. మీరు తరచు వినేవుంటారు—రాబోయే ఆపదలను గురించి మనుష్యులకు అందని సూచనలు ఏవో గుర్రాలకు ముందుగా అందుతూ వుంటాయని పలువురు చెప్పుతూ వుంటారు. ఆ లక్షణాన్ని

★ జంతుకోటిలో మానవ లక్షణాలు ★

యింగ్లీషులో 'హార్స్ సెన్స్' అంటారు. ఇందులో సత్యం ఎంతవరకు వున్నదనే విషయాన్ని గూర్చి కనీసం 50 ఏండ్లనుంచైనా శాస్త్రవేత్తలు చర్చిస్తున్నారు; పరిశోధనలు జరుపుతున్నారు. కొందరు శాస్త్రప్రవీణులు ఒక సంఘంగా ఏర్పడి తెలివితేటలకు పేరెన్నికగన్న కొన్ని గుర్రాలను మహా ఓపికగా పరిశీలించారు. వీళ్లు మొట్టమొదటిసారిగా, పరీక్షించిన గుర్రం పేరు 'హాన్స్'. ఈ 'హాన్స్' మాటలు కూడా మాట్లాడగలదని యీ శతాబ్దారంభంలో మారు మ్రోగిపోయింది.

బెర్లిన్ వాసి హెర్ ఫాన్ ఆస్టెన్ అనే ఆయనవద్ద వుండేది యీ 'హాన్స్' అనే గుర్రం. ఆ ఆస్టెన్ తన ముద్దుల గుర్రం కూడికలు, తీసివేతలు, భాగహారాలు సునాయాసంగా చెయ్యగలదనీ, తాను అర్థం చేసుకోగల 'భాష'లో అది మాట్లాడను కూడా మాట్లాడకలదనీ, దానిని ఎవరైనా ఏవైనా ప్రశ్నలు జర్మన్ భాషలో అడిగినా వ్రాసి ముందు పెట్టినా సమాధానాలు యీయగలదనీ, ప్రకటనలు చేశాడు.

హాన్స్అనే యీ గుర్రం అంకెలకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు యీయవలసి వచ్చినప్పుడు తన ముందుకాళ్లు రెంటినీ వుపయోగించి సమాధానాలు చెప్పేది. అంటే - మరేమీ లేదు- పదిలోపు అంకెలు అయితే కుడికాలి మడమతో ఎన్ని అంకెలు వుంటే అన్నిసార్లు నేలమీద 'టక్కు' 'టక్కు' మని కొట్టేది. పది అంకెలు దాటి యింకా పైకిపోవలసి వస్తే ఎడమకాలి మడమతో ఒక్కొక్క పది అంకెలకు ఒక్కసారి చొప్పున చప్పుడు చేసేది. వుదాహరణకు-ఏదైనా ఒక లెక్కకు సమాధానం 63 వచ్చిందనుకోండి. ఈ అంకెను చెప్పడం ఎలాగూ అంటే - ముందుగా ఎడమ మడిమతో ఆరుసార్లు నేలమీద కొట్టేది. అక్కడికి ఆరుపదులు అరవై. అప్పుడు కుడికాలు ఎత్తి ఆకాలి మడమతో ఒకటి, రెండు, మూడు కొట్టి, 'రైటేనా' అన్నట్లు చూసేది. మాటలతో చెప్పవలసిన సమాధానాల విషయంలో కూడా ఆగుర్రం యిలాగే కాలి మడమతో చేసే చప్పుళ్లనే సాంకేతికంగా వుపయోగించేది. టెలిగ్రాఫ్ ఆఫీసులో మీరు చూసే వుంటారు- అక్కడవుండే ఆ గుమాస్తా చిన్న యంత్రం మీద మనమిచ్చిన తంతి వార్తను అనుసరించి ఏవేవో 'కట్టు' 'కడ' 'కట్టు' 'కడ' అంటూ కొన్ని శబ్దాలు చేస్తాడు. ఆమాదిరి శబ్దాల ద్వారా అవతలి వారికి వార్తలను అందచేసే పద్ధతిని 'మార్స్‌కోడ్' అంటారు. ఈ 'హాన్స్' అనే గుర్రం కూడా అలాగే 'మార్స్‌కోడ్' లాంటి సాంకేతిక శబ్దాలద్వారా ప్రశ్నలకు సమాధానాలు యిచ్చేది. దానికళ్ల ఎదురుగుండా ఒక పెద్ద అట్ట తగిలించి దానిమీద జర్మన్‌భాషలో వుండే అన్ని అక్షరాలకు అన్నిరకాల శబ్దసాంకేతికాలు నిర్ణయించి పెట్టాడు, ఆ గుర్రం తాలూకు యజమాని. ఎవరైనా ఆ గురరం దగ్గరకు వచ్చి "యీవేళ ఏం వారం" అని జర్మన్ భాషలో అడగ్గానే, అది "బుధవారం" అని (జర్మన్ భాషలోనే) శబ్దసంకేతాల ద్వారా సమాధాన మిచ్చేసేది. ఇలాంటి అపూర్వ ప్రజ్ఞ విశేషంగల తన గుర్రాన్ని ఆ హెర్ ఫాన్ ఆస్టెన్ ప్రతిచోటా ప్రజలకు వుచితంగా ప్రదర్శించేవాడు.

ఈ గుర్రాన్ని గూర్చిన వింతలు ఆనాడు జర్మనీ దేశమంతటా వేయినోళ్ల చెప్పుకొని ఆశ్చర్యపోతూ వుండేవారు. చివరకు ఆ దేశపు ప్రభుత్వం, యీగుర్రానికి వున్న తెలివితేటలను సశాస్త్రీయంగా పరీక్షించి నిర్ణయించటానికి ప్రత్యేకం ఒక ప్రవీణుల సంఘాన్ని కూడా నియమించింది. ఇద్దరు జర్మన్ ప్రొఫెసర్లు యీ గుర్రం నిజంగా అపూర్వ ప్రజ్ఞ కలదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రఖ్యాత జంతుశాస్త్ర వేత్త ఒకాయన యీ గుర్రాన్ని పరిశీలించి, దీనికి స్వతంత్రంగా ఆలోచించే శక్తి నిజంగానే వున్నదన్నాడు.

ఇంత మంది శాస్త్రవేత్తలు యింత గొప్పగా ఆ గుర్రాన్ని గురించి వర్ణించి చెప్పినా, అనుమానాలు వదులుకోలేని కొందరుమిగిలే వున్నారు. మరికొన్ని పరిశోధనలు సాగాయి. ఈసారి జరిగిన పరిశోధనలో పరిశోధకులు, గుర్రాన్ని

పరిశోధిస్తున్నట్లు నటిస్తూ, ఆ పరిశోధనల సందర్భంలో ఆగుర్రం తాలూకు యజమాని హెర్ ఫాన్ ఆస్టెన్ చేసే ప్రతి చర్యనూ వేయి కళ్లతో కనిపెట్టారు - ఇతగాడేమైనా ఆ గుర్రానికి కిటుకులు అందిస్తున్నాడేమో నని. కానీ-వాళ్లు ఎంత గింజుకొన్నా అలాటి సూచనలు ఏమీ పట్టుపడలేదు.

ఇల్లా కాదని. మరొక శాస్త్రవేత్త పరీక్షా పద్ధతులలో అత్యల్పమైన మార్పు ఒకటి సూచించాడు ఆమార్పు ఏమిటంటే గుర్రాన్ని పరీక్షించటం కోసం యిదివరకు ఏది వ్రాసినా ఆగ్రురం యజమాని కూడా చూస్తూ వుండేవాడు. ఇప్పుడు అల్లా చూడటానికి వీలు లేకుండా, యీ యజమానిగారే ఒక నల్లవ్రాత బల్లను తన తలపైకి ఎత్తి పట్టుకొని వుండగా, 'పరీక్షా ప్రశ్నలు' మరొక వ్యక్తి ఆబల్ల మీద వ్రాయాలనీ, ఎటువంటి సందర్భంలోనూ బల్లమీద ఏమి వ్రాసివుందో చూసే అవకాశం యీ యజమానికి యీయరాదనీ యీ శాస్త్రవేత్త అన్నాడు. అల్లాగే పరీక్ష చేశారు. ఆశ్చర్యం!-అంతకు ముందు ప్రతి పరీక్షలోనూ సమాధానాలు చెప్పి నూటికి నూరు మార్కులు సంపాదించిన యింత తెలివిగల గుర్రమూ, యీ శాస్త్ర మార్పు చేసేనరికి వుత్త 'బండబ్బాయి' మొఖం పెట్టేసి గుడ్లు మిటకరిస్తూ నిల్చుండి పోయింది. అంతలావు హెచ్చవేతలు మంచినీళ్ల ప్రాయంగా చేసి పారేసిన యీ 'మేధావి' యీ శాస్త్ర మార్పు మూలంగా 'రెండు రెళ్లు ఎంతా' అంటే చెప్పలేక పోయింది.

తన మేధావి గుర్రం యింతగా పప్పులో కాలు వేసెయ్యటంతో దాని యజమానికి వెర్రి గంగురులెత్తుకొచ్చాయి. అతనికి తలకొట్టేసినంత అవమానమైంది ఇంతకు ముందు జరిగిన ఏ పరీక్షలో గానీ తాను ఆ గుర్రానికి సమాధానాలు అందించలేదని ప్రమాణాలు చేసి చెప్పాడు. తానైతే ఆ గుర్రానికి ఎల్లాటి 'కాపీలు అందించలేదని' చెప్పాడే కానీ, పరీక్షా పద్ధతిలో జరిగిన ఆకాస్త మార్పు మూలంగా ఆగుర్రం అంత హీనంగా తప్పిపోవటం ఎందుకు జరిగిందో ఆ విషయానికి మాత్రం అతగాడు సరైన సమాధానం యివ్వలేక పోయాడు. మళ్ళీ యజమానే ముందుకు వచ్చి ప్రశ్నలు అడిగినా, అతడే నల్లబల్ల మీద వ్రాసినా, ఆ గుర్రం-పోయిన తెలివితేటలు తిరిగి వచ్చినట్లుగా-ప్రతి దానికీ రక్కున సమాధానాలు యిచ్చెయ్యటం ఆరంభించింది.

ఆ తరువాత శాస్త్ర వేత్తలందరూ కూర్చొని పరిస్థితి నంతటినీ మొదటి నుంచీ తిరగతోడి ఏ అంశానికి ఆ అంశంగా విడదీసి ఆలోచించారు. దాంతో బోధపడింది అసలు కిటుకు.


ఆ గుర్రం తాలూకు యజమాని తానుగా కావాలని ఆగుర్రానికి ఎటువంటి కిటుకూలూ అందించేవాడు కాదు కానీ, అనుకోకుండా ఆయన ముఖకవళికల్లో వచ్చే మార్పులను ఆ తెలివైన గుర్రం ఆధారాలుగా తీసుకొని ప్రతి పరీక్షలోనూ సరైన సమాధానాలు యిచ్చేదని తేలింది. ఆగుర్రం కాలి మడమతో నేలమీద కొట్టటం ఆరంభించగానే, యజమాని తన ప్రాణాలు వుగ్గబట్టుకొని, దాని కాలికేసే చూస్తూ, తానూ ఆశబ్దాలను పైకి వినపించకుండా లెక్కపెట్టుతూ వుండేవాడు. గుర్రం యిచ్చిన సమాధానం రైటు కాగానే యజమాని ముంఖంలో అదొకరకమైన సంతృప్తి భావం మెరిసేది. ఈ మెరుపే ఆ గుర్రానికి సూచనగా వుండేది. ఆసూచన అందగానే ఆగుర్రం నేలమీద మడమతో కొట్టటం ఆపేసేది. కాబట్టి ఆగుర్రం లెక్కలలో ఫీట్స్ చేసినా, భౌగోళిక విషయాలకు సంబంధించిన సమాధానాలు యిచ్చినా, సంగీత శాస్త్రం మీద అభిమానం వ్యక్తం చేసినా, నిజానికి ఆ సమాధానాలు, ఆ అభిప్రాయాలు అన్నీ కూడా దాని యజమానివే కానీ, ఆగుర్రానికి మాత్రం 'క' అంటే 'కం' రాదని తేలిపోయింది.

(ఇంకావుంది)


భార్య: మన మేడమీద అద్దెకు వుంటున్న ఆయనకు మన అబ్బాయి ఆడుకోవటం యిష్టంలేదల్లే వుంది!

భర్త: ఏం?

భార్య: ఆయన పొద్దున మనవాడి చేతికి ఒక కత్తి యిచ్చి, దాంతో వాడు రోజూ వాయించుకొనే ఆ మద్దెలను కోసి లోపల ఏముందో చూసి చెప్పమన్నాడట!



అశ కావార "నా చెల్లెలు"లో జి. వరలక్ష్మి.



అశోకావారి "నా చెల్లెలు"లో సూర్యకళ, చలం

మనచిత్రాల కథా వస్తువులు

ప్రస్తుతపు తెలుగు సినిమాల కథావస్తువులను రెండురకాలుగా విభజించవచ్చును జానపదాలు, సాంఘికాలు నిర్మాణంలో ఉన్న వాటిలో జానపదాలకంటె సాంఘికాలే ఎక్కువగా ఉన్నాయి ఏడాది రెండేళ్ళనుండి నిర్మాతల మోజు జానపదాలనుండి సాంఘికాల వైపు మళ్ళింది ఇలా మోజు మళ్ళిందనటానికి చిహ్నంగా ఒక సంస్థవారు మన జానపదచిత్రాలమీద సెటైర్ గా ఉండే జానపదచిత్రం తీస్తున్నారని తెలుస్తోంది

జానపదచిత్రాలన్నిటికీ కొన్ని సామాన్యలక్షణాలున్నాయి మాయలు, మంత్రాలు, ఏ దేశానికీ, ఏ కాలానికీ సంబంధించని కథలు, దేవతల్లాంటి నాయికా నాయకులు, రాక్షసులవంటి విలన్ పాత్రలు, పాశ్చాత్య నృత్యాలు, ఫోక్ సంగీతం, హాలీవుడ్ చిత్రాల సెట్టింగులు మొదలైనవి ఈ చిత్రాలు కొన్నేళ్ళపాటు ప్రజలను అమితంగా ఆకర్షించి విశేషంగా ఆర్జించిపెట్టాయి క్రమంగా వీటిమీద ప్రజలకు మోజు తగ్గింది ఇప్పుడు నడిచేది సాంఘికచిత్రాల యుగం

ఇప్పుడు తయారయ్యే సాంఘికచిత్రాలు చూస్తే వీటికీ జానపదచిత్రాలకు సరిహద్దు రేఖ ఎక్కడ గీయాలో తెలియటం లేదు కథాకాలాల్లోను, దుస్తుల్లోను తేడాలు తప్పిస్తే ఈ రెంటికీ మరేవిధమైన తేడా లేదు వాటిలో ఉన్నట్టే వీటిలోను నృత్యాలు, పాటలు, దైవిక సంఘటనలు, సెటింగులు, అవే రకం పాత్రలు కనిపిస్తాయి మన సాంఘికచిత్రాలు మారువేషం వేసుకొచ్చిన జానపదచిత్రాలనిపిస్తాయి తప్ప సాంఘిక స్వభావం ఏ మాత్రమూ వాటిలో ఉండదు సాంఘిక సమస్యలను

★ మన చిత్రాల కథావస్తువులు ★

చిత్రించ వూనుకున్న చిత్రాలుకూడా ఇదే ధోరణిలో ఉంటున్నాయి. సాంఘిక సమస్యల పైపై స్వరూపం చూపించటంతప్ప లోతులకు పోయి వాటి వాస్తవ స్వభావాన్ని అవి చూపించడంలేదు. పౌరాణిక కథలు, భక్తులగాథలు తీసిన నిర్మాతలందరూ గొప్పదైవ భక్తులని మనం ఎలా భ్రమించలేదో అలాగే ప్రజా సమస్యలతో చిత్రాలు తీసేవారిని కూడా 'వీరు ప్రజాకళాకారు'లని మనం అంగీకరించలేకపోతున్నాం. పౌరాణిక చిత్రాలు తీసినవారికి ధనార్జన ప్రధానాశయమైనట్లే సాంఘిక సమస్యాచిత్రాలు తీసినవారికి కూడా అదే ప్రధానాశయమైంది. అందువల్లనే ఉత్తమసాంఘిక చిత్రం ఇంతవరకూ వెలువడలేకపోయింది.


మనసాంఘిక చిత్రాల్లోని ముఖ్యలోపం కథల్లో వుంది. జానపద, పౌరాణిక కథలకంటె సాంఘికకథలు ఎక్కువ వాస్తవికంగా ఉండాలి. వాస్తవికత అంటే ఏమిటి? సంఘంలోని యథార్థపరిస్థితులను, వాటి అంతరార్థాలను కళలోచిత్రించటం వాస్తవికత అవుతుంది. వాస్తవిక చిత్రణ చూసినప్పుడు 'ఇది యథార్థజీవితంలోంచి కోసి తెచ్చిన ముక్క' అనిపించాలి. యథార్థసంఘటనలను సాధారణీకరించటం ద్వారా (*Generalisation*), విశ్వజనీనం చెయ్యటం ద్వారా కళాకారుడు తన కళలో వాస్తవికత సాధించగలుగుతాడు. మన సాంఘిక చిత్రాలు తీసుకుంటే ఈ గుణం లోపించటం కనిపిస్తుంది. రైతుల బాధలు వస్తువుగా తీసుకున్న "పేదరైతు" చిత్రంలో కొత్త జమీందారు మంచివాడవటం మూలంగా రైతుల బాధలన్నీ తీరిపోయినట్లు, అంతా సుఖంగా ఉన్నట్లు చూపబడింది. యథార్థపరిస్థితి కిది ఎంతో దూరం. రైతులబాధలు తీరిపోవటం ఆ కథారచయిత ఊహాపథంలో జరిగినదేగాని యథార్థంగా జరగలేదు. జరగనిదాన్ని జరిగినట్లు ఊహించుకుని సమస్య పరిష్కారమై పోయిందనుకోవటం ఆత్మవంచన తప్ప మరేమీ కాదు. ఏ సమస్య అయినా తీసుకున్నప్పుడు అది పరిష్కారమై పోయినట్లు చెప్పవలసిన అవసరం లేదు. సమస్యను ఉన్నదున్నట్లుగా చిత్రిస్తేనే అది వాస్తవికం అవుతుంది. అలాగే "పల్లెటూరు" చిత్రంలో షావుకారు గణపతి జైల్లోపడిపోగానే నాయకుడు నాయికను పెళ్లిచేసుకోవటం, అంతా సుఖంగా వుండటం చూపబడుతుంది. ఇది కూడా యథార్థానికి భిన్నమైనదే.

గోర్కీ రాసిన 'మదర్' నవల వాస్తవిక చిత్రణకు ఉదాహరణగా తీసుకోవచ్చును. కథావస్తువు 1905 లో రష్యాలో జరిగిన విప్లవం నాటిది. ఆ విప్లవం విజయంపొందలేదు. ఆవిప్లవానికి 'తల్లి' పాత్ర ప్రతినిధిలాంటిది. విప్లవోద్యమంలో ఆమె కష్టపడి పనిచేస్తుంది. చివరికామె పోలీసులకు చిక్కుతుంది. భౌతికంగా ఆమె పరాజయం పొందినప్పటికీ నైతికంగా ఆమెకు విప్లవంలోగల విశ్వాసం పరాజయం పొందదు. ఆమెకు పరాజయం లేనట్లే విప్లవానికి కూడా పరాజయంలేదని, ఆ ఉద్యమం తాత్కాలికంగా దెబ్బతిన్నా చనిపోలేదనీ 'మదర్' నవల చదివినతర్వాత అర్థంచేసుకుంటాం. గోర్కీ కళాకారుడు గనక జరగనిదాన్ని జరిగినట్లు ఊహించుకోలేదు. విప్లవం జరిగిందనీ, ఆ తరవాత ప్రజలంతా సుఖంగా ఉన్నారనీ రాస్తే అది అవాస్తవిక రచన అయ్యేది. జీవితం, మొదట్లో సుఖంగా ప్రారంభమై, మధ్యలో కష్టాలువచ్చి, చివరికి కష్టాలు తీరిపోయి సుఖంగా ముగిసే కథ లాంటిది కాదు. జీవితం ఒకచోట ప్రారంభమై ఒకచోట ముగిసేదికాదు. అవిచ్ఛిన్నంగా సాగుతూంటుంది.

సాంఘిక చిత్రం అన్నప్పుడు అందులో ఈ అవిచ్ఛిన్నత కనిపించాలి. అంతా సుఖంగా వున్నారు అని చిత్రం ముగిస్తే అది కృత్రిమం అవుతుంది. "చిత్రం పూర్తవటం పూర్తయింది గాని కథ ఇంకా వున్నది, ఆ కథ జీవితంలాగానే అవిచ్ఛిన్నంగా సాగుతూనే వుంటుంది" అని అనిపించాలి మన చిత్రాలు నాయికా నాయకులు పెళ్ళాడటంతోనో, చనిపోవటంతోనో సమాప్తమవుతాయి ఆ తరువాత వాళ్లనిగురించి తెలుసుకోవలసింది, ఆలోచించవలసింది ఉండదు. వాళ్ల జీవితం అక్కడితో ఆఖరు.

అసలు ఏ కథనైనా సుఖాంతంగాని, దుఃఖాంతం గాని చెయ్యవలసిన అవసరమే లేదు. సాధారణంగా జీవితంలో ప్రతి సుఖం వెనకా దుఃఖం దాగి వుంటుంది; ప్రతి దుఃఖం వెనక సుఖం దాగి వుంటుంది. ఈవిధంగా చిత్రించటమే గొప్ప కళ.

మన సాంఘికచిత్రాల్లోని పాత్రీకరణం కూడా జానపద చిత్రాల్లోలాగే వుంటున్నది. రెండేరకాల పాత్రలు: సన్మార్గులు, దుర్మార్గులు. పాత్రలకు తెలుపు నలుపు రంగులు తప్ప మరొక రంగు ఉండదు. మంచివాళ్లు అతి మంచిగా, చెడ్డవాళ్ళు అతి చెడ్డగా వుంటారు. వారి ప్రవ



తన చెల్లెలికి పెళ్లి అవుతున్నది హృద్రోగితోనని తెలిసివుండీ చేయగలిగింది లేక ఆశీర్వదిస్తున్న అన్న గోపీ—

అరుణా ఫిల్మ్స్ వారి గుమాస్తాలో పేకేటి శివరామ్, మనోహర్.



వాహిని వారి "పెద్ద మనుషులు" సెట్స్‌మీద జయలక్ష్మి, కె వి రెడ్డి, రేలంగి, అసిస్టెంటు తిలక్.
"ఆనంద మానందమాయెనే, మనకున్న మతి కాస్త పోయెనే" అని శంకరయ్య (రేలంగి) పాడుకుంటూవచ్చి
చెల్లెలు సుందరమ్మ చెవిలో "సుందరమ్మ ముండమోపి ఆయెగా" అంటాడు

ర్తనకు పుట్టుకతో వచ్చిన మంచితనం, చెడ్డతనం తప్ప మరొక కారణం కనిపించదు ఆ పాత్రలకు భౌతిక జీవితమే తప్ప మానసిక జీవితం ఉండదు జీవితంలో వచ్చే కష్ట సుఖాలమూలంగా మానసికంగా పెరగటం గాని, దృక్పథం విస్తరించటం గాని ఉండదు. కథ మొదట్లో ఎలా వుంటారో చివరకూడా అలాగే వుంటారు తప్ప డెవలప్ కారు

ఇంతవరకూ మన జానపద, సాంఘిక చిత్రాలను గూర్చి చర్చించాం ఈ రెండు రకాలూ గాక మనకు మూడోరకం చిత్రమే లేదు ముఖ్యంగా చారిత్రక చిత్రాల జోలికి మనవా రెవ్వరూ పోవటమే లేదు చారిత్రక చిత్రాలకు ఖర్చు ఎక్కువవుతుందనే సాకు ఉన్నదిగాని ఎంత ఖర్చయినా జానపద చిత్రాలకు అయినదానికంటె ఎక్కువ కాదు. జానపదచిత్రాల్లో వేలకు వేలు ఖర్చుపెట్టి బ్రహ్మాండమైన సెట్టింగులు నిర్మిస్తున్న మన నిర్మాతలు చారిత్రక చిత్రాలకవసరమైన సెట్టింగులు నిర్మించలేరా? మనకు బోలెడు ప్రాచీన చరిత్ర, ఆధునిక చరిత్ర ఉన్నది ప్రాచీన చరిత్రలో పరిశోధనలు చేసే ఓపిక లేక



"పెద్ద మనుషులు" సెట్స్‌మీద కె. వి. రెడ్డి, కొమ్మూరి పద్మావతీ దేవి, రేలంగి, జయలక్ష్మి.



“మావగారు చచ్చి చెడి డబ్బు పంపిస్తూంటే ఆనంద డోలికలలో కేరింతలు కొడుతున్న విద్యార్థి సోదరులు”
రాజా ప్రొడక్షన్స్ ‘పుట్టిల్లు’ చిత్రంలో రాజారావ్, రమణారెడ్డి.

మనచిత్రాల కథా వస్తువులు

పోతే కాంగ్రెసు ఉద్యమం ప్రారంభమైనప్పటినుంచీ జరిగిన చరిత్ర తీసుకున్నా ఎంతో ఇతివృత్తం దొరుకుతుంది. గత చరిత్రను చూసి గర్వపడే ఏజాతి అయినా ఆచరిత్రను కళాఖండాలలో శాశ్వతం చేసుకుని ఉంచుకుంటుంది.

చారిత్రిక చిత్రాలుపోతే డాక్యుమెంటరీ చిత్రాలు, న్యూస్ రీల్ చిత్రాలు ఉన్నాయి. ప్రభుత్వపు ఫిల్ము డివిజన్ తప్ప ప్రైవేటు నిర్మాత లెవరూ ఈ శాఖ జోలికి పోవటంలేదు. అమెరికా లాంటి దేశాల్లో నిర్మాతలు వివిధ విజ్ఞాన విషయాలను ప్రజలకు సులభగ్రాహ్యంగా ఉండేటట్లు చిత్రాలు తీస్తున్నారు. వాల్ట్ డిస్నీ పక్షుల జీవితం మీద, జంతువుల జీవితం చక్కటి చిత్రాలు తీశాడు. ఇవి వ్యాపారరీత్యా కూడా అతనికి ఎంతో లాభసాటిగా కనబడ్డాయి. అమెరికన్ నిర్మాతలు డాక్యుమెంటరీలు, సైంటిఫిక్ చిత్రాలే కాకుండా న్యూస్ రీల్ చిత్రాలు కూడా విధిగా నిర్మిస్తారు. ప్రపంచం మూలమూలలకీ ఫొటోగ్రాఫర్లను పంపించి రీల్సు తీయించి విడుదల చేస్తారు. మన నిర్మాతలు కూడా ఈ పద్ధతి ఎందుకు అవలంబించకూడదు? దేశంలో జరిగే ప్రధాన సంఘటనలను సినిమాలుగా తీసి డిస్ట్రిబ్యూట్ చెయ్యవచ్చు. అందరూ కథాచిత్రాలమీదనే పడి ఒకరి నొకరు అనుకరిస్తూ కూర్చోనక్కర్లేదు. కొత్తకొత్త దారులు తొక్కి మార్గదర్శకులు కావచ్చు. దీనికంతా సంస్కారం, సాహసం ఉన్న నిర్మాతలు ముందుకు రావటం అవసరం. ★


సినిమా వార్తలు

“పొట్టి శ్రీరాములుగారి పూర్ణాహుతి”

ఆంధ్రరాష్ట్రంకోసం నిరాహార దీక్ష పూని ప్రాణత్యాగంచేసిన శ్రీ పొట్టిశ్రీరాములుగారి అంతిమ యాత్రకు సంబంధించిన దృశ్యాలు రాజా ప్రొడక్షన్సువారు సినిమా తీశారు. సుమారు ఒకరీల్ పొడుగున్న ఈ వార్తాచిత్రం మొదట శ్రీ రాములుగారి స్వస్థలమైన నెల్లూరులోను, తరవాత మిగతా ఆంధ్ర కేంద్రాల్లోను విడుదల చేశారు. ఈ చిత్రం గత బుధవారంనాడు రాజా ప్రొడక్షన్సువారు పత్రికలవారికి చూపించారు. సాంబమూర్తిగారి యింటి నుంచి ఊరేగింపు బయలుదేరి నగరవీధుల గుండా దహనస్థలం చేరేవరకూగల సమూహ దృశ్యాలను ఈ చిత్రంలో చూడవచ్చు. ముఖ్యమైన దృశ్యాలు అనేకం లోపించటంవల్ల కొంత అసమగ్రంగా వున్నప్పటికీ కొన్ని దృశ్యాలనైనా ఆంధ్రప్రజలు చూసే అవకాశం కలిగిస్తున్నందున ఈ



భాస్కర్ ప్రొడక్షన్సువారి “బతుకు తెరువు”లో సూర్యకాంతం, రేలంగి.



శ్రీ పొట్టి శ్రీరాములుగారి అంతిమయాత్రా దృశ్యాలను షూట్ చేస్తున్న రాజా ప్రొడక్షన్స్ బృందం.

చిన్న చిత్రం సంతృప్తికరంగా ఉన్నది దీని తాలూకు కాపీలు ఒక్కొక్కటి 500 రూపాయలకు అమ్మటానికి తాము సిద్ధంగా ఉన్నామని, వాటిపై వచ్చే లాభాలు శ్రీరాములుగారి స్మారకార్థం ఏర్పడే ఏ కమిటీకైనా అర్పించ దలచామనీ రాజా ప్రొడక్షన్సు తరఫున రాజారావుగారు వెల్లడించారు.

ఈవిధంగా న్యూస్ రీల్స్ తీసి ప్రజాబాహుళ్యానికి అందజేసే పని మిగతా సంస్థలవారు కూడా నిర్వహిస్తే బాగుంటుంది.

* * *

అశోక్‌కుమార్ స్వయంగా నిర్మిస్తున్న "పరిణీత" (శరత్ నవల) హిందీచిత్రంలో అశోక్‌కుమార్, మీనాకుమారి, అసిత్ బరన్, మనోరమ, ప్రతిమాదేవి, నజీర్ హుస్సేన్ మొదలైనవారు నటిస్తున్నారు స్క్రీన్‌ప్లే రాసినవారు బిమల్‌రాయ్ వజేంద్రగౌర్, దర్శకుడు బిమల్‌రాయ్ ప్రఖ్యాత గాయకుడు హేమంతకుమార్ ప్లేబాక్ పాటలు పాడుతున్నాడట ఇటీవలే రెండు పాటలు రికార్డుచెయ్యబడినట్లు తెలుస్తోంది

* * *

ప్లేబాక్ గాయకురాలు లతా మంగేష్కర్ భారతీయ సంగీతంమీద తీస్తున్న చిత్రం జనవరి ఆఖరున బొంబాయిలో విడుదల అవుతుందట బొంబాయి నగర్నరు ప్రదర్శనం ప్రారంభిస్తారట ఆతరువాత మిగతా కేంద్రాల్లో కూడా విడుదల అవుతుందట ఈ చిత్రంపై వచ్చే లాభాలు భారతదేశంలోగల ప్రజాహిత సంస్థలకు అర్హమని తోచినవాటికి విరాళంగా ఇస్తామని లతా మంగేష్కర్ ప్రకటన చేస్తున్నది (ఆమె ఎడ్రెసు 24-బి, వాఘం స్ట్రీట్, పోష్టుబాక్సు 1021, బొంబాయి-1)

న్యూ థియేటర్సువారు ప్రస్తుతం నాలుగు చిత్రాల నిర్మాణం తలపెట్టారట ప్రబోధ్ సన్యాల్ వ్రాసిన "బనహంసీ" చిత్రాన్ని కార్తీక ఛటర్జీ డైరక్టు చేస్తున్నాడట ఈ చిత్రం ప్రారంభోత్సవం ఈనెల 12 న జరిగింది ఆరోజునే "వివాహబంధన్" అనే మరొక చిత్రం షూటింగ్ ప్రారంభమైంది ఇందులో అరుంధతి, బసంత్ చౌధురి మున్నగువారు నటిస్తున్నారు దర్శకుడు హేమ్‌చందర్, సంగీతం పంకజ్ మల్లిక్ ఇదిగాక సుబోధ్ మిత్ర దర్శకత్వాన "నవీన్ జాత్ర" అనే మరొక్క చిత్రం హిందీ బెంగాలీలలో చురుగ్గా తయారవుతున్నదట భోలానాధ్ మిత్ర దర్శకత్వాన "బకుల్" అనే ఇంకొక చిత్రం నిర్మించటానికి న్యూ థియేటర్సువారు సన్నాహాలు చేస్తున్నారు ఇవన్నీ పూర్తయితే న్యూ థియేటర్సువారి చిత్రాల సంఖ్య నూరు అవుతుంది ★



పిల్లలు ఆనందంగా ఆడుకుంటుంటే ఆఇల్లు స్వర్గంకదూ? అవరిండియా వారి "నాయిల్లు"లో
కృష్ణమూర్తి, సుధాకర్, లక్ష్మి

★ "నా యిల్లు" కథ ★


మధ్యతరగతి కుటుంబికుడైన శివరాం సుందరం చెట్టియార్ బాంకులో మేనేజరు. శివరాం భార్య శారద సంసారాన్ని గౌరవంగా దిద్దుకుపోయే ఇల్లాలు. వారికి ముగ్గురు పిల్లలు. పెద్ద పిల్లవాడు గోపి, రెండోవాడు హరి, చివరి పిల్ల లక్ష్మి. ఈ పిల్లలు చిన్నప్పట్నించీ తల్లిదండ్రుల క్రమశిక్షణలో పెరుగుతున్నారు.

ఉదయాన సూర్య నమస్కారాలు చేయటం, తర్వాత దైవప్రార్థన చేయటం – అది కాగానే భోజనాలు చేసుకొని శివరాం పిల్లల్ని బడిలో దిగబెట్టి తను ఆఫీసుకు వెళ్లిపోయేవాడు.

శివరాం పనిజేస్తున్న బాంకు (ప్రొప్రైటరు సుందరం చెట్టి. ఆయన భార్య పేరు ధనమ్మ. వాళ్ళకు ఒక్కగాను ఒక్క కొడుకు 'కుమార్' అని. ధనమ్మ తమ్ముడు ధనరాజు అక్కగారి అండచూసుకుంటూ బావగారింట్లో జేరి, బావగారి బాంకులో అసిస్టెంటు మేనేజరుగా పని జేస్తున్నాడు. ఇతనికి దుర్వ్యసనాలు జాస్తి. సుందరం చెట్టి శివరాం అంటే ఎంతో గౌరవమ్మూ, నమ్మకమూ.

తన దుర్వ్యసనాలకు అడుగడుక్కీ అడ్డొస్తున్నందువల్ల శివరాం అంటే ధనరాజుకు మొదట్నించీ పట్టరాని కోపం. ధనరాజు తన మేనల్లుడు 'కుమార్' చేత ఇంట్లో దొంగతనాలు చేయించి ఆ సొమ్ము దుబారా ఖర్చులకు వినియోగించేవాడు. ధనరాజుకు 'లీల' అని ఒక ఉంపుడుగత్తె ఉంది.

'లీల' నవనాగరికతను బాగా అలవరచు



ఎమ్ ఆర్ ఏ వారి "లేడీడాక్టర్"లో కృష్ణవేణి, జగదీశ్వరి, విజయకుమార్

ఎన్న యువతి కొద్దో గొప్పో అయిదు నాట్యంలో ప్రావీణ్యం ఉంది నర్తకి కూడా లీలదగ్గిర 'ఉమాపతి' అనే నమ్మకస్తుడైన జీతగాడు ఉన్నాడు

ఆఫీసు వదలి ఇంటికొస్తే శివరాం తన పిల్లలతో కలసిపోయి ఆటలాడుతుంటే వాడు ఇలా హాయిగా ఆడుతూ పాడుతూ శివరాం తన భార్యా బిడ్డల్తో కాలం గడుపుతుంటుంటే ఒకసారి సంక్రాంతి పండగొచ్చింది ఆ రోజు శివరాం పిల్లలు రేడియోలో వాళ్ళ నాన్నగారు నేర్పిన పాటలు పాడారు వాళ్ళ బళ్ళో 'లవకుశ' నాటకంలో వేషాలేశారు పిల్లల నాటకాన్ని శివరాం, శారద చూస్తూ తన్మయులైపోతుంటే ఇంతలోకి ప్రొప్రైటరు దగ్గరనించి శివరాంకు పిలుపు వస్తుంది

శివరాం యజమానిదగ్గర కెళ్తే "హఠాత్తుగా బొంబాయిలో బంగారం ధర అమాంతంగా పెరిగిపోయే సూచన్లు కనిపిస్తున్నై అని మన బొంబాయి కొతాదారుడు ఫోనులో చెప్పాడు అందుకని అయిదు లక్షల రూపాయల బంగారాన్ని మనకోసం కేటాయించి ఉంచమనీ, మీరొచ్చి డెలివరీ, తీసుకుంటారని నేను ఫోనులో చెప్పాను మీరు అర్జంటుగా వెళ్ళి పని పూర్తిచేసుకరావాలి" అని చెప్పి, అయిదు లక్షల రూపాయల చెక్ ఇచ్చి పంపుతాడు

దీన్నంతా పొంచి పొంచి కనిపెడుతున్న ధనరాజు శివరాంను నాశనం చెయ్యడానికి ఇదే చక్కటి అవకాశమనుకొని, లీల ఇంటికొచ్చి శివరాంతోపాటు బొంబాయి వెళ్ళి, అతన్నెలాగైనా మోసం జేసి అయిదులక్షలరూపాయల బంగారాన్ని దోచుకరమ్మని లీలను ఉసిగొలిపిపంపుతాడు

లీల శివరాం వెళ్తున్న రైలుకే, శివరాం ఎక్కిన పెట్టెలోనే ఎక్కి, అతనితో పాటు ప్రయాణంచేస్తూ మెల్లమెల్లగా పరిచయం జేసుకుంటుంది. బొంబాయి రైలుస్టేషన్లో హరీష్, శివరాంకు గొప్ప స్వాగతాన్నిస్తాడు లీల, శివరాంలు ఒకే హోటల్లో ప్రక్క-ప్రక్క గదుల్లో దిగుతారు

లీల, హరీష్‌లు కూడబలుక్కొని, కుట్ర పన్ని శివరాంను టీపార్టీకి పిలుస్తారు అది కాగానే లీల శివరాంను తనవశం చేసుకొని, మోసగించి అతనుకొన్న బంగారాన్ని కాస్తా కాజేస్తుంది.

శివరాం లీలకోసం వెతుక్కుంటూ హరీష్ ఇంటికొచ్చి లీలను తన బంగారాన్ని తనకిచ్చేయమని బ్రతిమాలుతాడు లీల అతన్ని కాలితో తన్ని తరిమెయ్యబోతే పోలీసుకు ఫోనుచేయటానికి ప్రయత్నిస్తున్నప్పుడు హరీష్ అతన్ని వ్వత్తి

"నా యిల్లు" కథ

తప్పేట్లు కొట్టి రైలుపట్టాలమీద పడేసి రమ్మని తన రౌడీ స్నేహితుల్ని ఇచ్చి పంపుతాడు.

రైలుపట్టాలమీద పడేసిన తర్వాత శివరాంకు స్పృహవచ్చి, తన చేతి ఉంగరాన్ని అపహరిస్తున్న వ్యక్తితో కలయబడుతాడు. అప్పుడే రైలు వస్తుంటుంది. అదృష్టవశాన శివరాం తప్పించుకుంటాడు. రెండోమనిషి రైలుక్రిందబడి చచ్చిపోతాడు.

రైలుపట్టామీద చనిపోయిన మనిషి ఆకారమేమీ తెలియనందువల్ల, అక్కడ శివరాం తాలూకు కాగితాలూ, వస్తువులూ దొరకటంవల్ల ఆ చనిపోయింది బాంకు మేనేజరు శివరామేనని పోలీసువారు దర్యాప్తు జరిపి రూఢిగా నిర్ణయించి, సుందరం చెట్టికి, శివరాం కుటుంబానికి తెలియజేస్తారు.

దిక్కు, దారి తెలియక తిరిగొస్తున్న శివరాం రైల్లో ప్రయాణీకులు చదువుతున్న పత్రికద్వారా తాను చనిపోయినట్లుగానూ, తన యజమాని అభిమానంకొద్దీ తన కుటుంబానికి ఎంతో ధనసహాయం చెయ్యబోతున్నట్లుగానూ వింటాడు. తన బ్రతుకు ఎడారిపాలైనా, తన ఆలుబిడ్డలైనా సుఖంగా ఉంటే తన కదే చాలనుకొని ఇంటికి రావాలనే ప్రయత్నాన్ని విరమించుకొని ఏకాకిగా ఊరూవాడా తిరుగుతూ చివరకు బెజవాడలో పాకీగూడాన్ని చేరుకుంటాడు. ఇతన్ని చూచి జాలిపడి పాకీ గూడెంవారు ఇతన్నాదరించి వాళ్ళల్లో ఒకణ్ణిగా చేర్చుకుంటారు.

శివరాం పోవటంతో ధనరాజు అడ్డంకులన్నీ తీరిపోయాయి. బావగారి బాంకులో మేనేజరైనాడు. దాంతో శివరాం సంసారానికి బావగారి సొత్తు చిల్లిగవ్వైనా పోకుండా చేసి వాళ్ళను కష్టాలపాలు చేస్తాడు. శివరాం భార్య శారద తన పసిబిడ్డల్తో అన్నమో రామచంద్రా అని అల్లాడిపోతుంది. శివరాం యిల్లు కట్టించడానికని చేసిన ఋణం తాలూకు వడ్డీ పెరిగి పెరిగి చివరి కాయింటినే వేలానికి తెస్తుంది. దాన్ని ధనరాజే కొంటాడు.

శివరాం భార్యా పిల్లలూ దిక్కులేని పక్షుల్లాగా నానాబాధలూ పడుతున్న సమయంలో 'బాలానంద' సంఘంవారు ఆదరించి శివరాం పిల్లలకు ఉచితంగా సంగీతం నేర్పిస్తారు. ఆ ముగ్గురి పిల్లలూ శ్రద్ధతో సంగీతం నేర్చుకుంటుంటారు.

ఇలా 12 సంవత్సరాలు గడిచినై.

శివరాం పిల్లలు పెరిగి పెద్దవాళ్ళయ్యారు. సంగీతంలో అఖండమైన పాండిత్యాన్ని సంపాదించారు.

లీలా, ధనరాజులు శివరాంను దోపిడీ చేసిన డబ్బుతో 'లీలా ధనరాజ్' ఫిలిం కంపెనీ అంటూ ఒక సినిమా కంపెనీ పెడతారు. కాని కొద్దిరోజుల్లోనే ధనరాజు చేసే అత్యాచారాలవల్ల లీలకూ, ధనరాజుకూ మనస్పర్ధలు ఏర్పడతాయి.

శివరాం పిల్లలు గొప్ప గాయకులై కావలసినంతకీర్తినీ, ధనాన్నీ ఆర్జిస్తారు. ధనరాజు శివరాం కూతురు లక్ష్మిమీద కన్నేసి తన మేనల్లుడైన కుమార్‌తో 'లక్ష్మిని నీకిచ్చి పెళ్ళిచేస్తా'నని చెబుతూ, తన ఫిలింకంపెనీలో ప్లేబాకు పాటలు పాడటానికని కుమార్ చేత 'లక్ష్మికి' కబురు పంపుతాడు.

శివరాం పిల్లలు ఊరూరాపాట కచ్చేరీలు జరుపుతూ తమ తండ్రి పాకీ వాడుగా ఉంటున్న ఊరికొస్తారు. శివరాం తన పిల్లల పాటకచ్చేరీకివచ్చి, పాడినపాటలు విని మనసు మళ్ళినవాడై వాళ్ళ ఊరు వచ్చేస్తాడు.

ఆరోజు శివరాం కూతురు లక్ష్మిపుట్టిన రోజు పండగ. ఇంట్లో పండగవేడుకలు మహావైభవంగా జరుగుతుంటాయి. శివరాం వచ్చి వాకిట్లో కిటికీలోంచి వాటినంతా చూసి మురిసిపోతుంటాడు. కాని ఇంతలోనే దోవన బోతున్న పోలీసు శివరాంను చూసి దొంగఅనే అనుమానంతో పట్టుకుంటాడు. తనభార్యాబిడ్డలు తనను గుర్తుపట్టకుండానే శివరాం పోలీసుచేతుల్లోంచి బైట పడతాడు.

కాని ఇంతలోనే 'లీలాధనరాజు' ఫిలింకంపెనీ కారు వాళ్ళ వాకిట్లో ఆగుతుంది. దాంట్లోంచి ఉమాపతి దిగి లక్ష్మిని, హరిని తీసుకొని కారులో వెళ్ళిపోతాడు. తను ఈ గతికొచ్చింది లీలవల్ల, ఉమాపతివల్ల! 'వాళ్ళతో తన కుటుంబానికేమిటి సంబంధం?' అని ఆలోచించుకొని ఇదివరకు తన బ్యాంకుఉన్న చోటికి వెళ్ళి విచారిస్తే ఆ బాంకు దివాలాతీసి కొన్నేండ్లయిందనీ, సుందరంశెట్టి చాలాకాలం క్రితమే చనిపోయాడనీ, ఇప్పుడు ధనరాజు సినిమాకంపెనీ అంటూ ఒకటిపెట్టి కనబడ్డ ఆడదానికల్లా అన్యాయం చేస్తున్నాడని తెలిసి పరుగు పరుగున ఆ సినిమా కంపెనీకి బయలుదేరుతాడు.

దుష్టతలంపుతో ఉన్న ధనరాజు లక్ష్మిని రిహార్సల్స్‌కని పిలిపించి, ఒంటరిదాన్ని చేసి బలాత్కరించబోతుంటే లీల అడ్డుపోతుంది. ధనరాజు లీలను ధిక్కరించి కొడతాడు. లీల ప్రతీకారం తీర్చుకోటానికి పోలీసువారికి ఫోనుజేస్తుంది. కాని ధనరాజుమాత్రం లక్ష్మిని విడవకుండా బలాత్కారం చేయబోతుంటే శివరాం వచ్చి లక్ష్మిని రక్షిస్తాడు. ఇంతలోకే పోలీసువారు వస్తారు.

పోలీసువారు ఈ కొట్లాటకేసును విచారణజరుపుతారు. కోర్టులో లీల ధనరాజు చేసిన దుర్మార్గాలను బైటపెడుతుంది. హరీష్ వచ్చి తన నేరాలను ఒప్పుకుంటాడు. శివరాంను గుర్తుపడతారు.

ధనరాజు, హరీష్, ఉమాపతులకు కోర్టువారు కఠినశిక్ష విధిస్తారు. నిజాన్ని బైటపెట్టినందుకని లీలను క్షమిస్తారు. శివరాం తన భార్యాపిల్లల్ని కలుసుకుంటాడు.

కాలక్షేపం

(5-వ పేజీ తరువాయి)

"ఆంధ్రులు"; "ఆంధ్రసీములు" అమూల్యరత్నములకైనను ఆంధ్రసీమలను విడనాడరు. ఆంధ్రులఉద్యమం విశాలాంధ్రోద్యమంగా విస్తరిస్తుంది. అప్పుడు ఆంధ్రులు అఖిల భారతభూమిలో అప్రతిమానులు-అజేయులు - దుర్జయులు - నిర్జరులు. ఇదే ఆంధ్రోద్యమసారామృతం - "కాని సాధనవిధాన మార్గం కంటకావృతం. కోరికసిద్ధించడం ఆంధ్రులసుకృతం,

అసతో మాసద్గమయ
తమసోమా జ్యోతిర్గమయ
మృత్యోర్మా అమృతం గమయ
—బృహదారణ్యకోపనిషత్

"అసత్యమైన దానినుండి
సత్యమైనదానిలోనికి
చీకటిలోనుండి వెలుగులోనికి
మృత్యువునుండి అమరత్వంలోనికి
నన్ను నడిపించుము".

శ్రీరాములు గారుఉపదేశించిన ప్రాయోపవేశ పరమార్థమిది. యీనిశ్చితార్థం సర్వసమగ్రంగా, సమర్థంగా సాధించడం నిపుణమతుల లక్షణం.

"నిశ్చితార్థంబు విడువరు నిపుణమతులు"

ప్రశ్నలు..సమాధానాలు

ఆర్. ఎస్. శాస్త్రి — పెనుమాక.

సినిమాలలో కథ, పాటలు, మాటలు, ఒకరే వ్రాస్తారా? లేక వేరు వేరుగా వ్రాస్తారా? ఈ రెంటిలో మీరే రకమైన చిత్రాలు రాణిస్తాయంటారు?

—ఒకరే వ్రాసిన చిత్రాలూ, వేరు వేరు వ్యక్తులు వ్రాసిన చిత్రాలు కూడా ఉన్నాయి. చిత్రాలు రాణించటం, రాణించకపోవటం ఈ విషయంమీద ఆధారపడి వుండదు.

* * *

ఎస్. వెంకటాద్రి నాయుడు—తుమ్మపూడి.

విద్యార్థులు సినిమాలు చూచుట వలన లాభమా నష్టమా?

—సినిమాలు చూడటంవలన అందరికీ వచ్చే లాభనష్టాలే విద్యార్థులకూ వస్తాయి. విద్యార్థులకు ప్రత్యేకంగా వచ్చే లాభనష్టాలేమీ లేవు.

రాజ్ కపూర్ తండ్రి ఎవరు? వీరిద్దరూ ఏఏ చిత్రాలలో నటించారు?

—రాజ్ కపూర్ తండ్రి పృథ్వీరాజ్ కపూర్. వీరు నటించిన చిత్రాలు ఎన్నో ఉన్నాయి. పృథ్వీరాజ్ పెద్దవాడు కనుక ఎక్కువ చిత్రాల్లో నటించాడు.

* * *

ఎం. శ్రీశైలం—సిరిసిల్ల.

నటుడు శ్రీ ఎ. నాగేశ్వరరావును గురించి మీ అభిప్రాయమేమి? దేవదాసు పాత్రను సమర్థతతో నిర్వహించు శక్తియున్నదా?

—తన సినిమా జీవితం అంతటిలోకీ 'దేవదాసు' పాత్రయే అతి కష్టమైనదీ, నటనాప్రతిభకు అవకాశమిచ్చేది అని నాగేశ్వరరావు అభిప్రాయం. అందుచేత ఎక్కువ శ్రమతీసుకుని ఆ పాత్ర నిర్వహిస్తున్నాడని తెలుస్తోంది. ఫలితం నిర్ణయించవలసింది మనం.

* * *

జి. సత్యం—పిట్టలవానిపాలెం.

మన సినిమా తారలలో ఎంతమంది ఎక్కువ చదివినవారున్నారు? మరి నటనకు విద్యకు సంబంధం వున్నదా?

—మన తారలలో గ్రాడ్యుయేట్లు చాలమంది వున్నారు. విద్య ఏమీ లేకపోయినా బాగా నటించేవారూ, విద్యవుండీ నటించలేని వారూ ఉన్నారు. కాని మంచినటన చేతనైనవారికి విద్య, విజ్ఞానం ఉండేటట్లయితే నటనను కొత్తమార్గాల్లో వృద్ధి చేసుకోడానికి అవకాశాలెక్కువ ఉంటాయి.

* * *

డేగా రాధాకృష్ణయ్య నాయుడు—నెల్లూరు.

'కళ' నిర్వచనం ఏమిటండీ? మానవుని జీవితంలో కళ ఏ విధంగా, ఎంతవరకు ఉపకరిస్తుంది?

—ఏ పనినైనా నేర్పుతో చెయ్యగలగటం కళ అనిపించుకుంటుంది. దొంగతనం బాగా చేస్తే అదీ ఒక కళే. కాని లలితకళలని వేరే వున్నాయి: కవిత్వం, చిత్రకళ, శిల్పం మొదలైనవి. ఇవి మానవ జీవితానుభవాలను ప్రతిబింబిస్తాయి. అందమైన తివాసీ అల్లటం కళయే; కాని లలితకళ కాదు; అందులో జీవితానుభవం వ్యక్తం కావటంలేదు కనక. లలిత కళలను ఆస్వాదించేవాడికి వెంటనే ఏమీ ఉపయోగం కనబడదు. కాని అతడిలో అవి క్రమేణా సంస్కారం, వికాసం కలిగిస్తాయి.

* * *

శ్రీ యం. సీను—పుత్తూరు.

ప్రేమకోసం ఒక స్త్రీయో, లేక పురుషుడో తన మతమును మార్చుకొనుటలో మీ ఉద్దేశమేమి?

—ముక్తిని సాధించుటకై ఒక ప్రత్యేక మార్గమును అనుసరించి, దాని యందే గాఢమైన నమ్మకముకలిగి ఆత్మప్రబోధం పొందుతున్నాము. అటువంటి ఆత్మవిశ్వాసాన్ని మతం అంటారు. మతవిశ్వాసం అనేది ముక్తికాంతను చేబట్టుటకొరకుగాక, ముద్దకాంతను చేబట్టుటకొరకై ఉపయోగిస్తే అది మతవిశ్వాసం కాదు. అట్టివానిది మతముకాదు. అది వట్టి మమత.

* * *

శ్రీ బి. బాలకృష్ణయ్య—మద్రాసు.

అన్ని భాషలలోను ఛందస్సు ఆధారంగా తీసికొనే పద్యాలు వ్రాస్తారా? ఛందస్సు తెలుగులో మాత్రమేనా ఉన్నది?

—పద్యాలకు ఛందస్సు భాషలన్నింటిలో ఉంది. కాని, ఛందస్సులేని పద్యాలు కూడా ఉన్నాయి. ఛందస్సు ఉంటేనే పద్యం అవుతుంది అని భావించడం వట్టి ఛాందసం.

* * *

శ్రీ కల్లి సూర్యనారాయణరావు—పెరంబూరు.

శ్రీ రాజాజీగారు మద్రాసులో 100,28 మంది మాత్రమే తెలుగువారున్నారన్నారు. మీ అభిప్రాయమేమిటి?

—మద్రాసులో 100 కి 16 వంతు మాత్రమే ఆంధ్రులున్నారని శ్రీ రాజాజీగారు అన్నారు. శ్రీ రాజాజీగారి లెక్క నూటికి 16 వంతులు నమ్మవచ్చును.

* * *

శ్రీ జొన్నవిత్తుల వేంకటేశ్వర శర్మ, బందరు.

దేవాలయముల యెదుట ధ్వజస్తంభము ఉండుటకు కారణములు ఏవి? ధ్వజస్తంభము అనగా నేమి?

—దేవాలయము అనేది పవిత్రస్థలము. అట్టి పవిత్రస్థలము ఎక్కడ ఉన్నదో దానిని దూరప్రదేశమందు ఉన్నటువంటి వారు కూడా గుర్తించగల్గుటకై ఎత్తయిన ధ్వజస్తంభమును స్థాపించి, ఆ స్తంభమున కొక జెండాను కట్టవలెను. లేదా కొన్ని గంటలను కట్టి మ్రోగించవలెను. ధ్వజము అనగా జెండా కట్టుటకై ప్రత్యేకింపబడిన మ్రాను... రాజులకు రథములమీదను వారి మందిరముల మీదను వారి జెండా ఉంటుంది. రాజులకు రాజైన పరమేశ్వరుని మందిరమునకూడ ఒక పతాక ఉండవలెను.

* * *

శ్రీ నోరి రామమూర్తి—బాపట్ల.

"కట్టె, కొట్టె, తెచ్చె" అనే మాటకు అర్థమేమిటి?

—రామాయణము అంతా మూడు ముక్కలలో చెప్పవలసినదని ఒక పెద్దమనిషి ఒక పండితుని అడిగాడు. అందుకు ఆ పండితుడు "(1) కట్టె (2) కొట్టె (3) తెచ్చె" అని జవాబు చెప్పాడు. ఆమూడు మాటలకు అర్థం ఏమనగా, రాముల వారు

★ ప్రశ్నలు - సమాధానాలు ★

లంకకు సేతువుకట్టి, రావణుని యుద్ధములో చావగొట్టి, సీతను అయోధ్యకు తెచ్చెను.

* * *

శ్రీ శింగం కోటేశ్వరరావు—మోడుమూడి.

పురాణాలు కల్పన అని చరిత్రకారులు ఋజువు చేస్తూ ఉన్న యీ రోజులలో రేడియో కార్యక్రమములలో పురాణ కాలక్షేపములు జరుపుటలో గవర్నమెంటు వారి ఉద్దేశ్య మేమిటి?

—పురాణములు అనేవి ఎంతవరకు నిజము? అని ప్రశ్నించి పురాణములను పురాతన దస్తావేజులవలె పరిశీలించవచ్చు. కాని, పురాణ గాథలలో ఉన్న అగాథమైన ధర్మమథనము మనకు ఎక్కువ జ్ఞానదాయకమైనది. అందుకొరకై పురాణ పారాయణము "రేడియోలలోన పాడియగును."

* * *

శ్రీ సి.హెచ్. రామశాస్త్రులు—తెనాలి.

స్త్రీకి పురుషునితో సమాన హక్కులివ్వవలెనని నేను వాదించుచున్నాను. స్త్రీ బానిసగా ఉన్నప్పుడే పురుషుడు సుఖపడగలడని నా సహాధ్యాయుడు వాదించుచున్నాడు. మీ అభిప్రాయ మేమి?

—స్త్రీకి పురుషునితో సమాన గౌరవ మర్యాద ఉండవలెను. సమాన చిత్తవృత్తిగాని, వ్యాపారవృత్తిగాని సమాన హక్కు బాధ్యతలుగాని, కల్పించడం కృత్రిమం. స్త్రీ పురుషుల సహజప్రకృతికి విరుద్ధం. స్త్రీలో స్త్రీత్వం, పురుషునిలో పురుషత్వం భంగం కాకుండా ఉండే జీవిత విధానంవల్ల పరస్పరంగా ఒకరివల్ల ఇంకొకరు సుఖిస్తారు. స్త్రీకూడా పురుషునితో సమానమైతే స్త్రీవల్ల పురుషునకు సుఖం లేదు, పురుషునివల్ల స్త్రీకి సుఖం లేదు.

పండుగనాడు కూడా పాతమొగుడేనా అనే సామెత ఎలావచ్చింది.

—పూర్వము "కంచుకోత్సవము" అనేది ఒకటి వైష్ణవాలయములో జరిగేది. ము[illegible] పొందవలెనని కోరిన స్త్రీలు ఒక గదిలో [illegible]ను రవికలను ఉంచేవారు. వైష్ణవ స్వాములు ఆగదిలోకి వెళ్లి ఎవరికి చేజిక్కిన రవికను వారు తీసికొనేవారు. ఆ రవిక ఎవరిదో ఆ స్త్రీ ఆ వైష్ణవస్వామితో ఆనాడు పవళింపు సేవ చెయ్యాలి. ఆ విధంగా ఆమె ఆ స్వామితో పవళింపు సేవచేస్తే సాక్షాత్తు శ్రీకృష్ణులవారితో పవళించి వారిసేవ చేసినంత పుణ్యమని నమ్మేవారు. కొంతకాలము యీ దేశములో యీ కంచుకోత్సవం అమలులో ఉంది. తర్వాత బ్రిటిష్‌వారి ఏలుబడిలో ఈ ఉత్సవం నిషేధింపబడింది. అందువల్ల ఆ ఉత్సవపు పండుగరోజున కూడా పాత మొగుడేనా అనే లోకోక్తి అమలులోకి వచ్చింది.

* * *

శ్రీ టి. రామమూర్తిశాస్త్రి—నంద్యాల.

ప్రేమవివాహమన నేమి? తండ్రిగారు చేయు వివాహమునకు ప్రేమవివాహానికి గల భేద మేమి?


—"వివాహము" అనే వ్యవహారములో మూడుపార్టీలు ఉంటారు. (1) వరుడు (2) వధువు. (3) సంఘము—వివాహము అనేది సంఘముచే నిబంధింపబడిన ఒక సంప్రదాయపద్ధతి. వధూవరులకు కలిగిన సంతానము విషయములో సంఘమునకు (లేదా సంఘముచే ప్రతిష్ఠింపబడిన ప్రభుత్వానికి) బాధ్యత కొంత ఉన్నది. కనుక సంఘముయొక్క ఆమోదము, సమ్మతి ప్రతివివాహమువిషయములో ఉండడం అవసరం. సంఘము అనేది అనేక కుటుంబముల కూటం—ఒక్కొక్క కుటుంబానికి ఒక్కొక్క పెద్ద ఉంటాడు. సామాన్యంగా యిటువంటి కుటుంబ యజమాని యైనప్పుడు తండ్రి సమ్మతి ఉండడంయు క్రమం. అతని సమ్మతికూడా అవసరం. వివాహానికి కేవలము ప్రేమ మాత్రమే ప్రధానము కాదు.

ప్రేమకు, విరహమునకు గలభేద మేమి?

—ప్రేమ అనేది ఆవేశంగా వచ్చి మనవశంలో మన మనస్సు లేనప్పుడు, అనగా ఆత్మనిగ్రహం లేని స్థితిలో ఉన్నప్పుడు, ప్రేమఅనే సూత్రానికి మనము కళ్లెము పట్టలేనప్పుడు అది మనలను విరహం అనే డొంకలో పడవేస్తుంది. మనస్సుకు కళ్లెంపట్టితే, "ప్రేమ", కళ్లెం పట్టలేకపోతే "విరహం"

రాజకీయములు, ఆర్థికములు, సాంఘికములు ఈ మూడింటి అర్థ మేమి?

—ఈ మూడూ ఒక తానులో ముక్కలే. ఒక చెట్టుకొమ్మలే ఇవి వేర్వేరుగా కన్పిస్తాయి గాని, వేర్వేరు కాదు. ఒక్క దీపానికే ఆకుపచ్చ అద్దం, ఎర్రద్దం, పసుపుపచ్చ అద్దం పెట్టినప్పుడు ఆ దీపమే ఆయా రంగులలో కన్పిస్తుంది.



పంచతంత్రం
మిత్రలాభం
కర్త... విశ్వాత్ముల నరసింహమూర్తి
ఈ రీతిగా పావు-మా రెండు పక్షులూ-వాదనకు దిగినాయి;-చివరకది పోట్లాట-గా పరిణమించింది.
ఒకదాని మెడ యొకటి కొరుకుకొని నరుకుకొని మధ్యదాన కుండా నె మరణించినాయి!
"అంతఃకలహము అనర్థహేతువు: ఐకమత్యమే ఆపద బాపును; నేనొక్క ఉపాయమాలోచించితి మనమందరమూ ఒక్కసారిగా వలతో కూడా అంతరిక్షమున కెగసిపోయి ఏ దూరసీమనో వాలినచో మనకిప్పటికి గతి తప్పును గావున పదండి పోదము"
ఆ ప్రకారమే అన్ని పక్షులూ వలను మోసుకుని పైకెగిరాయి.
"ఎంతటి చోద్యం; ఎంత విచిత్రం! వలలో పిట్టలు వలతో పాటే ఆకాశంలోకి ఎగురుతున్నవే?.. ఎంత దూరమీ విధముగ పోవునో వెంబడించి నే చూచెదను."
వేటగాడు తలమీదికెత్తుకుని పక్షులు పోయే మార్గము చూస్తూ ఎంత దూరమో పరుగెత్తాడు
లఘుపతనకుడది అంతా చూస్తూ-చిత్రగ్రీవుని తెలివి తేటలకు-అబ్బురపడుతూ, ఎక్కడి దాకా-పక్షులు పోవునో చూదామనుకొని-తానూ వెంబడిస్తూ పోయింది
ఎంత దూరమో తరిమినప్పటికి పక్షులు నేలకు రాకుండుటచే, "పక్షులు పోతే పోయెను గాని, చక్కని నా వల కూడా పోయెనే!" అనుకొంటూ ఆ వేటగాడు వెను దిరిగి నెత్తిపై గుడ్డ వేసుకొని యింటికి చక్కా పోయాడు
"మృగయుడు వెనుకకు పోయెను కావున మనమిక మెల్లగ ఎగిరిపోవుదము" ఇట్లని చిత్రగ్రీవుడు కొంచెము సేపు ఏమో యోచించాడు.
"మిత్రులారా! చక్కని యోచన-తట్టిన దిదుగో వింటారా?-పాటలీపుత్ర పొంతాటవిలో-హిరణ్యకుడను మూషిక రాజూ-నా చిరమిత్రుడు వున్నాడు--అతని వద్దకు మనమేగినచో-ఈ వలత్రాళ్లను కొరికి అందరిని-బంధ విముక్తుల చేస్తాడు"
ఈ యోచనకా పక్షులు వెంటనే సమ్మతించగా చిత్రగ్రీవుడు పాటలీపుత్రం దిశగా ప్రయాణమయ్యాడు.
"హిరణ్యకుడు! ఓ చెలికాడా! చిన్ననాటి నీ ప్రియమిత్రుణ్ణి క్రందమెత్తి ఆక్రోశిస్తున్నా-వలికి వేగమె రావయ్యా!!"
"ఎవరు మీరు? ఎందుకు వచ్చారు?"
2


అంజలీ పిక్చర్సు వారి
పరదేశి
డైరెక్టర్... ప్రసాద్...
పూర్ణా రిలీజ్...

అతకని బతుకులు

(19-వ పేజీ తరువాయి)

"స్వామీజీ నిన్నక్కడికి తీసుకుపోలేదా ?" అన్నాను

"అసలు వారే పోలేదు" అన్నది, నవ్వి; ప్రపంచమంతా కిలకిలా నవ్వింది. తన కఠినత్వంలోని ఉగ్రాన్ని మరిచి, ఆ పర్వతశ్రేణి మాకు స్వాగతం పలికింది.

"మీతోపాటు నన్ను గూడా తీసుకుపోతారా?" అన్నది నావేపు తిరిగి కిందికి చూస్తూ; సమాధానంగా కొద్దిగా నవ్వి ఊరుకున్నాను.

"బహుశా యీ వాటికలో మీ రడుగు పెట్టకపోతే నే నసలు దాన్ని గురించి ఆలోచించే దాన్నే కాదేమో—ఏమైనా సరే, నేను మీతో కూడా వస్తా" అన్నది, నా కళ్లల్లోకి చూస్తూ. ఆ కళ్ళల్లో నా కళ్లు నవ్వినై, ఆనందంతో.

ఇద్దరం బైలుదేరాము, బాట ననుసరించి. తాయి ముందు నడుస్తున్నది, లేడిలాగా గంతులేసుకుంటూ. వెనకనే నేను తాపీగా అనుసరిస్తున్నాను, చుట్టూ ఉన్న ప్రపంచంలోని ఆనందాన్ని ఆస్వాదిస్తూ.

ఎప్పుడో ఒకప్పుడు, ఎక్కడో ఒకచోట ప్రతివాడికీ తృప్తి దీరే సమయం దొరక్కపోదు—వెతికి పట్టుకునే ఓపికే గనక ఉంటే. ఈ కఠిన పాషాణమయ ప్రాంతంలో నా హృదయం ఆనందంతో గంతులెయ్యటం మొదలుపెట్టింది. ఇంతకాలం నా మనస్సు వెదుక్కుంటున్న అనుభూతి యిదేనా, అనిపించింది. ముందు తాయి నడుస్తున్నది; వెనకనే నేను తేలిగ్గా అడుగులేస్తూ నడిచాను.

కాసేపటికి కాలిబాట అంతమైపోయింది. తాయి నిలబడిపోయింది, నాకోసం చూస్తూ. చుట్టూ పరీక్షగా చూశాను. అక్కడక్కడ రాళ్లు మెట్లలాగా దొవతీసినై. నేను ముందు నడుస్తూ, తాయిని వెనకనే నడిపించుకుని పోతున్నాను. ఇక చక్కని మార్గం ఉన్న సూచన్లు కనబళ్లేదు. ఇద్దరం ఒక అరుగులాంటి రాతిమీద కూర్చున్నాం, మేము నడిచివచ్చిన మార్గం కోసం వెదుకుతూ. కొండక్రింద ఆశ్రమం ఒక చిన్న బొమ్మ గిల్లులాగా కనబడుతున్నది. ప్రపంచమంతా దాదాపు చలితో నిండిపోయింది. సూర్యకిరణాలు మాకందని దూరంలో కొండను రాచుకొని ఆకాశంలోకి పాకిపోతున్నై."

"కూర్చుంటే అట్లాగే చీకటి పడుతుందేమో—పదండి పోదాం" అన్నది తాయి, లేచి నిలబడి. కన్నెత్తి ఆమెవంక చూశాను: ఆయాసాన్ని అదిమి పట్టుకుంటున్నది. నేను గూడా లేచి నిలబడి, "పద" అన్నాను. జారిపోతున్న రాళ్ళమీదిగా పాక్కుని పోతున్నాం. నేను ముందుపోయి, చేయందిచ్చి తాయిని పైకి లాక్కుని పోతున్నాను.

శిఖరం ఇంకా పదిగజాల ఎత్తునఉన్నది. చీకట్లు ఆవరించినై; సన్నని వెన్నెట్లో కళ్ళు చించుకున్నా దోవ కనబళ్లేదు. ప్రపంచమంతా అంధకారమయమై పోయినది. శిఖరం మాత్రం తెల్లని వెన్నెట్లో మెరుస్తూ వెక్కిరించింది. ఇద్దరం పక్కపక్కనే ఒక చిన్న రాతిమీద కూర్చున్నాం, ఆయాసపడ్తూ

"జీవితమే ఇంత, తాయీ" అన్నాను, మెల్లిగా.

"ఇంత ఆనందంగా ఉండదేమో ?" అన్నది.

నాకు నోటమాట రాలేదు. ఈ భయంకర ప్రయాణంలో తను ఏంసౌఖ్యం చూచిందో నాకు తెలీలేదు. మాట్లాడకుండా, ఆకాశంలో వెలిగే నక్షత్రాలవంక చూస్తున్నాను.

"మీరు లేకపోతే, నే నసలు ఇటు రాకనే పోదునుగదా ?" అన్నది.

"నిజం—ఈ కష్టం గూడా తప్పేది" అన్నాను, నన్ను నేను నిందించుకుని.

తాయి నొచ్చుకున్నది; నా బుజంమీద తల ఆనించి, "మీరు నన్ను అపార్థం చేసుకుంటున్నారు; నిజానికి ఇవ్వాళ చాల హాయిగా ఉన్నది" అన్నది.

"ఏం, హాయి ?—నాకు నిజంగా నవ్వు వస్తున్నది, తాయీ, నిన్ను చూస్తే" అన్నాను

నా వీపుమీద తనచేత్తో మృదువుగా రాస్తూ, "అబద్ధం గాదు" అన్నది; నాలో నేను నవ్వుకున్నాను.

'కొంతకాలంనుంచీ దేనికోసమో వెదుకుతున్నాను. అది దీనికోసమే ననిపిస్తున్నది, నాకు' అన్నది. తాయివంక చూశాను; గుడ్డివెన్నెట్లో ఆమె కళ్లు సంతృప్తితో మెరిసినై

చుట్టూ చూశాను. ప్రపంచమంతా వెన్నెలపూతలో మసకమసకగా కనబడుతున్నది. చల్లని గాలి ముదిరింది.

"ఇంత ఒంటరిగా ఈ నిశాసమయంలో యీ ఎత్తున కూర్చోటానికి భయం వెయ్యటంలేదా, తాయీ ?" అన్నాను.

తాయి నవ్వి, తల అడ్డంగా తిప్పింది. ఆకాశంలోకి చూశాను.

"ఈ విధంగా చచ్చిపోయినా భయం లేదు" అన్నది, కాసేపుండి. నవ్వుకున్నాను, తాయి అమాయకత్వానికి. కొంచెంసేపు నాకేసి చూసి చూశాను; మమ్మల్ని చూసి ముఖం మాడ్చుకున్నది.

ఇంతలో దగ్గర్లో ఏదో జరజరా పాకిపోతున్న చప్పుడైంది. తాయి భయంతో నా దగ్గిరికి జరిగి కూర్చుంది.

"ఇంత భయంగలదానివి, మరి రావటమెందుకు ?" అన్నాను.

"నాకేం భయం ?" అన్నది, ఒక్క అడుగున దూరంగా జరిగి. తాయివంక చూశాను. ఆకాశంవంక చూస్తున్నది; నల్లని ముంగురులు రేగి కళ్ళమీద పడ్తున్నై.

"ఇక్కడ యీ నేలమీద, కొండరాళ్లమీద ప్రాకి బాధలుపడేకంటే ఆ నక్షత్రాలమధ్య కెళ్లి ఆడుకుందాం, రారాదూ?" అన్నది తాయి, కాసేపాగి.

నేను మాట్లాళ్ళేదు. "మిమ్మల్నే ?" అన్నది, నావేపు తిరిగి.

"అదంతా ఒట్టి కల, తాయీ - జీవితంలో సుఖానుభవము నేది నా కెక్కడా కనబళ్ళేదు" అన్నాను.

"ఎక్కడా - ?" అన్నది, నవ్వి; "ఊఁహుఁ" అన్నాను: అబద్ధమని వెక్కిరించింది, మనస్సు.

ఆ రాత్రంతా అలాగే గడిపేశాం; చలిగాలి చంపుకుతిన్నది. చంద్రుడు కొండచాటుకు వెళ్లిపోయినాడు. ప్రపంచమంతా బావురుమన్నది.

సుమారు నాలుగున్నరై ఉంటుంది. ఆ సమయాల్లో ఉక్కిరిబిక్కిరై కాలం గడిపిన రోజులు గుర్తుకు తెచ్చుకున్నాను.

"ఇక తెల్లవారదా ?" అన్నది తాయి, చలికి వణుకుతూ

"జీవితంలో తెల్లవారకుండానే ఉంటుందా ?" అన్నాను, నా నిబ్బరానికి నన్ను నేనే మెచ్చుకుని.

తాయి నిద్రకి తూలటం మొదలుపెట్టింది

"జాగ్రత్త-ఇవతలికి జరుగు" అన్నాను, ఆమెని నా వేపు లాక్కుంటూ. దగ్గిరికి జరిగి నా ఒడిలో తూలి అలాగే నిద్రపోయింది.

తూరుపు దిశన తిరిగి అరుణోదయమైంది. అచేతనమై, స్తబ్ధమైపోయిన ప్రకృతి మళ్ళీ కదలటం మొదలుపెట్టింది. నిద్రపోతున్న తాయి ముఖంవంక చూశాను. - బాహ్యలోకం మరిచి నిద్రపోతున్నది. ఆ ముఖంలోని అమాయికతకు ముగ్ధుణ్ణైపోయినాను.

మెల్లిగా బుగ్గలు నిముర్తూ, "తాయీ" అన్నాను; కళ్లు తెరిచింది మెల్లిగా.

ఎం... ...ములు

సూర్యోదయమైంది. తాయి లేచి కూర్చున్నది లోకమంతా కిలకిల లాడింది. కళ్లెత్తి చూశాను, దగ్గర్లో మెరుస్తున్న శిఖరం వంక ఉదయిస్తున్న సూర్యుని కిరణాలు ఆ కొండకొన మీదిగా పాకి అవలివేపుకు సంతోషంతో గంతులేసుకుంటూ పోతున్నై.

6

దూరంగా ఆశ్రమం మళ్ళీ కనబడటం మొదలు పెట్టింది

"ఇక పోదాం పద" అన్నాను, శిఖరం కేసి చూస్తూ. తాయి కూడా అటువేపే చూసి, ఆవలించి, తూలి, పెనుకకుండా కూర్చున్నది నేను లేచి నిలబడ్డాను తాయి, ఆవలించి, తూలి, మళ్ళీ పడుకున్నది

"చూడు తాయీ, నువ్విక్కడే ఉండు నేను దోవ చూసివచ్చి, నిన్ను తీసుకెళ్తాలే" అన్నాను, నిద్రలేపటానికి యత్నిస్తూ. గుండ్రని కళ్లు పెల్లిగా తెరిచి, మళ్ళీ మూసుకుంది విట్టూర్పు విడిచి, బైలుదేరాను. ఎందుకనో హృదయాం గట్టిగా కొట్టుకున్నది, పైన మెరుస్తున్న శిఖరం నన్ను చూసి అపహాస్యం చేసింది – ఆ్త! అటా లికి తిట్టకోలేక పోయినాము.

జీవితంలో కొంచముక్కుచున్న సుఖాను భూతులు కొన్ని ఉంటై. కాలప్రవాహంలో కొట్టకుపోతూ, పూర్తిగా నిష్ప్రభా చెందకుండా, మళ్ళీ ఆశల రేపి, భావికోసం ఎదురు చూడటానికి దోహదం యిచ్చే ఘటనలు కొన్ని ఎదురుచూస్తూంటై. ఆ కొద్దిక్షణాల సుఖానుభవంలో – అదే శాశ్వతసౌఖ్యంగా పరిణమించబోతున్నదా, అనిపిస్తుంది పెనక పీల్చి పిప్పిచేసిన దుర్యోగాలు కలలేమో ననిపిస్తుంది చీకటిలోంచి వెలుగులోకి రావటం, మళ్లీ చీకటిలోకి పోవటానికేనని మరిచిపోతాం

కాని – రాత్రల్లా వుల్లిపోయిన జీవాలు, లోకంతోపాటు తమ జీవితాలు గూడా వెలుగులోకి పోకపోతయ్యా, అని కనిపెట్టుక్కుచుని, మిలమిల మెరిసే ప్రపంచంలో కగ్గిపోయిన తమ దైన్యతకు కృశించి, కృంగిపోతై, రాత్రల్లా వెలిగిన ప్రాణాలు అరుణోదయంలోనే తమ హీనతకు కుంగి, సూర్యోదయంతో నశించిపోతై

తాయి వంక దీనంగా చూసి, జాగ్రత్తగా రాళ్లమీద పాక్కుంటూ వెళ్లిపోయినాను సున్నని, నల్లనిరాళ్లు సూర్యుని కిరణాల్ని ముద్దుపెట్టుకుని ఆనందంగానవ్వినై కొండ కొనమీద నిలబడి, చుట్టూ పరికించాను తాయి ఇంకా నిద్రపోతు నేఉన్నది

దూరంగా ఏదో ఊరు కనబడ్డది నవ్వు... న్నట్లు ... వ్యామోహాల్లో పడి ... సుకుపోయ్యా మనుష్యుల్ని తల్చుకుని ... అవతరించిన ఆకాశంలో చిన్న రేణువుల్లా కనబడ్డాను, పాపు నేను. తిరిగ్గా కూచుని, "ఇలా నేను నవ్వుకున్నాను, తృప్తిగా.

క్రింద తాయిలేచి కూర్చున్నది; ఉదయకాలపు సూర్యుని కాంతిలో ఒక మెరుపు మెరిసింది తాయివంకే చూస్తున్నాను, ముగ్ధుణ్ని తాయిలేచి నిలబడ్డది;"తాయీ" అని కేక వేశాను, పర్వతాలు ప్రతిధ్వనించినై నావేపు చూసింది; మార్గంకోసం కొబోలు పైవేపు పరీక్షగా చూస్తున్నది.

"అక్కడే ఉండు – వస్తున్నాను" – కేకవేశాను తాయి వినిపించుకోలేదు; పైకి పాక్కుంటూ వస్తున్నది. నేను ఆదుర్దాగా కూర్చున్న చోటునుంచి కదిలాను.

"తాయీ – వద్దు" అని కేకేశాను, భయపడ్తూ ఆమె వినిపించుకోలేదు జారిపోతున్న రాళ్లమీద జాగ్రత్తగా కాలువేసి ... ది

"తాయీ – అక్కడ ...

తాయి వినిపించుకోలేదు,

నేను కిందికి దిగుతూ వచ్చాను

తాయి ఒక గజం కిందికి వచ్చింది. ఒక రాయి ఆసరాగా పట్టుకుని చేయందిచ్చి, "ఇటు" అన్నాను

తాయి నాచేయి పట్టుకోలేదు "మీ అవసరం లేదులెండి" అన్నది, కోపంగా, పైరాయి ఎక్కుతూ నేనే బలవంతాన పట్టుకున్నాను, పైన చాచిన చేతుల్ని

రెండుచేతుల్ని విడలించుకుంది, కాలికింది రాయి జారిపోయింది నిశ్చేష్టుణ్నై నిలబడిపోయినాను తాయి భయంకరంగా మూలుక్కుంటూ పర్వతంకిందికి దొర్లుకుంటూ జారిపోయింది ఆమె రక్తాన్ని రుచి చూసిన రాళ్లు చిందులు తొక్కినై. దూరంగా శిఖరం వె ... గా నవ్వింది; సూర్యుడు ఆకాశంలో నవ్వుకుంటూ వెళ్ళిపోతున్నాడు (ఇంకా వుంది)

జంతుకోటిలో మానవలక్షణాలు ★

(... వ పేజీ తరువాయి)

కొంతవరకు పరిణతి పొందింది తెలుసుకోవాలంటే, ఆజంతువును, దానికి అలవాటు అయిన వాతావరణం నుంచి తప్పించి, వేరు విధమైన వాతావరణంలో ప్రవేశ పెట్టినప్పుడు, అది ఆ మార్పును ఎంత త్వరగా గుర్తించి, అలా గుర్తించిన ఆ మార్పుకు అనుకూలంగా ఎంత ఎంత వేగంగా తన నడతనూ, అవసరాలను మార్చుకో గలదో పరీక్షిస్తే తెలుస్తుంది ఈ విషయంలో కప్పలూ, చేపల కంటె పాములు చాలా మేలు. తమకు ఆహారం కాగల జీవి ఎక్కడ వున్నదీ వెదికి, దానిని వెంటబడి చంపగలశక్తి పాములకు మాత్రమే వున్నది. నీళ్లల్లో వుండే మొసలి నీటి గట్టుమీదికి ఈదుకు వచ్చి ఆహారం కోసం పొంచివుండ గలదు. అలా తిండికోసం పొంచివుండగల తెలివి తేటలు, శక్తి సామర్థ్యాలు చేపలకు లేవు.

ఆహారాన్ని ఒడిసి పట్టటంలో బల్లికి వున్న చాకచక్యం మరి ఏ జంతువుకీ లేదేమోనని పిస్తుంది ఉష్ణ మండలాలలో వుండే బల్లులు చీమల గుట్టలు చుట్టూ తిరుగుతూ, చీమల బారులు బయలు దేరితే వాటి కాటుకు అందకుండా వాటి వెనకాలే ఎంత దూరమైనా పోతూ వుంటవట. అలా పోతూ చీమలు తరిమి కొట్టిన మిడతలు ఆవీ వాటి బాధ తప్పించుకోవటానికని అటూ యిటూ దూకుతూ వుంటె, చీమలబారుకి చివరనున్న ఈబల్లి పోయి, ఆమిడతలను లటుక్కున పట్టేసుకొని గుట్టు చప్పుడు కాకుండా చప్పరించేస్తుందట. తనకు తిండిని వెదికి పెట్టే బరువు బాధ్యతలను ఈ బల్లి చీమలమీద పడేసి, తాను మహారాజులాగా పరివార సమేతంగా వచ్చి మేతమేసి పోతుందన్న మాట. (ఇంకావుంది)

Edited, Printed & Published by S Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St Madras

"నాన్నా! నాన్నా! నే రాసిన కథకు మా స్కూలు వాళ్లు ప్రైజు యిచ్చారు నాన్నా!"

"అలాగా! ఏంకథ వ్రాశావేమిటి?"

"నువ్వు వ్రాసిన కథల్లో పాత కథ ఒకటి పట్టుకుపోయి యిచ్చాను. దానికే వాళ్లు ప్రైజు యిచ్చింది.!"

ఏ తల్లి తండ్రుల పెంపకమైనా సరిగా వున్నదీ లేనిదీ, వాళ్లకు మనమల్లు పుట్టుకు వచ్చేంత వరకు బయటపడదు.

(7-వ పేజీ తరువాయి)

తురి తరఫున మేము కొంతమంది వెళ్లాం. ళ్లకు జరిగిన అవమానానికి మాకెంత పరాభవం చేస్తారో అనుకున్నాం. కాని ాంటి దేమీ జరుగలేదు. అడుగడుక్కీ కర్లు నిలబడితే అరిగిపోతారేమో అన్నట్లు ూచారు. అప్పుడు మా మనస్సుకు చాల ం వేసింది. బాబయ్య చేసిన పనికి చాల చ్చుకున్నాము. అత్తగారు పెళ్లికూతురిని ుకరించదేమో అనుకున్నాం. వాకి ళ్ళి వెళ్లగానే అత్తగారు ముత్తయిదువుల త హారతి యిప్పించింది. పెళ్ళికూతురిని గా ఏర్పాటు అయిన గదిలోకి పంపిం ంది స్వయంగా. తల్లి కొడుకులు ప్రక్క ోకి వెళ్లారు.

అమ్మా! అలా నన్ను ఒక్కడినీ వదలి ే వొచ్చేశేం? వాళ్లు కాదు మీరు ంది అవమానం......మాటమాత్రమైనా ్నారా?"

"అదేమిటిరా! నీకు ఇష్టమయింది. చేసు న్నావ్ పెళ్ళి. నీవు స్వతంత్రుడవు. ళ్లేమో అనుకున్న ప్రకారం జరుపలేదు. యిష్టం ఏమిటో? అక్కడే వుంటా ో ఎవరు చెప్పగలరు........" అని పం వున్నట్లు, లేనట్లు మాట్లాడింది. తరువాత మాటలు వినబడలేదు.

"నీతో పాటుగా నేను కూడా వచ్చేస్తాను అనుకో...పీటలమీద పెళ్లి ఎందుకు తప్పిందో అని ఆ పిల్లకు తుచ్చే కదా... మళ్ళీ ఆ పిల్లకు పెళ్లి అవటం ఎంత కష్టమో ఆలోచించు. పిసినిగొట్టు అయిన ఆ తండ్రి ...ఆ పిల్లకు...పెళ్లి......చెప్పలేనమ్మా. డబ్బు లోభంచేత ఒక ఆడపిల్ల జీవితం పాడుచెయ్యటం బాగుంటుందా చెప్పు. మన సులోచన బ్రతికివుంటే దానికి ఇలా జరిగితే......" తల్లి మనస్సు మంచి మాటలతో కరిగించాలని అంటున్నాడు, పెళ్లికొడుకు.

నాకు, మణికి చాల ఆదుర్దా కలిగింది. తలుపు సందులోంచి చూశాము, ఆ తల్లి ఏమంటుందో, ఏం జరుగుతుందో అని.

"అందుకనేరా అబ్బాయ్, దౌర్జన్యంగా నిన్ను మాతో రమ్మని అనకుండా, అసలు నీతో చెప్పకుండానే వచ్చేశాం. నీసంగతి నాకు తెలుసు...నీవు ఎలాగూ నా కోడలిని తీసుకొని వస్తావని. నా కోడలు నా యింటికి వస్తుందనే ధీమా అత్తకు వుండటం సహజమే...ఇందులో తప్పేమీ లేదు. వాళ్ల పిల్లను చేసుకొన్నాం. గతిలేనివాళ్లమని వాళ్లు అనుకుంటారు. కాని మర్యాదకోసం కట్టుబడివున్నాం. డబ్బు శాశ్వతమూ అని మనం అనుకున్నట్లు వాళ్లు అనుకోరురా. అందుకని మర్యాద కాపాడుకోవటానికి అలా వచ్చెయ్యవలసి వచ్చింది" అన్నది.

"అమ్మా..." అన్నాడు, ఒక్కసారి తల్లిని కౌగలించుకొని. మాకు ఒక్కసారి ఆనందం, వుత్సాహం కలిగింది. అవన్నీ వింటున్న పెళ్లికూతురు కళ్ల నుండి ఆనందాశ్రువులు రాలినయ్. మణికీ నాకూ మామ్మ మాటలు జ్ఞప్తికి వచ్చినయ్. ★

[illegible]

(17-వ పేజీ తరువాయి)

చూడాలిరా. సీతారత్నం పెళ్లి ఎలాగో అయిందనిపించాము ఇంక దీని బాధ్యత కూడా ఉంది వాళ్ళ నాన్న ఉంటే లక్షాధికారికో డుకు కిచ్చి వైభవంగా పెళ్ళి చేసే వాడు' అన్నది చెమ్మగిల్లిన కళ్ళను చీర కొంగుతో అదుకుంటూ.

'[illegible]రించక త్తయ్యా, నేనున్నాను గా, మన న్యక్తుకో [illegible] సంబంధం [illegible] తీసుకొస్తాను. నీకెందుకో భయం? అలా నేనెందుకు వచ్చాననుకున్నావు? ఆ శుభవార్త చెప్పటానికే నా స్నేహితు [illegible] పిల్లను చూడటానికి వస్తా [illegible] సంబంధం అంతా నే చూసు [illegible] న్నాను.

అత్తయ్య ముఖం చేటంతయింది 'ఎంత మంచివాడవురా! నిజంగా నా మీద నీ కెంత అభిమానం [illegible]' అని నన్ను [illegible]

[illegible] తలిదండ్రులతో రమణ [illegible] చూడటానికి వచ్చాడు వాళ్ళ కూడా [illegible] సర్టి [illegible] ఆమెకు ఈడుజోడు సంగీతం, [illegible], మొదలైనవాటిలో పరీ [illegible] యిగారు. అత్తయ్య [illegible] లోనికి [illegible]

'అబ్బాయి మన్మథుడలాగున్నాడు ఈ

సంబంధం కుదిరితే నా మనసు ఎంతగా శాంతిస్తుంది' అన్నది కవిత్వభావంలో (అత్తయ్య నవలలూ, పుస్తకాలూ తెగ చదివింది)

'అదంతా నా చేతిలోపన త్తయ్యా నువ్వు మతరామూ విచారించనక్కర్లేదు. ఆ యబ్బాయి నా ప్రాణమిత్రుడు నేను గీచినగీటు దాటడు 'పెళ్ళి మానేయ్' అంటే మానేస్తాడు 'పెళ్ళి చేసుకో' అంటే చేసుకుంటాడు '[illegible]లో ఉరుకు' అంటే అంతపనీ చేస్తాడు అంతేనేమిటి? అసలు వాళ్ల కుటుంబమంతా నా ఆజ్ఞను శిరసావహిస్తారు. వాళ్ళందరికీ నేను గురు [illegible]' అన్నాను గర్వంగా అత్తయ్య సంతోషంతో తబ్బిబ్బులయింది

'ఒరేయి! అన్ని ఆశలూ నీమీద పెట్టు కున్నానురా. ఈ పెళ్లి జరిగేట్టు చూశావంటే నీకు [illegible] ఋణపడివుంటా! నేనెంత నిస్సహాయ స్థితిలో ఉన్నానో నీకు తెలుసుగా నువ్వు తప్పించి నాకు మరెవరున్నారు? అంతా నిమీదుంది మరేం చేస్తావో!'

'నీకేం భయంలేదత్తయ్యా ఈ పెళ్ళి స్థిరపరిచే భారం నాది వాళ్లి నొప్పిస్తాను మరోమాట నువ్వు చిల్లిగవ్వకూడా కట్నం ఇవ్వనక్కరేకుండా చేస్తాను నేనున్నానుగా నామాటే వాళ్ళకు వేదవాక్యం!'

అత్తయ్య భూమిమీద నిలువలేక పోయింది.

మరికొన్నాళ్ళకు—

అత్తయ్య ఇంటికి వెళ్ళాను నన్ను చూడగానే ఆమెకు కోపం దుఃఖం పొంగు కొచ్చాయి

'ఇలాగేనా చెయ్యటం? అంత గొప్పగా చెప్పావు! అంతా నీచేతుల్లో ఉన్నట్టు చెప్పావు నీమాటే ప్రధానమని చెప్పావు లేనిపోని ఆశలు కలిగించావు వాళ్లు పిల్లను చూచి పోయి రెండు నెలలు కావచ్చింది వాళ్ల జాడా లేదు నీ జాడా లేదు'

'నాతప్పేముంది? నేను నన్ను [illegible] వాళ్లి నొప్పించాను సర్దుకు చేసుకోటాని కొప్పుకున్నారు కట్నం దమ్మిడీ ఇవ్వనక్కరలేదన్నారు పెళ్లి ఖర్చులు కూడా వాళ్ళే భరిస్తామన్నారు. ఈ పెళ్లి తమకు యిష్టమేనని ఉత్తరం రాశారట నువ్వు

ఏమన్నిషి అయినా పెద్ద మనిషో తెలుసు వాలంటే, ఆమనిషి తన దానివల్ల దమ్మిడీ లాభిలే పోయినా మరొక మని ఎంతవరకు గౌరవంగా చూ గలడో, తెలుసుకొంటే చా —బయటపడిపోతుంది.

[illegible] గా ఊరుకుంటే దానర్థ వే [illegible] కోపం [illegible]

'ఉత్తరం రాశారా? నాకే అందలేదే! అంతా మాయ-కల్పన'

'ఆ మాటంటే నేను ఒప్పు [illegible] దాని [illegible] వాళ్ళు [illegible] [illegible] ఈ [illegible] వెనవలు. ఒక్క ఉత్తరం కూడా [illegible] చేరరు నువ్వు [illegible] పెళ్లికి, [illegible] లేఖ [illegible] కుండా పోయినట్లుంది [illegible] [illegible] ఒక [illegible] [illegible] తిరిగివచ్చింది

అత్తయ్య ముఖంలో కత్తివాటుకు నెత్తురుచుక్క లేదు

'వస్తాను' అని బయలుదేరబో 'కాఫీ తాగి పోరా' అని బలవం తాగించింది. ఎంతలో ఎంత [illegible] వంటింట్లో [illegible] వినిపించి 'అసలు [illegible] కని పెళ్ళేవాడు [illegible] అంటోంది అత్తయ్య 'మన తానికి [illegible]' అని [illegible] సమాధానమి

మరికొన్నాళ్ళకు—

[illegible] వచ్చింది [illegible] అని మాత్రం అత్తయ్యదగ్గరుమండే పెళ్ళికి శుభలేఖ నన్ను తప్పక పదేపదే ప్రార్థిస్తూ మరొక ఉత్తరం వచ్చింది!

Edited, Printed & Published by S Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St M.